
RNI TELTEL/2024/89620

# నేటి శుభోదయం

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

ప్రచురణ : తెలంగాణ, సంపుటి 02, సంచిక 51, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -12, ఆదివారం - 24 - మే - 2026 , వెల రూ.5/-







## యాదగిరిగుట్ట టెంపుల్ సిటీని తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో

# ఉన్నతంగా తీర్చిదిద్దే సంకల్పంలో భాగంగా ఈ ప్రాజెక్టులకు శ్రీకారం

### తెలంగాణలోనే అతిపెద్ద వేద పాఠశాల సముదాయ నిర్మాణానికి భూమిపూజ

- ★ రూ. 99.55 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు ఆలయ అనుబంధ అభివృద్ధి పనులకు ఈ సందర్భంగా శంకుస్థాపనలు
- ★ రూ. 43.80 కోట్ల అంచనా వ్యయంతో 15 ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణం
- ★ హోమాలు, యాగాలు నిర్వహించడానికి ప్రత్యేక శాలలతో పాటు ఒక గోశాలను కూడా ఏర్పాటు
- ★ వేద పాఠశాలకు భూమిపూజతో పాటు రూ. 43.12 కోట్లతో డార్మిటరీ హాల్స్ దీక్షాపరుల సదనం నిర్మాణం



హైదరాబాద్: ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పరిధిలో తెలంగాణలోనే అతిపెద్ద వేద పాఠశాల సముదాయ నిర్మాణానికి భూమిపూజ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. కంచికామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీ శ్రీ శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి వారి దివ్య సమక్షంలో జరిగిన ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో మిగతా.. 2లో

## 'హైదరాబాద్ నగర పోలీస్' మరో చారిత్రాత్మక ముందడుగు



- ఏఐ కాప్ రైటర్... యాప్ ను ఆవిష్కరించిన సజ్జనార్
- అందుబాటులోకి కృత్రిమ మేధ ఆధారిత మొబైల్ యాప్
- 10కి పైగా భారతీయ భాషలను గుర్తించే సామర్థ్యం

2లో

## సమాజానికి గొడ్డలి పార్టీ హానికరం గొడ్డలి పార్టీ నెవర్ ఎగైన్ అని పిలుపు



2లో

- అది ముమ్మాటికీ గొడ్డలి పార్టీనే.. ఇవిగో 11 నిదర్శనాలు
- చిత్తూరు జిల్లా కండ్రిగలో సంజీవని సభ



# తెలంగాణలో భానుడి ఉగ్రరూపం..

### రానున్న నాలుగు రోజులు అప్రమత్తంగా ఉండాలి

వడదెబ్బతో 34 మంది మృతి

తెలంగాణలో కొనసాగుతున్న తీవ్రమైన ఎండలు, వడగాలులు

వడదెబ్బ కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 34 మంది మృతి

కుమ్రం భీం జిల్లాలో రికార్డు స్థాయిలో 46.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

18 జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం భానుడి భగభగలతో అగ్నిగుండంలా మారుతోంది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో నిప్పుల వర్షం కురుస్తుండగా, మిగతా.. 2లో

## మోదీతో మార్కో రూబియో కీలక చర్చలు..

# అమెరికా రావాలని ఆహ్వానం



2లో

- నాలుగు రోజుల భారత పర్యటనలో రూబియో
- భద్రత, వాణిజ్యం సహా కీలక రంగాలపై చర్చ
- యుద్ధం నేపథ్యంలో భేటీకి ప్రాధాన్యం

## భవిష్యత్తులో వ్యాపార అవకాశాల్లో

# సీఏల పాత్ర కీలకం

### ఐసీఏఐ స్నాతకోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న కేటీఆర్

- ▸▸ చార్టర్డ్ అకౌంటెంట్లు కేవలం పన్నుల లెక్కలకే పరిమితం కాకూడదని సూచన
- ▸▸ సీఏలు వ్యాపారాలను వృద్ధి చేసే సలహాదారులుగా ఎదగాలని ఆకాంక్ష
- ▸▸ ముున్ముందు పన్నులు, జీఎస్టీ, వ్యాపారాల విస్తరణలో సీఏల అవసరం చాలా ఉంటుంది



హైదరాబాద్: భవిష్యత్తులో వ్యాపార అవకాశాల్లో చార్టర్డ్ అకౌంటెంట్ల (సీఏ) పాత్ర అత్యంత కీలకంగా మారుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గచ్చిబౌలిలోని మిగతా.. 2లో



# రైతుల ఆత్మహత్యలపై సర్కారు బుకాయింపు

- ▶ తీవ్ర సంక్షోభంలో పంట కొనుగోళ్లు
- ▶ ధాన్యం సేకరణపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- ▶ ముఖ్యమంత్రి అండదండలు ఉండడంతోనే పోక్సో నిందితుడిని తొలుత అరెస్టు చేయలేదు: కేటీఆర్

హైదరాబాద్: రాష్ట్రంలో పంట కొనుగోళ్ల సంక్షోభం తీవ్రంగా ఉంటే.. దాన్ని పట్టించుకోకుండా ముఖ్యమంత్రితోపాటు మంత్రులంతా మిగతా.. 2లో

# మంత్రి లోకేశ్ గొప్ప మనసు.. 11 నెలల చిన్నారి వైద్యానికి భరోసా

### కడప జిల్లా పర్యటనలో మంత్రి నారా లోకేశ్ మానవత్వం

అరుదైన వ్యాధితో బాధపడుతున్న 11 నెలల బాలుడికి అండ

చిన్నారి శ్రీవిష్ణు వైద్య ఖర్చులు తానే భరిస్తానని హామీ

ముద్దనూరులో మంత్రిని కలిసి గోడు వెళ్లబోసుకున్న తల్లిదండ్రులు

'నేనున్నాను' అంటూ బాలుడిని ఎత్తుకొని భరోసా ఇచ్చిన లోకేశ్



అమరావతి: వైఎస్ఆర్ కడప జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి నారా లోకేశ్ తన మిగతా.. 2లో

## చైనా బొగ్గు గనిలో ఘోర ప్రమాదం..

# పేలుడు ధాటికి 82 మంది దుర్మరణం



2లో

షాంక్సీ ప్రావిన్స్‌లోని లూషెన్యు బొగ్గు గనిలో ప్రమాదం

కార్బన్ మోనాక్సైడ్ లీకై పేలుడు

మరికొందరు కార్మికుల పరిస్థితి విషమం

విషవాయువు అలముకోవడంతో రెస్క్యూ సవాలు

ప్రమాదంపై చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ దిగ్భ్రాంతి



2లో

## బాధ్యతగా పని చేయకపోతే ఎలా'..?

## పచ్చదనం పెంచేందుకు 2.5 కోట్ల విత్తన బంతులు

- ▸▸ అటవీశాఖ అధికారుల తీరుపై పవన్‌కల్యాణ్ ఆగ్రహం
- ▸▸ సజ్జల కుటుంబం ఆక్రమించుకున్న భూమిని వెనక్కి తీసుకొచ్చాం
- ▸▸ గ్రీన్ కవర్ 50 శాతం పెంచడానికి వారం రోజుల్లో ఏపీ గ్రీన్ సొసైటీ ఏర్పాటు చేయాలి

అమరావతి: 'రాష్ట్రంలో 50 శాతం గ్రీన్ కవర్ ఉండాలనే లక్ష్యంతో చేపట్టిన గ్రేట్ గ్రీన్ వాల్ ప్రాజెక్టును కూడా ముందుకు తీసుకువెళ్లలేరా? మిగతా.. 2లో




## తమిళనాడులో పదేళ్ల బాలిక హత్య..

# కఠిన శిక్షపడేలా చేస్తాం

కోయంబత్తూర్‌లో ఘటన

కిరాణా సామాన్లకు వెళ్లిన చిన్నారి కిడ్నాప్, హత్య

నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి



తమిళనాడు: తమిళనాడులోని కోయంబత్తూర్‌లో ఘోరం జరిగింది. సూలూరు ఏరియాలో కిరాణా సామాన్లు తేవడానికి వెళ్లిన మిగతా.. 2లో

## భద్రాచలం చెక్‌పోస్ట్ వద్ద టేకు దిమ్మల పట్టివేత



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి,మే 23,( నేటి శుభోదయ),భద్రాచలం చెక్‌పోస్ట్ వద్ద ఆటోలో అక్రమంగా తరలిస్తున్న టేకు దిమ్మలను ఫారెస్ట్ సిబ్బంది పట్టుకున్నట్లు సమాచారం. తనిఖీల సమయంలో ఆటోలో తరలిస్తున్న టేకు దిమ్మలను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఈ వ్యవహారంలో బేరాలు, రాయబారాలు జరుగుతున్నట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది.అక్రమ కలప రవాణాపై అటవీ శాఖ అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.ఫారెస్ట్ సిబ్బంది, స్థానికులు ఘటన స్థలంలో ఉన్నట్లు సమాచారం.

## తాళ్లకొమ్మూరు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

### -- ముగ్గురి పరిస్థితి విషమం.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే 23,( నేటి శుభోదయ),మణుగూరు నుండి భద్రాచలం వెళ్తున్న ఆటో తాళ్లకొమ్మూరు క్రషర్ మిల్లు సమీపంలో అదుపుతప్పి చెట్టుకు ఢీకొనడంతో తీవ్ర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న పలువురు గాయపడగా, ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాద సమాచారం అందుకున్న స్థానికులు వెంటనే స్పందించి గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు.ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## విద్యుత్ సమస్యకు పరిష్కారం చూపిన 44 వ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ పాలెపు విజయ



వెంకటరమణ ఖమ్మం, నేటి శుభోదయ ::: ఖమ్మం నగరంలో గల 44 వ డివిజన్ లో ఆ ప్రాంత ప్రజలు విద్యుత్ సరఫరా విషయంలో అనేక చోట్ల ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో విషయాన్ని డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ పాలెపు విజయ వెంకటరమణ దృష్టికి తెచ్చారు. వారు తక్షణమే స్పందించి క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి చర్యలకు పూనుకున్నారు. శనివారం 44వ డివిజన్ లో వేసవికాలం కావడంతో లెనిన్ నగర్ లో 100 కేవీ ట్రాన్స్ఫార్మర్ లోడ్ సరిపోక గత మూడు రోజుల నుండి విద్యుత్ అంతరాయం కలగడంతో స్థానిక తాజా మాజీ కార్పొరేటర్ పాలెపు విజయ వెంకటరమణ దృష్టికి తీసుకువెళ్లాగా వెంటనే స్పందించి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు, డాక్టర్ తుమ్మల యుగంధర్, విద్యుత్ ఏఈ, డిఇ సహకారంతో 100 కేవీ ట్రాన్స్ఫార్మర్ ని తొలగించి 160 కేవీ ట్రాన్స్ఫార్మర్ ను అమర్చడం జరిగింది. ఈ కొత్త ట్రాన్స్ఫార్మర్ అమర్చటం పట్ల డివిజన్ ప్రజలు హర్షం వ్యక్తం చేసి 44 వ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ పాలెపు విజయ వెంకటరమణ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## వేలాడుతున్న విద్యుత్ తీగలు

### పట్టించుకోని అధికారులు, భయాందోళనలో గ్రామస్థులు



(నిజామాబాద్ రూరల్ సిరికొండ నేటి శుభోదయ ప్రతినిధి )నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం సిరికొండ మండలం తాళ్ల రామడుగు లోని వీధులలో ఇండ్ల పైకప్పులకు అతి సమీపంగా మరియు రోడ్లకు ఇరువైపులా విద్యుత్ తీగలు అత్యంత ప్రమాదకరమైన రీతిలో వేలాడుతున్నాయి. గాలివాన వచ్చినా, లేదా కాస్త గట్టిగా గాలి వీచినా ఈ తీగలు ఒకదానికొకటి తగిలి నిప్పురవ్వలు ఎగిసిపడుతున్నాయి. ఒక్కోసారి ఇండ్ల గోడలను, పైకప్పులను తాకేలా ఈ వైర్లు కిందకు వంగిపోవడంతో స్థానిక ప్రజలు, ముఖ్యంగా చిన్న పిల్లలు మరియు వృద్ధులు తీవ్ర భయాందోళనల మధ్య జీవిస్తున్నారు.గ్రామ వీధుల్లో నడిచేటప్పుడు ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ విషయమై స్థానిక విద్యుత్ శాఖ అధికారులకు గతంలో పలుమార్లు విన్నవించినప్పటికీ, స్పందించటం లేదు పెద్ద ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవించక ముందే, ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే ఈ ప్రమాదకరమైన విద్యుత్ తీగలను సరిచేయాలని, లూజ్ వైర్లను బిగించి స్తంభాలను క్రమబద్ధీకరించాలని గ్రామ ప్రజలు పత్రికా ముఖంగా



డిమాండ్ చేస్తున్నారు ఇదే విదంగా ప్రధానంగా గ్రామానికి వచ్చే విద్యుత్ తీగలు కూడా చెట్ల మధ్యలో ఉండి గాలి వచ్చినపుడు మాటలు రేగుతున్నాయి అని లైన్మెన్. ఎ ఇ గార్లకు పలుమార్లు విన్నవించిన స్పందించడం లేదు అని గ్రామ ప్రజలు వాపోయారు ఇకనైనా విధ్యుత్ అధికారులు స్పందించి ప్రధాలు జరగక ముందే తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు

## జూన్ 2 నుండి 13వరకు యమునానదికి పుష్కరాలు



ఖమ్మం, నేటి శుభోదయ ::: 2026 జూన్ 2 వ తేదీ నుండి 13 వ తేదీ వరకు 12 రోజుల పాటు యమునానదికి పుష్కరాలు జరుగుతాయని సీనియర్ జర్నలిస్ట్, జ్యోతిష్య పండితులు ఎస్ వి సూర్యనారాయణ తెలిపారు. జూన్ 1 వ తేదీ అధిక జ్యేష్ట బహుళ పాడ్యమి సోమవారం రాత్రి దేవగురుడు బృహస్పతి కర్కాటక రాశిలో ప్రవేశించుటవలన మరుసటి దినము 2 వ తేదీ మంగళవారం నాడు యమునానదికి పుష్కరాలు ప్రారంభం అవుతాయని ఆయన తెలియజేసారు. ఈ నది యమునోత్రి అనే ప్రాంతంలో ఉద్భవించిందని, యమునానది అతి పవిత్రమైన జీవనది అని స్పష్టంచేశారు. ఈ నది హర్యానా రాష్ట్రం లో ప్రవహించి ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లోని ఢిల్లీ, నోయిడా, మధుర, బృందావనం, ఆగ్రా నగరాలలో ప్రవహిస్తోందని తెలిపారు. గంగానది, యమునానది, అంతర్వాహినియైన సరస్వతీ నది కలిసి ప్రయాగరాజ్ వద్ద త్రివేణి సంగమం ఏర్పడుతుందని వివరించారు. ఎంతో పవిత్రమైన యమునానది శ్రీకృష్ణ పరమాత్మ పాద స్పర్శతో పునీతమైందని ఆయన తెలిపారు. పుష్కరకాలం 12 రోజులలో యమునానది లో సంకల్పపూర్వకం గా స్నానమాచరించి జప, తప, దాన, పిండ ప్రదానములు చేయుటవలన ఉత్తమ ఫలితములు కలుగునని సూర్యనారాయణ తెలియజేసారు.

# చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

### ఎస్ఓ టు జీఎం బి. శ్రీనివాస చారి




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ మణుగూరు ప్రతినిధి, మే 23,( నేటి శుభోదయ),సింగరేణి కాలరీస్ యాజమాన్యం ఆధ్వర్యంలో మణుగూరు ఏరియా పి.వి. కాలనీ భద్రాద్రి స్టేడియంలో గత నెల 28 నుండి నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరం శుక్రవారం సాయంత్రంతో విజయవంతంగా ముగిసింది. సింగరేణి ఉద్యోగుల పిల్లల (18 సంవత్సరాల లోపు బాలబాలికలు) కోసం నిర్వహించిన ఈ ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా ఏరియా ఎస్ఓ టు జీఎం బి. శ్రీనివాస చారి విచ్చేశారు. ఈ సందర్భంగా ఏరియా ఎస్ఓ టు జీఎం బి. శ్రీనివాస చారి మాట్లాడుతూ... బాల్య దశ నుంచే పిల్లలకు చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తి కలిగించడం వల్ల వారిలో ఉత్సాహం, చురుకుదనం, పట్టుదల రెట్టింపు అవుతాయన్నారు. వేసవి సెలవుల్లో బాలబాలికలు తమ సమయాన్ని వృథా చేసుకోకుండా, వారిలోని క్రీడా ప్రతిభను ప్రోత్సహించేందుకు సింగరేణి యాజమాన్యం ప్రతి ఏటా ఉచితంగా శిక్షణ ఇస్తోందని తెలిపారు.ల్లల ఆసక్తికి అనుగుణంగా ఫుట్‌బాల్, అథ్లెటిక్స్, వాలీబాల్, కరాటే, బాస్కెట్‌బాల్ విభాగాల్లో అనుభవజ్ఞులైన శిక్షకులతో ఈ శిక్షణ ఇప్పించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ సంవత్సరం కూడా తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పెద్ద సంఖ్యలో బాలబాలికలు పాల్గొని ఈ శిబిరాన్ని విజయవంతం చేయడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని జీఎం హర్షం వ్యక్తం చేశారు. ఇక్కడ నేర్చుకున్న క్రీడలను భవిష్యత్తులోనూ తమ దినచర్యలో భాగం చేసుకుని, నిరంతర సాధనతో ఉత్తమ క్రీడా కారులుగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.

### ఆకట్టుకున్న కరాటే ప్రదర్శన:

ఈ వేడుకల్లో కరాటే విభాగంలో శిక్షణ పొందిన బాలబాలికలు చేసిన సాహసోపేతమైన డెమో (ప్రదర్శన) అందరినీ విశేషంగా ఆకట్టుకుని ప్రశంసలందుకుంది. అనంతరం, నెల రోజుల పాటు శిక్షణలో చురుగ్గా పాల్గొన్న బాలబాలికలకు ముఖ్య అతిథి ఏరియా ఎస్ఓ టు జీఎం బి. శ్రీనివాస చారి, గుర్తింపు సంఘం మరియు ప్రాతినిధ్య సంఘం నాయకులతో కలిసి స్పోర్ట్స్ యూనిఫామ్స్ పంపిణీ చేశారు. ఈ ముగింపు కార్యక్రమంలో సీనియర్ పర్సనల్ అధికారి సింగు శ్రీనివాస్ , గుర్తింపు సంఘం నాయకులు మేకల ఈశ్వర్ , ప్రాతినిధ్య సంఘం వైస్ ప్రెసిడెంట్ వి. కృష్ణం రాజు , డబ్ల్యూ పిఎస్ అండ్ జిఏ గౌరవ కార్యదర్శి డి. నరేశ్ , స్పోర్ట్స్ కో- ఆర్డినేటర్ సిహెచ్. వెంకటేశ్వరరావు , క్రీడా విభాగాల శిక్షకులు, సింగరేణి ఉద్యోగులు మరియు ఆయా క్రీడా విభాగాలలో ట్రైనింగ్ ఇచ్చిన శిక్షకులు, పెద్ద సంఖ్యలో బాల బాలికలు తదితరులు పాల్గొన్నారు.



# పేదలకు ఆరోగ్య భరోసా 'సీఎంఆర్ఎఫ్'

**– 150 మంది లబ్ధిదారులకు రూ.44 లక్షల చెక్కులు పంపిణీ చేసిన ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి – ఆటో డ్రైవర్లకు ఖాకీ చొక్కాలు అందజేత**



ఖమ్మం, నేటి శుభోదయ ::కార్పొరేట్, ప్రైవేట్ ఆసుపత్రులలో అత్యవసర వైద్య చికిత్సలు చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం కొండంత అండగా నిలుస్తోందని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి అన్నారు. శనివారం నగరంలోని గట్టయ్య సెంటర్ లో గల తన క్యాంప్ కార్యాలయంలో ఉభయ జిల్లాలైన ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం పరిధిలోని ఏడు నియోజకవర్గాలకు చెందిన 150 మంది



లబ్ధిదారులకు తన సిఫారసుతో మంజూరైన రూ.44 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను ఆయన పంపిణీ చేశారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి మద్దినేని స్వర్ణకుమారి లతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తూ, లబ్ధిదారుల దరఖాస్తులను వేగవంతంగా పరిశీలించి సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్క పేదవానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించి, అండగా నిలవడమే తన ప్రధాన లక్ష్యమని ఆయన వివరించారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులంతా ఈ సందర్భంగా ఎంపీ రఘురాం రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

### - ఆటో డ్రైవర్లు, కార్మికులకు అండగా ఉంటాం

అనంతరం వివిధ ఆటో అడ్డాలకు చెందిన వందమంది ఆటో డ్రైవర్లకు ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి ఖాకీ చొక్కాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో నిరంతరం శ్రమిస్తూ రవాణా రంగంలో కీలక పాత్ర పోషిస్తున్న ఆటో కార్మికులందరికీ తమ ప్రభుత్వం, తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని అభయమిచ్చారు.ఈ కార్యక్రమాల్లో నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దీపక్ చౌదరి, కాంగ్రెస్ నాయకులు కొప్పుల చంద్రశేఖర్, టెలిఫోన్ అడ్వైజర్ కమిటీ సభ్యులు ఉమ్మినేని కృష్ణ, రంజిత్ నాయక్, సీనియర్ నాయకులు వడ్డెబోయిన నరసింహారావు, మాజీ ఎంపీపీ గోసు మధు, డీసీసీ సెక్రెటరీ రాంపుడి రోశయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ గుమ్మా రోశయ్య, సేవాదళ్ జిల్లా అధ్యక్షులు ఎస్డి. గౌస్, కాంగ్రెస్ నాయకులు ఇమ్మడి తిరుపతిరావు, స్ఫూర్తి ఓం రాధాకృష్ణ, చల్లా రామకృష్ణా రెడ్డి, కేకేసీ జిల్లా అధ్యక్షులు విప్లవ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు జంగిపల్లి ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు బాణాల లక్ష్మణ్, మల్లెల నాగేశ్వరరావు, కాటేపల్లి కిరణ్, ఉమర్, ఎండి. గౌస్, మాజీద్, చెరుకుమల్లి రవి, దిరిశెల శ్రీనివాసరావు, ఒంటికొమ్ము శ్రీనివాసరెడ్డి, ఏలూరి శ్రీనివాసరావు, ఉభయ జిల్లాలకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పాలెపు దంపతులకు అభినందనల వెల్లువ



ఖమ్మం, నేటి శుభోదయ ::: ఖమ్మం నగరంలో గల 44 వ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ పాలెపు విజయ వెంకటరమణ దంపతుల వివాహ వార్షికోత్సవ కార్యక్రమాన్ని శనివారం డివిజన్ లో పలు చోట్ల పాలెపు అభిమానులు, స్నేహితులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల నడుమ ఘనంగా నిర్వహించారు.



తొలుత కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వేడుకలకు 44 వ డివిజన్ కాంగ్రెస్ నాయకులు,మైనార్టీ నాయకులు, సీపీఐ నాయకులు, సీపీఎం నాయకులు,కార్యకర్తలు, 44 వ డివిజన్ ప్రజలు పాల్గొని పాలెపు విజయ వెంకటరమణ దంపతులకు హృదయపూర్వక వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పాము కాటుతో వ్యక్తి మృతి



ఖమ్మం, నేటి శుభోదయ ::: ఖమ్మం నగరంలోని ముస్తాఫానగర్ మజీద్ సెంటర్లో నివసించే ఎస్ కే రహీం పాషా పాముకాటుతో మృతి చెందాడు. గత నాలుగు రోజుల క్రితం తన ఇంటిని మరమ్మత్తులు చేస్తుండగా పాము కాటుకు గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతనిని చికిత్స నిమిత్తం స్థానికంగా ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతునికి భార్య ఒక కుమారుడు ఒక కుమార్తె ఉన్నారు.

## ఇందిరమ్మ చీరలు అందని ద్రాక్షేనా...!

**– 36 వ డివిజన్ లో అధికార పార్టీ మాజీ కౌన్సిలర్ నిర్వాకం**

**– ఆ డివిజన్ లో అడుగు అడుగున మహిళలకు అన్యాయమే**

**– ఇందిరమ్మ రాజ్యంలో న్యాయం జరిగేనా...**

**– అభివృద్ధి ప్రధాత మంత్రి కే మచ్చ తెస్తున్న వైనం. పంపిణీ లో నిర్లక్ష్యం చేస్తున్న కమీషనర్, మోప్మా, కార్పొరేషన్ అధికారులే అనే అనుమానం.....**



ఖమ్మం , నేటి శుభోదయ :: ఖమ్మం నగరంలో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో గల అన్ని డివిజన్లలో ఇందిరమ్మ చీరలను మహిళలకు సజావుగా పంపిణీ జరిగింది . అయితే ఖమ్మం గాంధీ చౌక్ ప్రాంతంలో గల 36 వ డివిజన్ లో మాత్రం ఇందిరమ్మ చీరలను పంపిణీ చేయకుండా రోజుల తరబడి జాప్యం చేస్తున్నారు. ఈ తీరును పరిశీలిస్తే ఇందిరమ్మ చీరలు అందని ద్రాక్షేనా అనే ఆరోపణలు సర్వత వినిపిస్తున్నాయి. ఇందులో ఆ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ ను కాదు అని అధికార పార్టీ కి చెందిన మాజీ కౌన్సిలర్ నిర్వాకం తో పలు చోట్ల తీవ్ర నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. మహిళలకు అడుగు అడుగున అన్యాయం చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇందిరమ్మ రాజ్యంలో ఆ మహిళలకు న్యాయం జరిగేనా అనే అనుమానం కలగమానదు. నలభై ఏళ్ల అభివృద్ధి ప్రధాత గా అని చెప్పుతున్న తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు కి ఇలాంటి నాయకుల మధ్య సఖ్యత లేకపోవడం వల్ల మచ్చ తెస్తున్న వైనం ఆలస్యంగా వెలుగులోకి వస్తోంది. పేరుకే పవర్ చుట్టే రాజకీయం నడుస్తోంది అని చెప్పక తప్పదు. కానీ క్రింది స్థాయిలో మాత్రం ఆ మాజీ కౌన్సిలర్ ప్రమేయంతోనే ఖమ్మం నగర పాలక సంస్థ కు చెందిన కమిషనర్,మోప్మా, నగర పాలక సంస్థ అధికారుల తీరు పట్ల ప్రజల్లో తీవ్ర విమర్శలను ఎదుర్కొన్నారు. అయితే ఈ చీరలను అదే ప్రాంతంలో గల ఓ క్లబ్ లోని గోడౌన్ లో మూలాన మూలుగుతూ ప్లాస్టిక్ బస్తాలలో ఉచ్చి నిల్వ చేస్తున్నారు. ఇన్ని రోజులు గడుస్తున్నా ఇప్పటికీ వరకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేద్దాం అనే అలోచన రాక పోవడం శోచనీయం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, మంత్రి సైతం స్పందించి డివిజన్ లో జరుగుతున్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని తక్షణమే ఇందిరమ్మ చీరల పంపిణి కి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది మరి.



# వి ఓ ఏ ల నిరవధిక సమ్మె

**--సమ్మెకుసిపిఐ మద్దతు.--రెండో రోజుకు చేరిన సమ్మె.--న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి. :సిపిఐ మండల కార్యదర్శి రంజిత్ కుమార్.**



ఏన్కూరు, నేటి శుభోదయ:: వి వో ఏల సమ్మె న్యాయమైనదని వారి సమస్యలు వెంటనే పరిష్కరించాలని సిపిఐ మండల కార్యదర్శి జాగర్లమూడి రంజిత్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత రెండు రోజులుగా ఏన్కూరు మండల కేంద్రంలో వి ఓ ఏ ల సమ్మెకు మద్దతుగా రంజిత్ కుమార్ దీక్ష శిబిరానికి వెళ్లి సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ.... వి ఓ ఏ ల శ్రమకి తగిన వేతనాన్ని అందజేయాలని నెలకు 26వేల రూపాయల కనీస వేతనాన్ని ఇవ్వాలని, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, డెత్ ఇన్సూరెన్స్ కు 20 లక్షల రూపాయలు ఇవ్వాలని తదితర డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. సిపిఐ పార్టీ నుంచి అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ సమ్మె కార్యక్రమంలో సిపిఐ గ్రామ కార్యదర్శి మద్దినేని వెంకన్న , వి ఓ ఏ జేఏసీమండల అధ్యక్షుడు జంపాల రమేష్ , వివిధ గ్రామాల వి ఓ ఏ లు, తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ తుమ్మల యుగంధర్ కి వినతి పత్రం సమర్పించిన సర్పంచ్ తేజావత్ నవీన్



ఖమ్మం, నేటి శుభోదయ :: రఘునాథపాలెం మండలం దొనబండ గ్రామ సర్పంచ్ తేజావత్ నవీన్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు తనయుడు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ తుమ్మల యుగేందర్ ని శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. దొనబండ గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు సమస్యలను ,అభివృద్ధి అంశాలపై వినతి పత్రం అందజేశారు.గ్రామ ప్రజలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేయాలని, రైతులు తమ పొలాలకు సులభంగా వెళ్లేందుకు డొంక రోడ్ల నిర్మాణం చేపట్టాలని, అలాగే దొనబండ గ్రామానికి మరిన్ని అభివృద్ధి పనులు మంజూరు చేయాలని కోరడం జరిగింది.ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధికి ఎల్లప్పుడూ తన వంతుగా సహకారం అందిస్తామని, దొనబండ గ్రామాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని డాక్టర్ తుమ్మల యుగేందర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# భారత్ లో భానుడి భగభగ

**--- ప్రపంచంలోని 100 నగరాల్లో 97 ఇక్కడే!**

హైదరాబాద్, నేటి శుభోదయ ::: ప్రపంచంలో అత్యధిక ఉష్ణోగ్రతలు కలిగిన 100 నగరాల్లో 97 నగరాలు భారత్లోనే ఉన్నాయి. ఒడిశాకు చెందిన బలంగిర్ (48డి) బిహార్లోని సాసారామ్ (48డి) యూపీలోని వారణాసి (47డి) టాప్-3లో ఉన్నాయి. తెలంగాణ లో ఖమ్మం (47డి) సూర్యపేట (46డి) వరంగల్ (46డి) కరీంనగర్ (45డి) జగిత్యాల (45డి) ఆదిలాబాద్ (45డి) ఏపీలో రాజమండ్రి (47డి) కాకినాడ (45డి) భీమవరం (44డి) టాప్ 100లో నిలిచాయి.

## తుమ్మలపల్లి పగడేరు వాగుపై కల్వర్టు పనులు అడ్డుకుంటే సహించేది లేదు

**: మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బి చంద్రావతి**





ఖమ్మం, వైరా, నేటి శుభోదయ ::: ఖమ్మం జిల్లా, వైరా అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధి పనులను అడ్డుకోవడం దారుణమని వైరా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బి చంద్రావతి తీవ్రంగా హెచ్చరించారు.కొణిజర్ల మండల కేంద్రం నుండి తుమ్మలపల్లి వయా ధనబండ గ్రామానికి వెళ్లే రహదారిపై పగడేరు వాగుపై మంజూరైన కల్వర్టు నిర్మాణ పనులను కొందరు కావాలనే అడ్డుకోవడం రాజకీయ స్వార్థానికి నిదర్శనమని ఆమె విమర్శించారు.రైతులు, కూలీలు, విద్యార్థులు, గ్రామ ప్రజలు రాకపోకల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్న సమయంలో అభివృద్ధి పనులను అడ్డుకోవడం సిగ్గుచేటని ఆమె పేర్కొన్నారు. వర్షాకాలం ముందు కల్వర్టు పనులు పూర్తికాకపోతే ప్రజలు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటారని ఆమె హెచ్చరించారు.అభివృద్ధిని అడ్డుకోవడం కాదు, అభివృద్ధిలో పోటీ పడాలి అని హితవు పలికారు. ప్రజల సమస్యలను పట్టించుకోకపోతే ప్రజలే గుణపాఠం చెప్తారు అని హెచ్చరించారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు రాజకీయ ఒత్తిళ్లకు లోను కాకుండా కల్వర్టు నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని డా. బి చంద్రావతి డిమాండ్ చేశారు.

## సరస్వతి అంత్య పుష్కారాలకు వెళ్లే ప్రయాణికులకు భద్రాచలం నుండి బస్సు సౌకర్యం.

**భద్రాచలం డిపో మేనేజర్ జంగయ్య.**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి,మే 23,( నేటి శుభోదయ ),భూపాలపల్లి జిల్లాలో జరిగే సరస్వతి అంత్య పుష్కరాలకు వెళ్లే ప్రయాణికులకు భద్రాచలం డిపో నుండి ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ పి జంగయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇట్టి బస్సు ( డీలక్స్ ) ఈనెల 27న అనగా బుధవారం రాత్రి 10 గంటలకు భద్రాచలం బస్సు స్టాండ్ నుండి బయలు దేరి గురువారం ఉదయం పుష్కర స్నానం అనంతరం బయలుదేరి మధ్యాహ్నం 12 గంటలకు భద్రాచలం చేరునని ఆయన అన్నారు. ఈ బస్సు కు టికెట్ ధర పెద్దలకు 1000/- రూపాయలు పిల్లలకు 600/- రూపాయలు ఉంటుందని ఆయన తెలిపారు. కావున సరస్వతి అంత్య పుష్కరాలకు వెళ్లే ప్రయాణికులు ఇట్టి సౌకర్యాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరుతూ, ఇతర వివరాలకు 9553990399, 9390612253 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని ఆయన అన్నారు.




# హీట్ వేవ్‌పై రాష్ట్రవ్యాప్తంగా అప్రమత్తత

**- ప్రజల ప్రాణ రక్షణకు అత్యంత ప్రాధాన్యత**
**- వడగాల్పులతో 7జిల్లాల్లో 16 మంది మృత్యువాత**
**- మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున ఆర్థిక సాయం - రాష్ట్రంలో తీవ్రస్థాయి ఉష్ణోగ్రతలపై మంత్రి పొంగులేటి సమీక్ష**




హైదరాబాద్, నేటి శుభోదయ ::: ఎండల తీవ్రత దృష్ట్యా అధికార యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా తక్షణ చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. వచ్చే మూడు రోజుల్లో వడగాల్పుల ప్రభావం మరింత పెరగనుందని ఐఎండీ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్రంలో రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, తీవ్ర వడగాల్పుల పరిస్థితుల నేపథ్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి శనివారం సచివాలయంలో ఉన్నతాధికారులతో అత్యవసర సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా హీట్ వేవ్ పరిస్థితులపై జిల్లాల వారీగా నివేదికలను పరిశీలించి, ప్రజల ప్రాణ రక్షణకు అత్యంత ప్రాధాన్యంతో పనిచేయాలని అధికార యంత్రాంగానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో జిల్లాల కలెక్టర్ల నివేదిక ప్రకారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నలుగురు, వరంగల్ అర్బన్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో ముగ్గురు చొప్పున జోగులాంబ గద్వాల్, రంగారెడ్డి, సూర్యాపేట జిల్లాల్లో ఒక్కరు చొప్పున ఏడు జిల్లాల్లో 16 మంది వడదెబ్బతో మృతి చెందారని అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై మంత్రి స్పందిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు వడదెబ్బ మృతు కుటుంబాలకు నాలుగు లక్షల రూపాయిల చొప్పున ఆర్థిక సాయం ఇవ్వాలని ఇందుకు సంబంధించిన ప్రక్రియను త్వరిత గతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ఎండల తీవ్రత అసాధారణ స్థాయికి చేరుకుంటోంది. తీవ్రస్థాయి ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వడగాల్పుల తీవ్రత మరింత పెరిగింది. ఇలాంటి సమయంలో ప్రభుత్వ యంత్రాంగం మరింత అప్రమత్తంగా ఉండాలని ప్రజల ప్రాణాల రక్షణ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికీ తావుండ కూడదని స్పష్టం చేశారు.రాష్ట్రంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న మండలాలు, గ్రామాలను ప్రత్యేకంగా గుర్తించి అక్కడి ప్రజలకు ముందస్తు హెచ్చరికలు పంపాలని మీడియా, సోషల్ మీడియా, గ్రామస్థాయి ప్రకటనల ద్వారా ఎండలపై అప్రమత్తత కల్పించాలని ప్రజలకు అవసరమైన సమాచారం ప్రతి గంటకు చేరేలా చర్యలు తీసుకోవాలని అని అధికారులను ఆదేశించారు.బస్ స్టాండ్లు, మార్కెట్లు, ప్రధాన రహదారులు, కార్మికులు ఎక్కువగా పనిచేసే ప్రాంతాలు, ప్రజలు అధికంగా రాకపోకలు సాగించే చోట్ల చల్లని తాగునీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలి. ఒక్క ప్రాణం కూడా ఎండల కారణంగా ప్రమాదంలో పడకూడదని మంత్రి పేర్కొన్నారు.ముఖ్యంగా వృద్ధులు, గర్భిణీలు, చిన్నారులు, అనారోగ్యంతో బాధపడుతున్నవారు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసర పరిస్థితులు తప్ప బయటకు రావొద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ కూలీలు, నిర్మాణ కార్మికులు, రోడ్లపై పనిచేసే కార్మికులకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి జిల్లా కలెక్టర్ హీట్ వేవ్ పరిస్థితులను వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని మండల స్థాయి అధికారుల నుంచి గ్రామస్థాయి సిబ్బంది వరకు అందరూ ఫీల్డ్‌లో ఉండాలని ఎండదెబ్బ లక్షణాలు కనిపించిన వెంటనే చికిత్స అందించేలా అత్యవసర వైద్య సేవలను సిద్ధంగా ఉంచాలని సూచించారు.మనుషుల ప్రాణాలతో పాటు జీవరాశుల సంరక్షణ కూడా మన బాధ్యతేనని గ్రామాలు, పట్టణాల్లో నీటి తొట్టెలు, మట్టి కుండల ద్వారా పక్షులు, జంతువులకు తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రజల భద్రత కోసం అన్ని విభాగాలతో సమన్వయం చేసుకుంటూ యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతోందని, ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి ప్రభుత్వ సూచనలు తప్పనిసరిగా పాటించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరారు. వాతావరణ శాఖ తాజా నివేదిక ప్రకారం ఈనెల 26వరకు కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి,ములుగు, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలో ఎండ తీవ్రత, తీవ్రమైన ఉష్ణోగ్రతలు, వడగాల్పులు కొనసాగుతాయని వాతావరణ శాఖ హెచ్చరించిందని ఈ జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉంటూ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.

# బీరోలులో అడ్డులేకుండా సాగుతున్న మట్టి మాఫియా

**- నిద్రమత్తులో అధికార యంత్రాంగం**

ఖమ్మం, నేటి శుభోదయ ::: ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండల పరిధిలోని బీరోలు గ్రామంలో గత మూడు రోజుల నుంచి మట్టి మాఫియా అడ్డు అదుపు లేకుండా సాగుతోంది. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి, పగలు రేయి తేడా లేకుండా యథేచ్ఛగా సాగుతున్న ఈ మట్టి తోలకాలపై స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**- కోట్లలో ప్రజాధనం లూటీ,పట్టించుకోని అధికారులు**






కళ్ల ముందే ఇంత పెద్ద ఎత్తున అక్రమ తవ్వకాలు జరుగుతున్నా, చర్యలు తీసుకోవాల్సిన అధికార యంత్రాంగం చూసి చూడనట్లుగా నిద్రమత్తులో జోగుతోంది.

**- బడాబాబుల చేతుల్లో అంగబలం**

రాజకీయ, ఆర్థిక బలాలను ఉపయోగించి బడాబాబులు కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దోచుకుంటున్నారు.

**నిస్సహాయ స్థితిలో సామాన్యులు**

"ఈ అక్రమార్కులను అడ్డుకునే నాథుడే లేడా?" అని స్థానిక సామాన్య ప్రజలు నిస్సహాయతతో వాపోతున్నారు.

**- చట్టం అందరికీ ఒకటే కావాలి**

మట్టిని తవ్వి అమ్ముకోవడం చట్టబద్ధమే అయితే, ఆ అవకాశం కేవలం కొందరు బడాబాబులకేనా? సొంత అవసరాల కోసం లేదా ఆర్థిక కష్టాలు తీర్చుకోవడం కోసం సామాన్యులు కూడా మట్టిని అమ్ముకునేందుకు అధికారులు అనుమతిస్తారా? చట్టం సామాన్యుడికి ఒకలా, బడాబాబులకు ఒకలా పని చేస్తుందా అని గ్రామానికి చెందిన పలువురు ప్రశ్నిస్తున్నారు.

**అధికారుల తక్షణ కర్తవ్యం**

ప్రజాధనాన్ని కొల్లగొడుతూ, పర్యావరణానికి ముప్పుగా మారిన ఈ మట్టి మాఫియాపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలి. నిద్రమత్తు వీడి, బీరోలు గ్రామంలో జరుగుతున్న అక్రమ తవ్వకాలను నిలిపివేయడంతో పాటు, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.


## మూడో విద్యుత్ పంపిణీ సంస్థ రైతు డిస్కం ఏర్పాటు స్మార్ట్ మీటర్ల కోసం

**- కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలకు అనుగుణంగా తెలంగాణ విద్యుత్ రంగాన్ని నిర్వీర్యం చేసే యత్నాలు - వ్యవసాయ డిస్ట్రిబ్యూషన్,ట్రాన్స్ ఫార్మర్లకు స్మార్ట్ మీటర్ల పెట్టడం పై రైతులు తిరుగుబాటు తప్పదు - తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, సీనియర్ నాయకులు తాతా భాస్కరరావు**




తల్లాడ, నేటి శుభోదయ ::: తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని నిర్వీర్యం చేసే యత్నాలు చేస్తుంది అని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, జిల్లా సీనియర్ నాయకులు తాతా భాస్కరరావు అన్నారు. కుర్ణవల్లి గ్రామం లో తెలంగాణ రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో రైతు సదస్సు నిర్వహించారు. రైతు సంఘం సత్తుపల్లి డివిజన్ అధ్యక్షులు నల్లమోతు మోహన్ రావు అధ్యక్షతన జరిగిన రైతు సదస్సులో బొంతు రాంబాబు, తాతా భాస్కర్ రావు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం జీవో 44 ద్వారా రైతు డిస్కం పేరుతో మూడోవ డిస్కం ఏర్పాటు చేసి వ్యవసాయ విద్యుత్, తోపాటు ఇతర సబ్సిడీ విద్యుత్ సరఫరా విభాగాలను మూడో విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలో చేర్చి భవిష్యత్తులో వ్యవసాయ ఉచిత విద్యుత్ ప్రభుత్వం కు భారం అవుతుందని ప్రచారం చేసి ఉచిత వ్యవసాయ విద్యుత్ కు మంగళం పాడే అవకాశం ఉంటుంది అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన విద్యుత్ సంస్కరణలు అమలు చేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది అని అందులో భాగంగానే కేంద్ర ప్రభుత్వం కూడా వెంటనే మూడో విద్యుత్ పంపిణీ సంస్థ ఏర్పాటు కు అనుమతి వేగం గా ఇచ్చింది అని అన్నారు. వ్యవసాయ విద్యుత్ డిస్ట్రిబ్యూషన్ మరియు ట్రాన్స్ ఫార్మర్లకు స్మార్ట్ మీటర్ల పెట్టడం మూడోవ డిస్కం ప్రధాన ఉద్దేశం అన్నారు. మొత్తం విద్యుత్ పంపిణీ వ్యవస్థ నుంచి ప్రభుత్వం ఉచిత విద్యుత్ పొందే వ్యవసాయ మోటార్లు, ఎత్తిపోతల పథకాలు, మీషన్ భగీరథ, ఉచిత విద్యుత్ పొందే అవకాశం ఉన్న ప్రతి సంస్థ, వ్యక్తులు భవిష్యత్తులో తీవ్రంగా నష్టపోతారు అని అన్నారు.విద్యుత్ సంస్కరణలు కి వ్యతిరేకంగా రైతులు ఉద్యమ బాట పట్టాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన ఎరువులు పెట్రోల్ డీజిల్ ధరలు వ్యవసాయ రంగ ఉత్పత్తుల పై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందని అన్నారు.భూ సమస్యలు పరిష్కారం కోసం రైతులు ఉద్యమం లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ నాయకులు శీలం సత్యనారాయణ రెడ్డి, మండల అధ్యక్షులు కళ్యాణం కృష్ణయ్య, ఐనాల రామలింగేశ్వరరావు,కట్టా దుర్గయ్య, ఐలూరి రాంరెడ్డి, పేరసాని వెంకటేశ్వరరావు, దొబ్బల సురేష్, కొటి రెడ్డి , కృష్ణారెడ్డి, హనుమంతరావు, డొకుపర్తి రాంమూర్తి, కొమ్మినేని బాబు,గుర్రుల గోపాల కృష్ణారెడ్డి, వెంకట్రామిరెడ్డి, అప్పిరెడ్డి, ఐలూరి పెద్ద కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గట్లకానిపర్తి లో చలివేంద్రం ఏర్పాటు..




హనుమకొండ జిల్లా ప్రతినిధి ( నేటి శుభోదయ ) పరకాల:మే 23;గ్రామ అభివృద్ధి కమిటీ, గ్రామ పంచాయితీ సమన్వయంతో గట్లకానిపర్తి లోని గ్రంథాలయ భవనం వద్ద గ్రామ సర్పంచ్ వైనాల విజయ కుమారస్వామి, పంచాయితీ కార్యదర్శి శ్రీకాంత్ లు శనివారం చలివేంద్రం ప్రారంభించారు. రోజు రోజుకు పెరుగుతున్న వేసవి తీవ్రత దృష్ట్యా ప్రయణీకులు,బాటసారుల దాహార్తిని తీర్చుటకు గాను గ్రామ అభివృద్ధి కమిటీ మంచి సంకల్పంతో ఇట్టి కార్యక్రమ ఏర్పాటుకు చేయుటకు ముందుకు రావడం జరిగింది. పదవి విరమణ పొందిన హెచ్ఎం, కే. శే. ఎండపల్లి బుచ్చి రాజిరెడ్డి జ్ఞాపకార్థంగా వారి కుటుంబసభ్యులు ఈ చలివేంద్రం ఏర్పాటుకు సహకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయితీ పాలక మండలి,గ్రామ పెద్దలు, మహిళలు, అభివృద్ధి కమిటీ సభ్యులు, రాజిరెడ్డి గారి కుటుంబ సభ్యులు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## బీటెక్ ఫలితాలలో శ్రీ చైతన్య ప్రభంజనం




ఖమ్మం, నేటి శుభోదయ ::: జేఎన్టీయూ హైదరాబాద్ వారు ఇటీవల విడుదల చేసిన చివరి సంవత్సర రెండవ సెమిస్టరు పరీక్ష ఫలితాలలో పొన్నెకల్లులోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విద్యార్థిని యశస్విని 9.6 ఎస్ జిపిఏ, లిఖిత్ మరియు సుజిత్ 9.4 ఎస్ జిపిఏ, ఆర్టిఫిషల్ ఇంటిలిజెన్స్ లో రాజేష్ అండ్ గాయత్రి సౌమ్య 9.55 ఎస్ జిపిఏ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విద్యార్థిని హేమలత 9.4 ఎస్ జిపిఏ తో యూనివర్సిటీ స్థాయిలోనే అత్యుత్తమ ఫలితాలు సాధించారని, 9.0 ఎస్ జి పి ఏ కి పైన 78 మంది విద్యార్థులు ఫలితాలు సాధించారు. అని చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ తెలిపారు. కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సాయి గీతిక మాట్లాడుతూ అధ్యాపకులచే తయారు చేయబడిన ప్రాక్టికల్ తో కూడిన మైక్రో షెడ్యూల్ తో పాటు ప్రతి సబ్జెక్టుకు తరగతి బోధనతో పాటు,ప్రాక్టికల్ కూడా నిర్వహించడం వలన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంలో దోహదపడిందని అన్నారు. ఈ ఫలితాలు యూనివర్సిటీ స్థాయిలోనే అత్యుత్తమ ఫలితాలని, ఈ ఫలితాలు సాధించడంలో కృషి చేసిన అధ్యాపకులను విద్యార్థులని అభినందనలు తెలియజేశారు.కళాశాల డైరెక్టర్ మల్లెంపాటి శ్రీ విద్య మాట్లాడుతూ ప్రపంచ స్థాయి సాంకేతికతను అందిస్తూ విద్యార్థుల ప్రతిభను వెలికితీయడమే మా లక్ష్యం. ఈ ఫలితాలు మా నాణ్యమైన బోధన, ఫ్యాకల్టీ బృందం అందించిన నాణ్యమైన బోధన, విద్యార్థుల అంకితభావం ఈ ఫలితాల వెనుక ప్రధాన కారణం నిదర్శనం అని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె లక్ష్మి నారాయణ మాట్లాడుతూ విద్యార్థులు కృషి, పట్టుదల, సాధన ద్వారానే,సాధ్యమవుతుందని, అది మా విద్యార్థులకి కళాశాలలో జాయిన్ అయిన మొదటి రోజు నుంచే అవలంబించేలాగా ప్రణాళికలు సిద్ధం చేశామని,విద్యార్థులు నిరంతరం సృజనాత్మకంగా, క్రమశిక్షణతో పాఠాలు నేర్చుకోవడం వల్లే ఈ ప్రతిభ సాధ్యమైంది. భవిష్యత్తులో కూడా ఇలాగే మెరుగైన ఫలితాలు సాధించాలనే ఆకాంక్షిస్తున్నామ అని అన్నారు. కళాశాల అకాడమిక్ డీన్ డాక్టర్ సుదర్శన మాట్లాడుతూ మెరుగైన ఫలితాలు సాధించడంలో విద్యార్థుల పాత్ర ఎంత కీలకమో అధ్యాపకుల పాత్ర కూడా అంతే ఉంటుందని, సిలబస్ లో వస్తున్న మార్పులకు అనుగుణంగా అధ్యాపకులను ఎప్పటికప్పుడు నిష్ణాతులైన నిపుణులతో శిక్షణ ఇస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వైశాలి,ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ రాజేష్, డిప్లొమా ఇంచార్జి కృష్ణ ప్రసాద్, వివిధ విభాగాల అధిపతులు డాక్టర్ జ్యోతి, డాక్టర్ చార్యులు , డాక్టర్ ప్రణతి,సురేష్,శ్రీ కుమార్ పాల్గొన్నారు.



# కోట్ల విలువైన ఆస్తిని సమాజం కోసం అందజేసిన ఆత్మకూర్ మాజీ సర్పంచ్ పట్లోళ్ల అమరేందర్ రెడ్డి



నేటి శుభోదయ, సంగారెడ్డి ప్రతినిధి:కోట్ల విలువైన ఆస్తి... రూపాయి ఆశించకుండా సమాజం కోసం ఇచ్చేయాలంటే ఎంతటి ఉదార స్వభావం ఉండాలి? తరాలు మారినా, తాము నమ్మిన సేవ నిరంతరం కొనసాగాలని ఆశించే గొప్ప మనసు అది. అలాంటి ఒక అరుదైన, ఆదర్శవంతమైన సంఘటన మన సంగారెడ్డి జిల్లాలో వెలుగుచూసింది.సంగారెడ్డి జిల్లా సదాశివాపేట మండలం ఆత్మకూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పట్లోళ్ల అమరేందర్ రెడ్డి కుటుంబం సమాజ సేవలో తమదైన ముద్ర వేసుకుంది. దాదాపు 65 సంవత్సరాల క్రితమే... గ్రామంలో పేద ప్రజల వైద్య అవసరాల కోసం వీరి కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి భూమిని దానం చేశారు.తాతల కాలం నాటి ఆ నమ్మకాన్ని, ఆశయాన్ని నేటి తరం కూడా అంతే బాధ్యతగా ముందుకు తీసుకెళ్లింది. ఆ నాడు ఆసుపత్రి కొరకు కేటాయించిన, నేడు కోట్ల రూపాయల విలువ చేసే ఆ భూమికి సంబంధించిన గిఫ్ట్ డీడ్ (+అట్ ణవవఎ) పత్రాలను మాజీ సర్పంచ్ పట్లోళ్ల అమరేందర్ రెడ్డి గారు అధికారికంగా ప్రభుత్వానికి అందజేశారు.నేటి రోజుల్లో గజం భూమి కోసం సొంత మనుషులే కొట్టుకుచస్తున్న తరుణంలో... ప్రజా సంక్షేమం కోసం, పేదల ఆరోగ్యం కోసం కోట్ల విలువైన భూమిని ప్రభుత్వ ఆసుపత్రికి గిఫ్ట్ డీడ్ చేసి ఇచ్చిన పట్లోళ్ల అమరేందర్ రెడ్డి కుటుంబానికి ఆత్మకూర్ గ్రామ ప్రజలతో పాటు, జిల్లా ప్రజలు కూడా సెల్యూట్ చేస్తున్నారు. ఇదండీ నిజమైన నిస్వార్థ సేవ అంటే! గ్రామ ప్రజలు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యం పంతులు ఇందూరి రమేష్కల్పగురి ప్రభుకొండాపురం రమేష్ వీరన్నఇందూరి సదాశివుడు పల్లె జగదీశ్వర్గుండ్ల శివకుమార్ కోరామని సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# జగద్గురు ఇష్టలింగ పూజలో చిన్నారి గంధం నాగ ధృతి



నేటి శుభోదయ,సంగారెడ్డి ప్రతినిధి:లింగదీక్షలు అందజేస్తున్న శ్రీశైల జగద్గురు.. ఇష్టలింగ పూజలో పాల్గొన్న చిన్నారి గంధం నాగధృతిదకూకట్పల్లిలో శ్రీశైల జగద్గురు వారి సాన్నిధ్యంలో నిర్వహించిన ఇష్టలింగ పూజ కార్యక్రమంలో రెండేళ్ల చిన్నారి గంధం నాగధృతి భక్తిశ్రద్ధలతో పాల్గొంది. ఈ సందర్భంగా జగద్గురు వారు భక్తులకు లింగదీక్షలు అందజేస్తూ శైవ సంప్రదాయ విశిష్టతను వివరించారు.చిన్న వయస్సులోనే ఆధ్యాత్మిక భావనతో ఇష్టలింగ పూజలో పాల్గొన్న నాగధృతిని జగద్గురు వారు ఆశీర్వదించారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు చిన్నారి భక్తిని అభినందిస్తూ, సనాతన ధర్మ విలువలను చిన్ననాటి నుంచే పిల్లలకు పరిచయం చేయడం ఆనందదాయకమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా చిన్నారి గంధం నాగధృతికి జగద్గురు వారి ఆశీస్సులు లభించగా, కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి కృప కోసం ప్రార్థనలు చేశారు. కార్యక్రమం భక్తి పారవశ్యంతో ఘనంగా జరిగింది ఈ కార్యక్రమంలో ఆలిండియా వీరశైవ మహాసభ ఉపాధ్యక్షురాలు గంధం అమరావతి, సంగారెడ్డి జిల్లా వీరశైవ లింగాయత్ సమాజం సలహాదారులు అన్మిశెట్టి జయప్రకాశ్, యువజన నాయకులు గంధం శ్రవణ్ కుమార్

# "నమస్తే ఎమ్మెల్యే సార్" అంటూ ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ను ఆప్యాయంగా పలకరించిన చిన్నారులు...



నేటి శుభోదయ, సంగారెడ్డి ప్రతినిధి:సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ను క్యాంపు కార్యాలయంలో కలిసిన చిన్నారులు ఆప్యాయంగా "నమస్తే ఎమ్మెల్యే సార్" అంటూ పలకరించారు. చిన్నారుల అభివాదానికి ఎమ్మెల్యే చిరునవ్వుతో స్పందిస్తూ వారితో సరదాగా ముచ్చటించారు. ఈ సందర్భంగా చిన్నారుల చదువులు, అభిరుచుల గురించి అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్ , మంచి విద్యతో పాటు సంస్కారం కూడా ఎంతో ముఖ్యమని సూచించారు. పిల్లలతో ఎంతో ఆత్మీయంగా మాట్లాడిన ఎమ్మెల్యేను చూసి అక్కడున్న వారు ఆనందం వ్యక్తం చేశారు.ప్రజలతో ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే నాయకుడిగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ వ్యవహరిస్తున్నారని స్థానికులు పేర్కొన్నారు.

# అలుపెరుగని ఉద్యమకారుడు

- వెంకటనారాయణ...



హనుమకొండ జిల్లా ప్రతినిధి (మౌళీ అర్షం)నేటి శుభోదయ మే 23 ; తెలంగాణ ఉద్యమ నిర్మాత అలుపెరుగని ఉద్యమకారుడని ఆకాంక్షల వేదిక నాయకులు అన్నారు. శనివారం హనుమకొండలో తెలంగాణ ఆకాంక్షల వేదిక ఆధ్వర్యంలో నూతనంగా తెలుగు అకాడమీ చైర్మన్ గా నియమించబడిన ప్రొఫెసర్ డాక్టర్, కూరపాటి వెంకటనారాయణ ను సన్మానించిన అనంతరం వేదిక నాయకులు మాట్లాడారు. నారాయణ తెలంగాణ ఉద్యమం తొలి దశ నుండి జయశంకర్, గద్దర్ ,జనార్ధన్, కాళోజి, భూపతి కృష్ణమూర్తిలతో తెలంగాణ ఆకాంక్ష కోసం నిరంతరం శ్రమించాడని వివరించారు. నారాయణ కు గుర్తింపు నిచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి కి వారు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వానికి,ఉద్యమకారులకు వారధిగా గా ఉండి తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేకూర్చాలని , వేదిక నాయకులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రసాద్, నగేష్, నవీన్ నవరత్న ఆనంద్ గౌడ్ ,సయ్యద్ గౌస్, ఎండి అస్లాం, మార్కండేయ,స్వర్ణలత, దేవి, పద్మ ,భాగ్య లక్ష్మి, స్వరూప రాణి తదితరులు పాల్గొన్నారు.

# 8వ తరగతి ఫెయిల్, రూ.25,000 కోట్లకు అధిపతి

**- భార్యకు 40 కేజీల బంగారం, ఎవరీ సతీష్ సన్‌పాల్ - నెట్‌ఫ్లిక్స్ 'దేశి బ్లింగ్' షోతో వెలుగులోకి వచ్చిన సతీష్ సన్‌పాల్ - 8వ తరగతి డ్రాపవుట్ నుంచి దుబాయ్‌లో బిలియనీర్‌గా ఎదిగిన వైనం - బుర్జ్ ఖలీఫాలో నివాసం, భార్యకు 40 కేజీల బంగారం బహుమతి - కూతురి కోసం బంగారు డ్రెస్, పింక్ రోల్స్ రాయిస్ కారు కొనుగోలు - సుమారు రూ.25,000 కోట్ల విలువైన కంపెనీకి చైర్మన్‌గా ఉన్న సతీష్**



హైదరాబాద్, నేటి శుభోదయ ::: ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లో ప్రసారమవుతున్న 'దేశి బ్లింగ్' షో ద్వారా ఓ భారతీయ బిలియనీర్ కథ వెలుగులోకి వచ్చింది. దుబాయ్‌లో అల్ట్రా రిచ్ భారతీయుల విలాసవంతమైన జీవితాన్ని చూపించే ఈ షోలో సతీష్ సన్‌పాల్ అనే వ్యాపారవేత్త అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. 8వ తరగతి మధ్యలోనే చదువు ఆపేసి, రూ.25,000 కోట్ల వ్యాపార సామ్రాజ్యాన్ని సృష్టించిన ఆయన సక్సెస్ స్టోరీ ఆశ్చర్యపరుస్తోంది.మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌కు చెందిన సతీష్ సన్‌పాల్, తన 15 ఏళ్ల వయసులో తల్లి దగ్గర రూ.50,000 అప్పుగా తీసుకుని ఓ కిరాణా దుకాణం ప్రారంభించారు. కానీ ఆ వ్యాపారం నష్టాల్లో ముగిసింది. అనంతరం స్టాక్ మార్కెట్‌లో అదృష్టాన్ని పరీక్షించుకుని, ఆ తర్వాత దుబాయ్ వెళ్లారు. అక్కడ గోల్డ్ బిజినెస్‌లోకి అడుగుపెట్టి అనూహ్య విజయం సాధించారు. ప్రస్తుతం ఆయన 'ఏఎన్ఏఎక్స్ హోల్డింగ్' అనే కంపెనీకి చైర్మన్‌గా ఉన్నారు. ఈ కంపెనీ విలువ సుమారు 3 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.25,000 కోట్లు) కావడం విశేషం.సతీష్ సన్‌పాల్, ఆయన భార్య తబిందా దుబాయ్‌లోని ప్రపంచ ప్రఖ్యాత బుర్జ్ ఖలీఫాలో నివసిస్తున్నారు. తబిందా వద్ద ఏకంగా 40 కేజీల బంగారం ఉంది. సతీష్ ఏటా ఆమెకు 3 కేజీల బంగారం కొనిస్తారట. వివాహమైన 9 ఏళ్ల తర్వాత పుట్టిన తమ కుమార్తె ఇసాబెల్లా కోసం బంగారు కట్లరీ, మొదటి పుట్టినరోజున 24 క్యారెట్ల బంగారంతో ప్రత్యేకంగా డ్రెస్ తయారు చేయించారు. అంతేకాకుండా, ఆమె కోసం పింక్ రంగు రోల్స్ రాయిస్ కారును కూడా కొనుగోలు చేశారు.ఈ షోలో సతీష్ తన స్నేహితుల కోసం ప్రత్యేకంగా ఓ పార్టీ యాట్‌ను కొనుగోలు చేసినట్లు చూపించారు. ఇందులో కేవలం మగవాళ్లకు మాత్రమే పార్టీలు ఇస్తారని, భార్యలకు అనుమతి లేదని చెప్పడం గమనార్హం. మొత్తం మీద ఈ షో భారీ సంపద, బంగారంపై మోజు, విలాసవంతమైన జీవనశైలిని కళ్లకు కట్టినట్టు చూపిస్తోంది. ఇందులో టీవీ తారలు తేజస్వీ ప్రకాష్, కరణ్ కుంద్రా కూడా కనిపించారు.

# ఏన్కూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నియామకం ఎప్పుడు

**పాత అధ్యక్షుడికే పట్టమా- నూతన అధ్యక్షుడిని నియమిస్తారా**

**- అధిష్టానం మనసులో ఏముంది!**



ఏన్కూర్, నేటి శుభోదయం::తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వివిధ మండలాలకు సంబంధించిన నూతన అధ్యక్షులను నియమిస్తూ వస్తోంది. ఈ నేపథ్యంలో ఏన్కూర్ మండలానికి కొత్తవారికి అవకాశం ఇస్తారా లేదా పాత వారికే పట్టం కడతారాఅనే చర్చ సర్వత్ర వినిపిస్తోంది. ఏన్కూరు మండలంలో సమర్థవంతమైన నాయకుడు ఉన్నారా అనే చర్చ మరోవైపు కొనసాగుతోంది. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడే వ్యక్తులు ఉన్నారా లేదా ప్రస్తుత అధ్యక్షుడు స్వర్ణ నరేందర్‌కే పట్టం కడతారా అనే గుసగుసలు పార్టీ వర్గాల్లో వినిపిస్తున్నాయి. ప్రస్తుత అధ్యక్షుడు స్థానికంగా ఉండటం లేదనే విమర్శలు ఉన్నప్పటికీ, ఆయన ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి సమాచారం చేరవేస్తారని కొందరు అభిప్రాయపడుతున్నారు. పార్టీలో సమర్థవంతమైన నాయకుడు ఉన్నారా అనే ప్రశ్న కూడా తలెత్తుతోంది. సాధారణంగా పార్టీ కోసం సుదీర్ఘకాలంగా పనిచేసే వ్యక్తినే మండల అధ్యక్షుడిగా నియమిస్తారు. అందరితో సమిష్టిగా కలిసి పనిచేసే వ్యక్తి ప్రస్తుత అధ్యక్షుడేనని కొందరు అభిప్రాయపడుతున్నారు. కొత్తవారికి అవకాశం ఇస్తే పార్టీని సమర్థవంతంగా నడిపించగలరా లేదా అనే చర్చ కూడా మరోవైపు సాగుతోంది. బూత్ స్థాయి నుంచి గ్రామ, మండల స్థాయిల వరకు పార్టీని బలోపేతం చేస్తూ ప్రజలందరినీ కలుపుకొని పని చేయడం అంత సులభమైన విషయం కాదు.ఓపిక, సరైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం ఉన్న వ్యక్తే అధ్యక్షుడిగా ఉండాలి. అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని సమర్థవంతంగా పార్టీని బలోపేతం చేయాలి. పార్టీలో




రకరకాల వ్యక్తులు, అభిప్రాయాలు ఉండడం సహజం. అలాంటి పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొంటూ పార్టీని ముందుకు తీసుకెళ్లాలి. అధ్యక్ష పదవి అంటే ప్రజలను, పార్టీ కార్యకర్తలను సమతుల్యం చేస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించడం. ఓపిక లేకపోతే పార్టీని బలోపేతం చేయడం సాధ్యం కాదు. పార్టీ ఆశయాలకు అనుగుణంగా నడుచుకుంటూ, ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం అధ్యక్షుడి ప్రధాన బాధ్యత. ఇలాంటి సమర్థవంతమైన నాయకుడు ఎవరు అన్నది అధిష్టానం తేల్చాల్సి ఉంది. మరి ప్రస్తుత అధ్యక్షుడికే మళ్లీ అవకాశం ఇస్తారా లేక ఏన్కూరు మండల కాంగ్రెస్ పార్టీకి నూతన అధ్యక్షుడిని నియమిస్తారా అనే విషయంపై ఆసక్తి నెలకొంది. అధిష్టానం మనసులో ఏముంది ఎమ్మెల్యే అభిప్రాయం ఎవరి వైపు ఉంది అనే చర్చ కూడా కొనసాగుతోంది. దీనికి త్వరలోనే పుల్ స్టాప్ పడాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# మార్కెట్ వాల్యూ అప్డేషన్ వేగవంతం చేయాలి

**:ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ లోకేష్ కుమార్**

**ఫామ్ 1,2,3,4 అప్డేషన్ త్వరితగతిన చేపట్టాలి.**




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే 23,( నేటి శుభోదయ ),హైదరాబాద్ నుండి చీఫ్ కమిషనర్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ లోకేష్ కుమార్ మరియు రెవెన్యూ శాఖ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మార్కెట్ వాల్యూ అప్డేషన్ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మార్కెట్ వాల్యూ అప్డేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా భూభారతి ఐజీఆర్ఎస్ పోర్టల్‌లో ఫామ్ 1, 2, 3, 4లకు సంబంధించిన అప్డేషన్ ప్రక్రియను వేగవంతంగా చేపట్టాలని సూచించారు.జీవో నెంబర్ 44 ప్రకారం జిల్లా స్థాయి నుండి మండల స్థాయి వరకు కమిటీలను ఏర్పాటు చేసి మార్కెట్ వాల్యూ సవరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. భూ లావాదేవీలు, రిజిస్ట్రేషన్ వ్యవస్థలో పారదర్శకత పెంపుతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఈ ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఐడీఓసీ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ అంకిత్ అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తో కలిసి పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న 379 రెవెన్యూ గ్రామాలలో మార్కెట్ వాల్యూ అప్డేషన్ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి భూభారతి, ఐజీఆర్ఎస్ అప్డేషన్లను వేగవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ పద్మావతి, కొత్తగూడెం ఆర్డీవో మధు, ఈ డిస్టిక్ మేనేజర్ సైదేశ్వరరావు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు

# మిట్టపల్లి గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు




ఖమ్మం , నేటి శుభోదయ ::: మిట్టపల్లి గ్రామం, తల్లాడ మండలం, ఖమ్మం జిల్లా నందు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమన్ని కృషి విజ్ఞాన కేంద్రం, వైరా వారు, వ్యవసాయ శాఖ, ఖమ్మం జిల్లా వారి సహకారం తో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో వైరా కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ సైంటిస్ట్, హెడ్ డా. టి.పావని, మాట్లాడుతూ యూరియా వాడకం ను తగ్గించాలి అను అంశం పైన వివరించారు. ఉద్యాన శాస్త్రవేత్త డా. వి. చైతన్య మాట్లాడుతూ అవసరం మేరకు రసాయనాల ను వినియోగించండి - నేల తల్లి ఆరోగ్యాన్ని కాపాడండి అనే అంశాలపై అవగాహన కల్పించారు. అదేవిదంగా పి ఎస్ ఎమ్ ఫణిశ్రీ, వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త మాట్లాడుతూ సాగు నీటిని ఆదా చేయండి - బావితరాలకు అందించండి, పంట మార్పిడిని పాటించండి - సుస్థిర ఆదాయాన్ని పొందండి, సేంద్రీయ వ్యవసాయం అనే అంశాల పైన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి నవ్య రైతులు పచ్చిరొట్ట విత్తనాలు వేసుకో వాలని, సేంద్రియ కార్బనం పెరిగే విధంగా యాజమాన్య పద్ధతులు పాటించలి అని, విత్తనాలు కొనే టప్పుడు పాటించవలసిన జాగ్రత్తల గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో రైతులు పాల్గొని వారి సందేహాలను శాస్త్రవేత్తలతో నివృత్తి చేసుకున్నారు.

# మొక్కజొన్న నిల్వలు వెంటనే గోదాములకు తరలించాలి

**ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో**

**వైద్యులు అందుబాటులో ఉండాలి: జిల్లా కలెక్టర్ అంకిత్.**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే 23,( నేటి శుభోదయ ),ఆళ్లపల్లి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ శనివారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న మొక్కజొన్న కొనుగోలు, నిల్వ, లోడింగ్ మరియు రవాణా ప్రక్రియలను పరిశీలించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రంలో ప్రస్తుతం 117 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న నిల్వ ఉన్నదని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ మొక్కజొన్న నిల్వలు ఎక్కువకాలం కొనుగోలు కేంద్రంలో ఉండకుండా వెంటనే గోదాములకు తరలించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రైతులు తీసుకొస్తున్న మొక్కజొన్నను సకాలంలో కొనుగోలు చేసి వేగవంతంగా లోడింగ్ పూర్తి చేయాలని సూచించారు.ముఖ్యంగా రవాణా వాహనాలు, హమాలీల లభ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తెలిపారు. లారీల కొరత లేదా హమాలీల సమస్యల కారణంగా తరలింపు ప్రక్రియలో జాప్యం జరగకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని అధికారులకు సూచించారు. రవాణా శాఖ అధికారులను అడిగి లారీల అందుబాటు, లోడింగ్ పనుల పురోగతి, రోజువారీ తరలింపు సామర్థ్యం తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. అవసరమైతే అదనపు వాహనాలు సమకూర్చి మొక్కజొన్న నిల్వలను వేగవంతంగా తరలించాలని ఆదేశించారు. అకాల వర్షాలను దృష్టిలో ఉంచుకొని నిల్వ ఉన్న మొక్కజొన్న తడవకుండా తగిన రక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. రైతులకు తాగునీరు, నీడ, కూర్చునే సదుపాయాలు కల్పించాలని, కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి రైతులకు సంబంధించిన చెల్లింపులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో సిబ్బంది హాజరు శాతం, వైద్య సేవల నిర్వహణ, రోగులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు.తనిఖీల సందర్భంగా మెడికల్ అధికారి తరుణ్ అందుబాటులో లేకపోవడంతో కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. విధుల్లో ఎందుకు లేరని సిబ్బందిని ప్రశ్నించి వివరణ కోరారు. సంబంధిత శాఖ అధికారులను దీనిపై పూర్తి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. అనంతరం సిబ్బంది హాజరు పట్టికలు, రిజిస్టర్లను పరిశీలించి ప్రతి ఉద్యోగి విధుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. గైర్హాజరైన సిబ్బంది సెలవుల వివరాలు, డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న వారి సమాచారం తదితర అంశాలపై సమగ్ర వివరాలు తెలుసుకున్నారు.అవుట్ పేషెంట్ విభాగం, పరీక్షల గది, మందుల నిల్వ గది, ఇన్ పేషెంట్ విభాగాలను పరిశీలించిన కలెక్టర్ చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వడదెబ్బతో చికిత్స పొందుతున్న రోగులను ప్రత్యేకంగా పరామర్శించి వారికి అందుతున్న వైద్య సదుపాయాలు, మందులు, పర్యవేక్షణపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో వడదెబ్బ తగిలిన వారికి ఎప్పటికప్పుడు అందుబాటులో వైద్య సేవలు ఉండేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన మందులు, ఐవీ ఫ్లూయిడ్స్, పడకలు అందుబాటులో ఉంచి అత్యవసర పరిస్థితులకు సిద్ధంగా ఉండాలని సూచించారు. రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని తెలిపారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని, సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.ఈ పరిశీలనలో తహసీల్దార్ ఉషారాణి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఎండవేడిమి పట్ల అప్రమత్తంగా ఉండాలి

### : ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



ఖమ్మం, నేటి శుభోదయ ::: ఎండలు రోజురోజుకు మరింత తీవ్రమవు తున్నందున అప్రమత్తంగా ఉండాల్సిందిగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ప్రజలను కోరారు. తెలంగాణ వ్యాప్తంగా ఎండలు మండి పోతుండడంతో వడదెబ్బ తగిలి పలువురు ప్రాణాలు కోల్పోయిన దృష్ట్యా అత్య వసరమయితే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని ఒక ప్రకటనలో ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సూర్యుడి ప్రతాపం రేపటి నుంచి మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని వాతావరణ కేంద్రం పేర్కొనడాన్ని ఎంపీ రవిచంద్ర గుర్తు చేస్తూ చిన్నపిల్లలు, వృద్ధులు తగు జాగ్రత్తలు పాటిస్తూ మంచినీళ్లు, మజ్జిగ ఎక్కువ తీసుకోవాలని సూచించారు.ప్రయాణీకులు, కార్మికులు, కర్షకులు,చిరు వ్యాపారులు మరింత జాగ్రత్తగా ఉండాలని, వడదెబ్బ తగిలినట్టయితే వెంటనే సమీపాన ఉన్న ఆస్పత్రికి వెళ్లి వైద్య సాయం పొందాలని ఎంపీ వద్దిరాజు సలహానిచ్చారు.

# తడి, పొడి చెత్త పై అవగాహన కలిగి ఉండాలి

### : సిడిఓ హేమలత



ఖమ్మం, నేటి శుభోదయ ::: ఖమ్మం నగర పాలక సంస్థ డంపింగ్ యార్డ్‌లో శనివారం సిడిఎమ్మె, సిడిఓ హేమలత ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన మున్సిపాలిటీల అధికారులకు తడి, పొడి చెత్త వేరు చేయడం, తడి చెత్తను సేంద్రియ ఎరువుగా మార్చడం అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డంపింగ్ యార్డ్‌లో తడి చెత్తను శాస్త్రీయ పద్ధతుల్లో ఎరువుగా తయారు చేసే ప్రక్రియను ప్రత్యక్షంగా ప్రదర్శించి, దశలవారీగా వివరించడం జరిగింది. అలాగే ఇంటి స్థాయి నుంచే తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం ద్వారా చెత్త నిర్వహణ మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చని తెలియజేశారు.తడి చెత్తను ఎరువుగా మార్చడం ద్వారా డంపింగ్ యార్డ్‌లలో చెత్త పేరుకుపోవడం తగ్గడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతుందని వివరించారు. అలాగే పొడి చెత్తను రీసైక్లింగ్‌కు పంపించడం ద్వారా వ్యర్థాలను తగ్గించి, జీరో వేస్ట్ సిటీ లక్ష్య సాధనలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన పది మున్సిపాలిటీల కమిషనర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్లు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.ప్రతి ఇంటి నుంచి వచ్చే తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించడం ద్వారా పరిశుభ్రమైన, పర్యావరణ హిత నగరాల నిర్మాణానికి ప్రజలు సహకరించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.



# హైదరాబాద్ నడిబొడ్డున 'అన్న' ఎన్టీఆర్ నిలువెత్తు విగ్రహం

**- మే 28న ఆవిష్కరించనున్న సీఎం రేవంత్ రెడ్డి**

**- అమీర్‌పేట మైత్రీవనం కూడలికి 'ఎన్టీఆర్ సర్కిల్' నామకరణం**

**- కొత్తపేటలో రూపుదిద్దుకున్న 13 అడుగుల కాంస్య విగ్రహం**




హైదరాబాద్, నేటి శుభోదయ ::: హైదరాబాద్, తెలుగుజాతి ఖ్యాతిని దశదిశలా చాటిన విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు, యుగపురుషుడు నందమూరి తారకరామారావు జయంతిని పురస్కరించుకుని తెలంగాణ ప్రభుత్వం అపూర్వ నివాళి అర్పిస్తోంది. హైదరాబాద్ నడిబొడ్డున అన్న ఎన్టీఆర్ నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు సర్వాంగ సుందరంగా ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 28న (ఎన్టీఆర్ జయంతి) అమీర్‌పేటలోని మైత్రీవనం కూడలిలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ విగ్రహాన్ని లాంఛనంగా ఆవిష్కరించనున్నారు. రాష్ట్ర విభజన జరిగి 12 ఏళ్లు గడిచిన తర్వాత హైదరాబాద్‌లో ఏర్పాటవుతున్న తొలి ఎన్టీఆర్ విగ్రహం ఇదే కావడం విశేషం.- 23 అడుగుల ఎత్తులో సజీవ రూపం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటకు చెందిన ప్రముఖ శిల్పి, కళారత్న డి. రాజ్‌కుమార్ ఉడయార్ రెండు నెలల పాటు శ్రమించి ఈ అద్భుత కాంస్య విగ్రహానికి రూప కల్పన చేశారు.

# న్యాయం అడిగితే రైతులపై కేసులా

**మొక్కజొన్న కొనుగోలులో రాజకీయాలు.. రైతులను వేధిస్తున్న ప్రభుత్వం**

**చింతకాని రైతులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలి**

**బిఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జ్ లింగాల కమల్‌రాజు ఆగ్రహం**



రాథోడ్, చింతకాని, మే 23:రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని, "దున్నపోతు మీద వర్షం కురిసినట్లు" వ్యవహరిస్తోందని జడ్పీ మాజీ ఛైర్మన్, బిఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జ్ లింగాల కమల్‌రాజు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

గత 15 రోజులుగా మొక్కజొన్న రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దురదృష్టకరమని అన్నారు.

మొక్కజొన్న కొనుగోలు విషయంలో అధికారులు రాజకీయ ప్రభావానికి లోనై పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.పంట అమ్మకాల కోసం ఆశగా ఎదురు చూస్తున్న రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో, సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం రైతులపై కేసులు నమోదు చేసి భయభ్రాంతులకు గురిచేస్తోందని మండిపడ్డారు.

కడుపుమంటతో రైతులు ఆందోళన చేపడితే అక్రమ కేసులు పెట్టడం రైతాంగాన్ని అణగదొక్కడమేనని విమర్శించారు.

చింతకాని మండల రైతులపై నమోదు చేసిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. రైతులకు న్యాయం చేయకుండా కేసులతో బెదిరించడం ప్రజాస్వామ్యానికి మచ్చ అని అన్నారు.

రైతుల పట్ల ప్రభుత్వం వెంటనే స్పందించి మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు.

లేనిపక్షంలో రైతాంగంతో కలిసి బిఆర్ఎస్ పార్టీ పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతుందని హెచ్చరించారు.

ఈ సమావేశంలో మండల పార్టీ నాయకులు మంకెన రమేష్, బొడ్డు వెంకటరామారావు, పొనుగోటి రత్నాకర్, గురజాల హనుమంతరావు, బొగ్గారపు రాంబాబు, గడ్డం శ్రీనివాసరావు, పిన్నెల్లి శ్రీనివాసరావు, చంద్రయ్య, చిట్టుమోదు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ మాట్లాడిన సంవిధాన్ బచావ్ కీలకమైన అంశం

**.ప్రజలు జాగ్రత్తగా ఉండండి అని చెప్తున్నారు జగ్గారెడ్డి**



నేటి శుభోదయ, సంగారెడ్డి ప్రతినిధి:. దేశ ప్రజలకు మేలు చేయాలనే ఆలోచనే రాహుల్ గాంధీ ది రాజ్యాంగం దేశ ప్రజలకు కవచం లాంటిది .మహాభారతం లో కర్ణుడికి కవచ కుండలాల లాగా కవచ కుండలాలు ఉన్నంత కాలం ప్రమాదం లేదు కర్ణుడికి కవచ కుండలాలు దానం ఇచ్చాడో చావు ప్రయాణం మొదలైంది ప్రజలకు కూడా రాజ్యాంగం అట్లనే... రక్షణ రాహుల్ గాంధీ కూడా రాజ్యాంగం గురించి అదే చెప్తున్నారు ఎన్నికల కమిషన్ ద్వారా తొలిసారి ప్రధాని అయ్యారు నెహ్రూ ప్రజలకు అవసరమైన వ్యవస్థలు సిద్ధం చేశారు బ్యాంకులను జాతీయకరణ చేసింది ఇందిరా గాంధీ పేదల వరకు బ్యాంకులను అందుబాటులోకి తెచ్చింది ఇందిరా గాంధీ ప్రతీ పేదకు భూమి... ఇల్లు ఇచ్చారు. రాజీవ్ గాంధీ వచ్చి ఐటీ కి బీజం వేశారు ఓటు హక్కు యువతకు ఇచ్చింది రాజీవ్ గాంధీ అప్పుడు బీజేపీ..లేదు... మోడీ లేదు అప్పటికే అభివృద్ధి బీజం వేశారు గాంధీ కుటుంబం పాలనలో సుపరిపాలన అందింది 2014 లో మోదీ ప్రధాని అయ్యాక... 2019 లో ఎన్నికల కమిషన్ ను అడ్డం పెట్టుకుని గెలిచారు ఓటు చోరీ కి గురైంది అని రాహుల్ గాంధీ ప్రజల్ని అప్రమత్తం చేసే పనిలో ఉన్నారు రాహుల్ గాంధీ ప్రజలు తమకు నచ్చిన వారికి స్వేచ్ఛగా ఓటు వేసినప్పుడే ప్రజలకు మేలు బీజేపీ ఓట్లు దొంగతనం చేసి అధికారం లోకి వస్తున్నారు ప్రజలు బీజేపీ మోసాన్ని గుర్తించండి బీజేపీ ఇప్పుడు మతం పేరుతో కొంత.. దొంగ ఓట్లతో కొంత గెలుస్తుంది రాజ్యాంగం.. ఇచ్చిన స్వేచ్ఛను కొల్లగొడుతుంది బీజేపీ అధికారం లోకి రాకముందు 54 లక్షల కోట్లు అప్పు ఇప్పుడు 147 లక్షల కోట్లు అప్పు పెరిగింది దేశ ప్రజలు గమనించాలి . రాహుల్ గాంధీ కుటుంబం ఏ రోజు ఓట్ల కోసమో..అధికారం కోసమో పని చేయరు దేశ ప్రజలు..బాగుండాలని ఆలోచనే రాహుల్ గాంధీ ఆలోచన గాంధీ కుటుంబం ఆస్తులే కాదు...ప్రాణ త్యాగం కూడా చేశారు . ఉపాధి హామీ లాంటి పథకాలు పేద కుటుంబం కి మేలు చేయాలనే చేశారు మీరు వాడే ఫోన్ లు తెచ్చింది రాజీవ్ గాంధీ మోడీ ఏం చేశారు యుద్ధం చేశారు అంటారు... యుద్ధం ఎవరికి లాభం పేదలకు భూములు ఇచ్చిన ఇందిరా గాంధీని మర్చిపోతున్నారు . దేశ ప్రజలకుమోడి 11 ఏండ్ల లో ఏం చేశారో చెప్పండి ఒకటి ఓటు చోరీ...రాజ్యాంగం ఎలా ఎత్తివేయాలి అనేదే వాళ్ళ ఆలోచన దీయిజూ మాట్లాడితే హిందువు అంటారు నేను సీతారామ కళ్యాణం బ్రహ్మాండంగా చేస్తాతెలంగాణ బీజేపీ నేతలు ఒక్కరైనా చేస్తారా నేను కళ్యాణం చేసినా...రాముడి పేరుతో ఓట్లే అడగను ప్రజలు మీ మత్తులో పడ్డారు రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తా అన్నారు... కానీ ఒక్క పోరడు అడగడు పిల్లలకు శివాజీ అంటారు శివాజీ మహారాజ్ దగ్గర మంత్రిగా చేసింది ఎవరో తెలుసా... ముస్లిం ఇప్పుడు శివాజీని మతం పులిమారు నెహ్రూ..ఇందిరా గాంధీ కట్టిన స్కూల్ లోనే బీజేపీ నేతలు చదువుకున్నారు రాహుల్ గాంధీ నీ వచ్చే ఎన్నికల్లో ప్రధాని చేయాలి తెలంగాణ లో 12 పార్లమెంట్ సీట్లు గెలిచి పంపాలి ఏపీ లో స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కావద్దు అంటే... కాంగ్రెస్ కి 18 సీట్లు ఇవ్వండి ప్రత్యేక హోదా... పోలవరం పూర్తి కావాలంటే రాహుల్ గాంధీ ప్రధాని కావాలి చంద్రబాబు..జగన్ వల్ల అది సాధ్యమే కాదు ఓట్లను ఖరాబ్ చేసుకోకండి దేవుడు కూడా ఓటును సద్వినియోగం చేసుకోండి అనే చెప్తారు . జాగ్రత్త పడండి అంటున్నారు రాహుల్ గాంధీ 300 ఎంపీ సీట్లు కాంగ్రెస్ కి ఇవ్వండి దేశాన్ని...రాజ్యాంగాన్ని రాహుల్ గాంధీ కాపాడతారు కాక్రోచ్ ఉద్దేశం ఏందో తెలియదు.. మోడీ పాలన.. నెహ్రూ నుండి ఇప్పటి పాలనా వరకు పోల్చండి బీజేపీ డూప్లికేట్ అని తేలిపోతుంది కాంగ్రెస్ నా అయ్యా జాగీరు కాదు కాక్రోచ్ ఉద్యమం కి రాహుల్ గాంధీ మద్దతు ఇవ్వాలి నేను కాంగ్రెస్ లో చిన్న ఉద్యోగం చేస్తున్న పార్టీ రాహుల్ గాంధీ ది. కాక్రోచ్ గురించి చెప్పేది..చెప్పాల్సింది రాహుల్ గాంధీ నేమోడీకి అహంకారం పెరిగింది పాలన మీద పట్టులేదు ప్రజలు ఏం చెప్పినా నమ్ముతారు అని రాముడు కాకుంటే కృష్ణుణ్ణి ముందు పెట్టొచ్చు అని అహంకారం అహంకార నాయకులకు కాలం నిర్ణయిస్తుంది


# కార్యకర్తలకు అండగా ఉంటాం.. మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి.



హనుమకొండ జిల్లా ప్రతినిధి (మౌళీ అర్షం)నేటి శుభోదయ: మే 23; బిఆర్ఎస్ .పార్టీకార్యకర్తలకు అండగా ఉంటానని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. వరంగల్ జిల్లాలోని సంగ్యం, నల్లబెల్లి మండలంలోని వివిధ గ్రామాలలో ఆయన శనివారం పర్యటించారు. మృతి చెందిన వారి ఆర్థిక సహాయం చేసివారినిఓదార్చారు. మృతుడు గాయపు నారాయణరెడ్డి అనుముల నర్సమ్మ కుటుంబ సభ్యులను కలిశారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న , ఆయా గ్రామాలకు చెందిన మేకల దూడయ్య గుగులోతు రెడ్డి పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.పార్టీ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు .



# మృతుడి కుటుంబాన్ని- పరామర్శించిన -బిజెపి నాయకులు..



హనుమకొండ జిల్లా ప్రతినిధి ( మౌళి అర్షం) నేటి శుభోదయ:మే 23; బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పరకాల నియోజకవర్గం ఇన్చార్జి డా:పగడాల కాళీ ప్రసాద్ రావు శనివారం నాడు అనుమకొండ జిల్లా దామెర మండలంలోని దుర్గంపేట గ్రామానికి చెందిన మోత కుమార్ స్వామి కుటుంబాన్ని విమర్శించారు. మోతే బాలకృష్ణ గత కొద్ది రోజుల క్రితం ఆత్మహత్య చేసుకుని మరణించాడు. వారి కుటుంబాన్ని బిజెపి నాయకులు పరామర్శించి ఓదార్చారు. అనంతరం ప్రభుత్వం ఇచ్చే సీఎం ఆర్ ఎఫ్ రూ..60,000 చెక్కును మృతుడి తండ్రికి అందజేశారు. పరామర్శించిన వారిలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, దామెర మండల బిజెపి పార్టీ అధ్యక్షులు వేల్పుల రాజు కుమార్, జిల్లా కౌన్సిల్ సభ్యులు పదాల మధుకర్,సర్పంచ్ కొట్టే శ్రీవాణి రమేష్ ,మండల కాళీ యువసేన అధ్యక్షుడు గడ్డం కార్తీక్, ప్రధాన కార్యదర్శి గండురాజు ,శ్రీనివాస్, రాజబాబు ,ప్రతాప్ రెడ్డి, సమ్మిరెడ్డి ,కొండల్ రెడ్డి, సాంబార్ విగ్నేష్ ,కిరణ్ ,ప్రశాంతతలు పాల్గొన్నారు.

# డెత్ సర్టిఫికెట్ కోసం అవస్థలు

**- ఇంటిదగ్గర చనిపోతే, డాక్టర్ సంతకం అడుగుతున్నారు**

**- అక్కడకు వెళ్తే,నార్మల్ డెత్ కు సంతకం మేము ఎట్లా చేస్తామని వైద్యులు ప్రశ్నిస్తున్నారు- చోద్యం చూస్తున్న మున్సిపల్ అధికారులు**

ఖమ్మం, నేటి శుభోదయ ::: ఖమ్మం మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని 60 డివిజన్ లలో నివసిస్తున్న స్థానిక ప్రజలు అకస్మాత్తుగా తనువు చాలిస్తే, మృతుడు చనిపోయినట్లు డెత్ సర్టిఫికెట్ తీసుకోవడం మృతుల బంధువులకు ఇప్పుడు కష్టతరంగా మారింది. మొన్నటి వరకు డివిజన్ లలో ఎవరైనా ఆకాలం మరణం చెందితే వారి పెరు, అడ్రస్,కుటింబికుల ఫోన్ నెంబర్ మృతి చెందిన తారీఖు, దానం చేసిన తారీఖు వివరాలు వైకుంఠ దామమం లోని జవాన్ దగ్గర ఉన్న మున్సిపల్ రికార్డ్ లో ఆధార్ కార్డ్ మేరకు నమోదు చేస్తారు. అదేవిధంగా జిపిఎస్ విధానంతో స్మార్ట్ ఫోన్ లో తీసిన మృతుల ఫోటో జిరాక్స్ కూడా అందజేస్తారు. అట్టి రికార్డ్ ను మున్సిపల్ కార్యాలయం లో వారానికి ఓసారి మృతుల వివరాలతో కూడిన రికార్డ్ ను డెత్ సెక్షన్ లో అందజేస్తారు. ఇన్ని ఆధారాలతో కూడిన జిరాక్స్ లను సెక్షన్ అధికారికి సమర్పించి సులభతరమైన పద్దతిలో డెత్ సర్టిఫికెట్ పొందేవాళ్ళు.

- తిరకాసు...!

పైన పేర్కొన్న ఆధారాలతో మున్సిపల్ కార్పోరేషన్ కార్యాలయంలో డెత్ సర్టిఫికెట్ తీసుకునే వారికి తిరకాసు పెట్టడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.పైన తెలిపిన వివరాలతో పాటుగా మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ కొత్త తిరకాసు పెట్టి జనాలను ఆందోళనకు గురి చేయడం బాధాకరం. మృతుల వివరాలు లైవ్ లొకేషన్ డెత్ డేట్,ఆధార్,అంత్యయక్రియల డేట్ అన్ని అందజేస్తే అవికాకుండా వాటితో పాటుగా మృతులు ఇంటిదగ్గర చనిపోయినట్లుగా డాక్టర్ సంతకం కావాలని తిరకాసు పెట్టడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.నార్మల్ డెత్ జరిగినట్లు మాకు ఎలా తెలుస్తది.మా ఉద్యోగాలను ఫణంగా పెట్టి నార్మల్ డెత్ జరిగినట్లుగా సంతకం మేము ఎలా చేయాలని డాక్టర్లు ప్రశ్నిస్తున్నారు. డాక్టర్ సంతకంతో పాటుగా లాయర్ నోటరీ జత చేసి డెత్ సెక్షన్ లో అందజేస్తేనే ఖమ్మం మున్సిపల్ కార్పోరేషన్ అధికారులు డెత్ సర్టిఫికెట్ జారీ చేస్తామనడం పట్ల నగర ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.కొత్త విధానంతో డెత్ సర్టిఫికెట్ కోసం అవస్థలు పడుతున్నట్లు మృతుల కుటింబికులు మనోవేదన చెందుతున్నారు.డెత్ సర్టిఫికెట్ కు డాక్టర్ సంతకం,లాయర్ నోటరీ పద్ధతిని తీసి వేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# బలరాంనగర్‌లో బీఆర్ఎస్ బలోపేతానికి విస్తృత సమీకరణ




నేరెడ్ మెట్ , మే 23 :నేటి శుభోదయ..:మల్కాజ్‌గిరి నియోజకవర్గంలోని 184 బలరాంనగర్ డివిజన్‌లో బీఆర్ఎస్ పార్టీ సంస్థాగత ఎన్నికల నేపథ్యంలో శనివారం విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాలకు మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి సంస్థాగత ఎన్నికలు కీలకమని పేర్కొన్నారు. డివిజన్ స్థాయి కమిటీలను సమర్థవంతంగా ఏర్పాటు చేసి పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని సూచించారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టి ప్రతి ఇంటికి పార్టీ సిద్ధాంతాలను తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియలో ప్రతి కార్యకర్త అప్రమత్తంగా వ్యవహరించి ఓటర్ల హక్కులను పరిరక్షించాలని సూచించారు. సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను శ్రద్ధగా విన్న ఎమ్మెల్యే, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ మల్కాజ్‌గిరి అభివృద్ధి కోసం ప్రభుత్వంపై నిరంతరం ఒత్తిడి తీసుకువస్తున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలంతా సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ సందర్భంగా పార్టీ సభ్యత్వ రుసుములను ప్రకటించారు. సాధారణ సభ్యత్వాన్ని రూ. 10గా, క్రియాశీలక సభ్యత్వాన్ని రూ. 50గా నిర్ణయించినట్లు వెల్లడించారు.కార్యక్రమంలో మాజీ ఎంబీసీ చైర్మన్ నందికంటి శ్రీధర్, మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, బద్దం పరుశురాం రెడ్డి, తోట నరేందర్ రెడ్డి, రావుల అంజయ్య, జేపీసీ వెంకన్న, ఖలీల్, అరుణ్ రావు, హేమంత్ పటేల్, వెంకటేష్ యాదవ్, శివసాయి యాదవ్, జనార్దన్, గంగాధర్ కృష్ణ తదితర నాయకులతో పాటు మహిళలు, యువకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతులకు వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధునిక టెక్నాలజీల ను అందించాలి

**- మార్కెట్ లో డిమాండ్ ఉన్న పంటలనే రైతులు సాగు చేయాలి- వ్యవసాయ వర్సిటీ విత్తన వారోత్సవాలు- 2026 ప్రారంభించిన మంత్రి తుమ్మల**



హైదరాబాద్, నేటి శుభోదయ ::: రాజేంద్ర నగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు శనివారం పర్యటించారు. తొలుత మంత్రి గత ఏడాది స్థాపించిన సెంటర్ ఫర్ డిజిటల్ అగ్రికల్చర్, టెక్నాలజీ ని సందర్శించి ఆధునిక డ్రోన్స్ వినియోగం పై చేస్తున్న పరిశోధన ల గురించి తెలుసుకున్నారు. భవిష్యత్ వ్యవసాయ రంగం లో కూలీల సమస్య అధికమయ్యే అవకాశం ఉన్నందున డ్రోన్స్ వినియోగం ప్రాముఖ్యత ని గుర్తు చేసారు. తదనుగుణం గా వ్యవసాయ విశ్వవిద్యాలయం రూపొందించిన డ్రోన్ ఆధారిత వివిధ వ్యవసాయ విధానాల్ని మంత్రి అభినందించారు. అదే విధంగా ఇటీవల ఎస్ బిఐ - సిఎస్ఆర్ నిధుల సాయం తో అభివృద్ధి చేసిన రోబోటిక్స్, సెన్సర్ బేస్డ్ ప్రయోగశాలని సందర్శించి ఇప్పటికే కొన్ని రోబోలని వ్యవసాయ రంగం లో ఉపయోగించే విధంగా అభివృద్ధి చేసినందుకు వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలని మంత్రి అభినందించారు. సి -డిఏటి లో భాగం అయిన ఆర్ఎస్ అండ్ జిఐఎస్ ల్యాబ్ ని సందర్శించి ఇటీవల తెలంగాణ ప్రభుత్వానికి అందించిన ఉపగ్రహ ఆధారిత గణాంకాల గురించి తెలుసుకున్నారు. రాష్ట్రం లోని రైతాంగం యాజమాన్యం పరిధి లో ఉన్న మొత్తం భూమి లో సుమారు 9.3 శాతం భూమి సాగు లో లేదని ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. 99 రోజుల ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక లో భాగం గా వ్యవసాయ విశ్వవిద్యాలయం తలపెట్టిన విత్తన వారోత్సవాలు కార్యక్రమాన్ని మంత్రి లాంఛనం గా ప్రారంభించి పది మంది రైతులకు వివిధ పంటలకి చెందిన నాణ్యమైన మూల విత్తనాలని పంపిణీ చేశారు. విశ్వవిద్యాలయం ఈ కార్యక్రమం ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడం చాలా అభినందనీయం అని మంత్రి అన్నారు. కొన్ని విత్తన కంపెనీల మాయ మాటలకి మోసపోకుండా రైతులు ఈ నాణ్యమైన విత్తనాలు వినియోగించి తక్కువ ఖర్చు తో అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. అదే విధంగా రైతులు మార్కెటింగ్ అవకాశాలు ఉన్న పంటలనే సాగు చేయాలని, పంట మార్పిడి విధానాలని అనుసరించాలన్నారు. 60 ఏళ్ల క్రితం ఏర్పాటు అయిన ఈ వ్యవసాయ విశ్వవిద్యాలయం మాజీ ప్రధాని ఇందిరా గాంధీ సహా అనేక మంది మహానుభావుల తోడ్పాటు తో దేశం లో ప్రముఖ స్థానాన్ని ఆక్రమించిందని మంత్రివర్యులు అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తోడ్పాటు తో విశ్వవిద్యాలయం ఇంకా పురోగతి సాధిస్తుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. విశ్వ విద్యాలయం శాస్త్రవేత్తలు నిరంతరం రైతుల తో మమేకం అయి వారికి కావలసిన పరిష్కారాలు అందించాలన్నారు. అదే విధంగా ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న అనేక అదునాతన టెక్నాలజీ లని విశ్వవిద్యాలయం రైతాంగానికి అందుబాటులోకి తీసుకొని రావాలని మంత్రి విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలకి సూచించారు. సాగుకు కీలకం అయిన నాణ్యమైన విత్తనాలని రైతాంగానికి అందించాలనే ఉద్దేశం తో గత ఏడాది నుంచి ఈ విత్తన పంపిణి కార్యక్రమం చేపట్టామని వ్యవసాయ విశ్వ విద్యాలయం ఉప కులపతి అల్దాస్ జానయ్య తెలిపారు.ఈ కార్యక్రమం లో పరిశోధన సంచాలకులు డాక్టర్ మరాఠి బలరామ్, డాక్టర్ బాలాజీ నాయక్, డాక్టర్ నీలిమ, డాక్టర్ వెంకటేశ్వర్లు,డాక్టర్ జెల్లా సత్యనారాయణ, డాక్టర్ వై.చంద్రమోహన్ శాస్త్రవేత్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.




## గుడి ని తిరిగి పునరుద్ధరణ, నూతన దర్గా ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

**– కార్యక్రమంలో పాల్గొన్న**

**మల్లి బాబు యాదవ్, షేక్ పతే మహమ్మద్, ఏపూరి మహేందర్**



కామేపల్లి, నేటి శుభోదయ ::: కామేపల్లి మండలం జోగుగూడెం గ్రామంలో ని పురాతన ఆంజనేయ స్వామి గుడి కి రహదారి సౌకర్యం లేక, రోడ్డుకు దిగువ కావడం వలన భక్తులు అసౌకర్యానికి గురువుతున్నందుకు తిరిగి గుడిని పైకి లేపి, నూతన కట్టడాలతో పునరుద్ధరణ కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఊట్కూరు గ్రామంలో నూతనంగా ముస్లింల ప్రార్థనా మందిరం ( దర్గా)ను నిర్మించడం జరిగింది. శనివారం జరిగిన దర్గా ప్రారంభోత్సవ కార్యక్రమంలో, గుడి పునరుద్ధరణ కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి షేక్ పతే మహమ్మద్, జిల్లా నాయకులు ఏపూరి మహేందర్, రాయల ఉపేందర్ పాల్గొని ఊటుకూరు లోని జాన్ పహాడ్ సైదులు దర్గాకొరకు విరాళం ఇచ్చిన స్థలదాత ప్రొద్దుటూరు అనంతరాములు -జయమ్మ లను దర్గా నిర్మాణానికి 500000/- రూపాయలు విరాళం ఇచ్చిన షేక్ పెద్ద మల్సూర్ -లతిభీ ల జ్ఞాపకార్థం షేక్ రఫీ -సమీరా బేగం(వైజాగ్) లను ఈ సందర్భంగా అభినందించారు.



అనంతరం వారు మాట్లాడుతూ తరతరాలుగా మన దేశంలో గుడి మసీదు చర్చి లలో ప్రజలు ప్రార్థన చేసుకుంటూ సర్వమత సమానత్వంతో ఉంటున్నారని, మధ్యలో వచ్చిన కొన్ని మతతత్వ పార్టీలు అవిచ్ఛిన్నకర శక్తులతో మతాల మధ్య చిచ్చు పెడుతూ రాజకీయంగా లబ్ధి పొందుతున్నారని, ఇది మన దేశానికి సంబంధించిన సాంప్రదాయం కాదని, పేర్కొన్నారు. దేశ అభివృద్ధి కోసం మాత్రమే రాజకీయాలు వాడుకోవాలని, ప్రజల మనోభావాలపై మత చాందసవాదాన్ని రుద్ది, దేశంలో అశాంతి కలిగించకూడదని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భూక్యా సైదమ్మ లక్ష్మణ్, జర్పల అనిత గణేష్, హట్కర్ శంకర్ బట్టు శంకర్, జరపల రామోజీ ఇస్లావత్ స్వామి, జర్పల రాము జర్పల చంద్రు, జర్పల బాలాజీ, జర్పల మోతిలాల్, సలీం, ముస్లిం మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వంతో తాడోపేడో తెల్చుకుంటాం

**– బిక్షాటన చేస్తూ నిరసన తెలిపిన గ్రామదీపికలు**



నేలకొండపల్లి, నేటి శుభోదయ ::: గ్రామదీపికల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం తో తాడోపేడో తెల్చుకుంటామని సంఘం జిల్లా నాయకురాలు రాజపుత్ర పార్వతీబాయి హెచ్చరించారు. గ్రామదీపికల నిరవదిక సమ్మె లో భాగంగా రెండో రోజు శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. పట్టణంలో బిక్షాటన చేస్తూ విన్నూత నిరసన కార్యక్రమం చేశారు. ప్రభుత్వం వచ్చి రెండున్నర సంవత్సరాలు అవుతున్నా మా హామీలు అమలు చేయటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో 58 ను సవరించాలని కోరారు. సెర్ఫ్ ఉద్యోగులుగా గుర్తించాలని. రూ.26 వేల వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. వేతనాలు పెంచుతామని ఇచ్చిన హామీ ని నేటి వరకు అమలు కావటం లేదని అగ్రహం వ్యక్తం "చేశారు. ప్రభుత్వం తమ న్యాయమైన కోర్కెలు తీర్చే వరకు ప్రత్యక్ష " ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వంతో పోరాడాతామని, నిరసనలు దశల వారీగా చేపట్టనున్నట్లు తెలిపారు. చాలీచాలనీ వేతనాలు,సమస్యలు పరిష్కారం చేయకుంటే బిక్షం ఎత్తుకుని విధులు నిర్వహించాలా ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంతో గ్రామదీపికల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## అస్వస్థతకు గురైన గ్రామదీపిక..!

**– దీక్ష శిభిరంలో వడదెబ్బకు పడిపోయిన వైనం నేలకొండపల్లి**




నేలకొండపల్లి, నేటి శుభోదయ ::: గ్రామదీపికల నిరవదిక సమ్మెలో పాల్గొన్న గ్రామదీపిక అస్వస్థత కు గురైయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండల కేంద్రంలో తమ సమస్యలు పరిష్కారించాలని కోరుతూ గ్రామదీపికలు నిరవదిక సమ్మె ను చేపట్టారు. ఈ సమ్మె లో పాల్గొన్న గువ్వలగూడెం కు చెందిన గ్రామదీపిక మరియమ్మ శిభిరంలో ఒక్కసారిగా పడిపోయింది. పెరిగిన ఎండ తీవ్రతను తట్టుకోలేక అస్వస్థతకు గురి కావటంతో సహచర గ్రామదీపికలు వెంటనే హస్పిటల్ కు తరలించి ప్రధమ చికిత్స చేయించారు. ఆమె తో పాటు మరో ముగ్గురు ఎండ తీవ్రత వలన వడదెబ్బతో అస్వస్థత కు గురైనప్పటకీ శిభిరంలో నిరవదిక సమ్మె ను కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు ప్రాణాలు పోయిన ఆందోళన మాత్రం విరమించేది లేదని హెచ్చరించారు.

## పారిశుధ్ధ్య పనులపై సమీక్ష నిర్వహించిన అనిల్, బెల్లం రాధిక



ఖమ్మం, నేటి శుభోదయ ::: ఖమ్మం నగరపాలక సంస్థ కార్యాలయంలో శనివారం ఏఎంసీ అనిల్, హార్టికల్చర్ ఆఫీసర్ బెల్లం రాధిక శానిటరీ జవాన్లు శానిటరీ ఇన్స్పెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నగర పారిశుధ్య నిర్వహణ, చెత్త సేకరణ, కాలువల శుభ్రత పనులపై అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.ప్రతి డివిజన్‌లో రోజుకు కనీసం రెండు ట్రిప్పులు చొప్పున ట్రాక్టర్ల ద్వారా చెత్త సేకరణ నిర్వహించి, నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిగా సాధించాలని సూచించారు. అయితే కేవలం ట్రిప్పుల సంఖ్య పెంచడం కోసం ఖాళీ ట్రాక్టర్లు నడపకుండా, ప్రతి ట్రిప్పు పూర్తిస్థాయిలో చెత్తతో నింపి తరలించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.అదే విధంగా, కాలువల శుభ్రత పనుల కోసం ముందస్తుగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకుని, ఒక వారంలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. నగరంలోని ప్రతి డివిజన్‌లో ఎక్కడా చెత్త పేరుకుపోకుండా పరిశుభ్రత నిర్వహించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.పారిశుధ్య సిబ్బంది హాజరు, విధుల కేటాయింపు, పని చేస్తున్న ప్రాంతాలు వంటి వివరాలను జవాన్లు ఎప్పటికప్పుడు నమోదు చేసి తమ వద్ద అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. అధికారులు తనిఖీలకు వచ్చినప్పుడు సంబంధిత సమాచారం వెంటనే అందించే విధంగా వ్యవస్థను బలోపేతం చేయాలని ఆదేశించారు.నగరాన్ని పరిశుభ్రంగా, స్వచ్ఛంగా ఉంచడంలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన పారిశుధ్య సేవలు అందించాలని సమావేశంలో సూచించారు.



## గజ్వేల్ బస్టాండ్ ను వెంటనే ప్రారంభించాలి

: వంటేరు ప్రతాప్‌రెడ్డి



గజ్వేల్, 23 మే 2026 : నేటి శుభోదయ:గజ్వేల్ పట్టణంలో నూతనంగా నిర్మించిన బస్టాండ్‌ను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ శనివారం గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద ప్రయాణికులు, విద్యార్థులు, పార్టీ శ్రేణులతో కలిసి భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ప్రజ్ఞాపూర్ బస్టాండుకు 4 కోట్లు, గజ్వేల్ బస్బే, గజ్వేల్ బస్టాండులకు కలిపి మొత్తం 12 కోట్ల రూపాయలను మంజూరు చేసి, నిర్మాణ పనులను చివరి దశకు తీసుకువచ్చారని గుర్తుచేశారు. నిర్మాణం పూర్తయి మూడు నెలలు గడుస్తున్నా, ప్రస్తుత కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం దీనిని ప్రారంభించకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. 45 డిగ్రీల ఎండలో మహిళలు, విద్యార్థులు, వృద్ధులు బస్సుల కోసం రోడ్లపైనే వేచి చూడాల్సి వస్తోందని, కోట్ల రూపాయలతో నిర్మించిన భవనం ప్రారంభానికి నోచుకోకపోవడంతో వృధాగా మారుతోందని, జిల్లా కలెక్టర్‌కు, మంత్రులకు తగిన ఆదేశాలు ఇచ్చి, వెంటనే సమయం కేటాయించి బస్టాండ్‌ను ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో గజ్వేల్ మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందనా రవీందర్, మాజీ చైర్మన్ ఎన్.సి. రాజమౌళి, పట్టణ అధ్యక్షుడు నమాజ్ మీరా, వైస్ చైర్మన్ పద్మాబాయి నర్సింగరావు, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ గూడెం కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు గోలి సంతోష్, కోట బాబు, మర్కంటి కనకసేన, బీఆర్ఎస్ నాయకులు దుర్గాప్రసాద్, శ్యామల మల్లేశం, ప్రతాపరెడ్డి, స్వామి, ఉమర్, అహ్మద్, హనుమంత రెడ్డి, శివ, పుల్ల బీరయ్య, ప్రయాణికులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వసంతపురి కాలనీలో రూ.12 లక్షల సీసీ రోడ్డు పనులకు శ్రీకారం

**కాలనీవాసులతో కలిసి ప్రారంభించిన మాజీ కార్పొరేటర్ వై. ప్రేమ్ కుమార్**



మల్కాజ్‌గిరి, మే 23:ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ పరిధిలోని వసంతపురి కాలనీలో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మాజీ కార్పొరేటర్ వై. ప్రేమ్ కుమార్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. సుమారు రూ.12 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఈ రోడ్డు పనులను కాలనీవాసులతో కలిసి ప్రారంభించారు.కాలనీలో చాలా కాలంగా రోడ్ల సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సీసీ రోడ్డు నిర్మాణంతో స్థానికులకు మెరుగైన రవాణా సౌకర్యం కలుగుతుందని వై. ప్రేమ్ కుమార్ తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను దశల వారీగా చేపడుతున్నామని పేర్కొన్నారు.ఈ సందర్భంగా వసంతపురి కాలనీ అసోసియేషన్ సభ్యులు లక్ష్మీనారాయణ, యోగేశ్వరరావు, రవి, నాగరాజు, శివమణి, భాను ప్రకాష్ తదితరులు మాజీ కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు బాబు, సత్యనారాయణ, సంపత్ రావు, కిషోర్, రాహుల్‌తో పాటు కాలనీవాసులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పెండింగ్ లో ఉన్న విద్యార్థుల ఫీజు రీఎంబర్స్ మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

**– హెచ్ సి.యు విద్యార్థి సంఘం**

**నాయకులు రాకేష్ దత్త ఆద్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరాహార దీక్ష**



ఖమ్మం, నేటి శుభోదయ ::: పెండింగ్లో ఉన్న విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని,కలెక్టరేట్ లోని ధర్నా చౌక్ లో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి నాయకుడు రాకేష్ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెండింగ్ లో ఉన్న 10వేల కోట్ల రూపాయల ఫీజు బకాయిలు విడుదల చేయాలని, విద్యార్థులపై ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి సరికాదు అని అన్నారు.రాకేష్ దత్తా నిరాహార దీక్షకు ముఖ్య అతిధిగా పాల్గొన్నా జాతీయ బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ డా.ర్యాగా అరుణ్ కార్యక్రమంలో మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడటం విడనాడాలి అని, విద్యార్థుల ఆగ్రహానికి, ప్రభుత్వం గురికాక తప్పదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా ప్రముఖ వైద్యులు గోంగూర వెంకటేశ్వర్లు సంఘీభావం తెలిపారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ జీఓ నెంబర్ 7 రద్దు చేయాలని విజ్ఞప్తిచేసారు. ఫీజు బకాయిలని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నిరాహాదీక్ష కొనగిస్తున్నట్లు తెలిపారు. ఈ దీక్షకు సంఘీభావం తెలిపిన వారిలో మోత్కూరు నారాయణ రావు, బక్క జడ్సన్, వేముల రామకృష్ణ తదితరులు సంఘీభావం తెలిపారు ఈ కార్యక్రమంలో బీసీ టౌన్ ప్రెసిడెంట్ గోనె శ్రీ శ్రీ, ఎం.డి.ఠాగూర్, జయంత్ యాదవ్, హరి యాదవ్ చింతల రోహిత్ , భాషబోయిన ఉపేందర్, కే.ప్రవీణ్ , ఏం. మనోజ్ , ఎస్.శేఖర్, సైదులు , అనిల్ తదితరులు విద్యార్థులు పాల్గొన్నారు.

## 50 శాతం సబ్సిడీతో రైతులకు అందుబాటులో జీలుగ విత్తనాలు

**మండల వ్యవసాయ అధికారి అనూష**



ముత్తారం:నేటి శుభోదయ-23:ముత్తారం మండలంలో 830 బస్తాల జీలుగ విత్తనాలు 50 శాతం సబ్సిడీతో రైతులకు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి అనూష తెలిపారు.రైతులు జీలుగ విత్తనాలు వాడి రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించుకొని, భూసారాన్ని పెంపొందించుకోవాలని వారు సూచించారు.విత్తనాలు కావాల్సిన రైతులు పట్టా పాస్ బుక్ జిరాక్స్,ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ముత్తారం,ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం మైదాబండ లో సంప్రదించాలని,30 కేజీల బస్తా సబ్సిడీ ధర 2452 రూపాయలు చెల్లించాలని అనూష తెలిపారు.

## దుబ్బా వీరలక్ష్మికి నివాళులు అర్పించిన కేతిరి, ముదుసు



వరంగల్ ప్రతినిధి : మే 23 (నేటి శుభోదయ):వరంగల్ కాశీబుగ్గ ప్రాంతానికి చెందిన ఆర్యవైశ్య మహాసభ వరంగల్ జిల్లా అధ్యక్షుడు దుబ్బ శ్రీనివాస్ మాతృమూర్తి దుబ్బ వీరలక్ష్మి శనివారం మరణించారు. విషయం తెలిసిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు కేతిరి రాజశేఖర్, ముదుసు నరసింహ వీరలక్ష్మి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం దుబ్బ శ్రీనివాస్ ను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## సీ ఎం ఆర్ ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేసిన కొప్పుల చంద్రశేఖర్, వడ్డెబోయిన



ఖమ్మం, నేటి శుభోదయ ::: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా చికిత్స అనంతరం నిరుపేదలైన బీదవాళ్లకు హాస్పటల్లో ఖర్చులు భరించలేని పరిస్థితిలలో చికిత్స చేయించుకొని అప్పుల పాలై ఇబ్బంది పడుతున్న నిరుపేదలకు గొప్ప వరం అని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు వడ్డెబోయిన నరసింహారావు అన్నారు. ఈ సందర్భంగా ఎంపీ రఘురామ రెడ్డి సిఫారసుతో మంజూరైన చెక్కులను క్యాంప్ ఆఫీస్ ఇంచార్జ్ కొప్పుల చంద్రశేఖర్, రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షులు, జిల్లా సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాజీ కార్పొరేటర్ వడ్డెబోయిన నరసింహారావు, డివిజన్ ప్రముఖుల సమక్షంలో లబ్ధిదారులు ఆరు మందికి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం, మాజీ కౌన్సిలర్ మైనారిటీ నాయకులు మజీద్, ఉమర్, డివిజన్ అధ్యక్షులు దాసరి పూర్ణ, నగర కార్యదర్శి నాగిశెట్టి రాధాకృష్ణ, బిసి సెల్ నాయకులు రాకొండే కృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

## పంట వ్యర్థాలను కాల్చొద్దు, ప్రాణాలకు ప్రమాదం

**--పర్యావరణానికి పెను విఘాతం**

**--భూమిలో కలియ దున్నితే బలం : వరికెల కిషన్ రావు పిలుపు..**



వరంగల్ ప్రతినిధి : మే 23 (నేటి శుభోదయ)ప్రతియేటా పంట కాలం పూర్తయ్యాక నేలలో మిగిలిన అవశేషాలైన పత్తి కట్టె, వరి కర్ర, కంది వివిధ రకాల పంట వ్యర్థాలను రైతులు కాలుస్తున్నారు. ఈ పరిస్థితుల్లో పర్యావరణానికి, నేలకు హాని కలుగుతుందని తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు వరికెల కిషన్ రావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,,పంట వ్యర్థాలను కాల్చడంతో సేంద్రియ కర్బనం, పోషకాలు క్షీణిస్తాయి. నేల భూసారం భూ ఉత్పాదక, సూక్ష్మ జీవుల సంఖ్య, మేలు చేసే కీటకాల సంఖ్య, నేల పొరలో తేమ శాతం తగ్గిపోతుందని తెలిపారు. నేల జీవసత్తువపంట అవశేషాలను తగులబెట్టడంతో భూసారంపై ప్రభావం పడుతుందని, నేలలోని సేంద్రియ కర్బనం, నత్రజని, భాస్వరం, పొటాష్తో పాటు సూక్ష్మ పోషకాలు నశించి భూమి నిస్సారంగా మారుతుందన్నారు. భూమికి మేలు చేసే వానపాములు, మిత్ర పురుగులు నశించడం వల్ల నేల జీవసత్తువ కోల్పోయి, పంట దిగుబడులు క్రమంగా తగ్గిపోతాయని వివరించారు."పర్యావరణాన్ని కాపాడుకుందాం -ఆరోగ్యంగా జీవిద్దాం" అనే నినాదంతో రైతుల్లో చైతన్యం రావాల్సిన అవసరం ఉందన్నారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల భూమిలోని సేంద్రీయ కర్బనం, మిత్ర పురుగులు నశించి నేల సారం దెబ్బతింటుందని తెలిపారు. అలాగే పొగ కారణంగా వాయు కాలుష్యం పెరిగి ప్రజల్లో ఊపిరితిత్తుల సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధుల ఆరోగ్యం తీవ్రంగా ప్రభావితమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పంట వ్యర్థాలను రైతులు ఆధునిక పద్ధతుల్లో వినియోగించుకోవాలని, హార్వెస్టర్ల ద్వారా పొడి చేసి భూమిలో కలియదున్నడం, కంపోస్ట్ ఎరువుగా తయారు చేయడం, మల్చింగ్ విధానంలో నేల తేమను కాపాడడం, పుట్టగొడుగుల పెంపకానికి వరి గడ్డిని వినియోగించడం వంటి మార్గాలను వివరించారు. ఈ సందేశం ప్రతి రైతుకు చేరేలా గ్రామాల్లో టమ్‌టమ్ ద్వారా చాటింపు వేయించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అధికారులు, రైతు సంఘాలు, గ్రామస్థులు కలిసి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు."మన గ్రామం -- మన బాధ్యత... మన భవిష్యత్తు మన చేతుల్లోనే ఉంది" అని పేర్కొంటూ ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రైతాంగం మొత్తం పర్యావరణ పరిరక్షణకు ముందుకు రావాలని వరికెల కిషన్ రావు విజ్ఞప్తి చేశారు.

## పదవి కోసం కాదు, ప్రజల కోసం రాజకీయాలు"



ఖమ్మం , నేటి శుభోదయ ::: ఎన్నికల సమయంలో మాత్రమే కనిపించే నాయకత్వం కాకుండా, ఎప్పుడూ ప్రజల మధ్య ఉండే నాయకత్వం కావాలని ప్రజలు కోరుకుంటున్న ఈ తరుణంలో పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి వ్యవహార శైలి ప్రత్యేకంగా కనిపిస్తోంది. గ్రామ సభలు, రైతు చర్చలు, బాధిత కుటుంబాల ఆర్థిక సహాయం పరామర్శలతో ప్రజలకు మరింత చేరువ అవుతున్నారు. ఏ కార్యక్రమమైనా ఆయన స్వయంగా హాజరవుతూ ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచు కుంటున్నారు.?"ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులు ప్రజల మధ్య ఉండాలి. సమస్యలు వచ్చినప్పుడు స్పందించాలి. కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే ఓట్ల కోసం రావడం నాయకత్వం కాదు" అంటూ కందాళ ఉపేందర్ రెడ్డి ఘాటుగా స్పందిస్తున్నారు.

### - స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పై ప్రజా అసంతృప్తి

ఇదే సమయంలో స్థానిక ఎమ్మెల్యే మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి వైఖరిపై నియోజకవర్గంలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. నెలల తరబడి నియోజక వర్గంలో కనిపించక పోవడం, ప్రజా సమస్యలపై స్పందన లేకపోవడం, రైతుల పరిస్థితిపై కనీసం అధికారులను అడిగి తెలుసుకున్న పరిస్థితి కూడా లేకపోవడం పట్ల స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పాలనా వైఫల్యాలను ఎండగడుతూ మన కందాళ ఉపేందర్ రెడ్డి ప్రజల గొంతుకగా మారుతున్నారు. రాజకీయంగా చూస్తే పాలేరులో బీఆర్ఎస్ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే దిశగా కందాళ ఉపేందర్ రెడ్డి అడుగులు పడుతున్నాయి. పదవి లేకపోయినా ప్రజల కోసం నిరంతరం పోరాడుతున్న ఆయన తీరుతో, ప్రస్తుతం పాలేరు రాజకీయాల్లో "ప్రజల మధ్యే ఉండే నాయకుడు ఎవరు?" అనే ప్రశ్నకు ఒకే ఒక్క సమాధానం వినిపిస్తోంది. అయనే స్థానికుడు కందాళ ఉపేందర్ రెడ్డి అని చెప్పక తప్పదు మరి.

## నూతన సీఐ కర్రె స్వామికి జర్నలిస్టుల స్వాగతం..

ప్రజల పక్షాన నిలవాలని ఆకాంక్ష



వరంగల్ ప్రతినిధి మే 23 (నేటి శుభోదయ)వరంగల్ నగరంలోని తూర్పు ప్రాంతానికి చెందిన మాల జర్నలిస్టులు ఆజంజాహీ మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ కొత్త సీఐగా బాధ్యతలు చేపట్టిన కర్రె స్వామిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పర్యావరణ హితంగా ఓ పూలమొక్కను బహూకరించి ఆత్మీయంగా శుభాకాంక్షలు తెలియజేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో, నిత్యం ప్రజల పట్ల అత్యంత నిబద్ధతతో వ్యవహరించాలని వారు ఆకాంక్షించగా.. సీఐ సైతం ఓ స్థానికుడిలా అంతే సానుకూలంగా స్పందిస్తూ అందరి సహకారంతో బాధ్యతగా ముందుకు సాగుతానని భరోసా ఇచ్చారు. సీఐ ని కలిసిన వారిలో బండి రవి,జక్కుల విజయ్ కుమార్, నీలం శివ,రవి తేజ,కిరణ్ కుమార్, బందెల కృష్ణ,క్రాంతి ఉన్నారు..

### రవాణా కష్టాల శాశ్వత పరిష్కారానికే

## సరికొత్త హై లెవల్ బ్రిడ్జిల నిర్మాణాలు

- మౌలిక వసతుల కల్పనతో పల్లెల రూపురేఖలు మార్చడమే ప్రధాన ధ్యేయం
- గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికే పిహెచ్సి
- నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా నిరంతర శ్రమ, మరిన్ని నిధుల సాధన


చుంచుపల్లి, కొత్తగూడెం, నేటి శుభోదయ ::: గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఐటిడిఏ నిధుల ద్వారా పెద్దపీట వేస్తున్నామని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం నియోజకవర్గ పరిధిలోని పలు అభివృద్ధి పనులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఇందులో భాగంగా చిట్టిరామవరం నుంచి చుంచుపల్లి రహదారిపై హై లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి, అలాగే కొత్తగూడెం బైపాస్ రోడ్డు నుంచి పెనుబల్లి (గరిమెళ్ళపాడు) ప్రధాన రోడ్డుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అదేవిధంగా పెనుబల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన పిహెచ్సి భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో ఆయన మాట్లాడుతూ మౌలిక వసతుల కల్పనతో పల్లెల రూపురేఖలు మార్చడమే తమ ప్రధాన ధ్యేయమన్నారు. ఈ బ్రిడ్జిల నిర్మాణంతో స్థానిక ప్రజల దశాబ్దాల రవాణా కష్టాలు తీరనున్నాయని, అత్యవసర సమయాల్లో వైద్యం కోసం ఇబ్బందులు పడకుండా పెనుబల్లిలో అధునాతన ప్రాథమిక వైద్యశాల అందుబాటులోకి తెచ్చామని ఆయన వివరించారు. రానున్న రోజుల్లో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, గ్రంధాలయ చైర్మన్ వీరబాబు, అధికారులు ఎంపిడివో శుభాషిణి, తహసీల్దార్ నాగరాజు, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు మధుకర్, శ్రీకాంత్, నాగేంద్ర, స్థానిక నాయకులు వాసిరెడ్డి మురళి, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, భవాని, గోవిందు, సర్పంచి శాంతి శ్రీ, రెడ్డి అరుణ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన ప్రాంతాల అభివృద్ధి, రవాణా సౌకర్యానికి పెద్దపీఠ

- రవాణా కష్టాల శాశ్వత పరిష్కారానికే సరికొత్త హై లెవల్ బ్రిడ్జిల నిర్మాణాలు
- మౌలిక వసతుల కల్పనతో పల్లెల రూపురేఖలు మార్చడమే ప్రధాన ధ్యేయం
- గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికే పిహెచ్సి



చుంచుపల్లి, కొత్తగూడెం, నేటి శుభోదయ ::: గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఐటిడిఏ నిధుల ద్వారా పెద్దపీట వేస్తున్నామని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం నియోజకవర్గ పరిధిలోని పలు అభివృద్ధి పనులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఇందులో భాగంగా చిట్టిరామవరం నుంచి చుంచుపల్లి రహదారిపై హై లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి, అలాగే కొత్తగూడెం బైపాస్ రోడ్డు నుంచి పెనుబల్లి (గరిమెళ్ళపాడు) ప్రధాన రోడ్డుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అదేవిధంగా



పెనుబల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన పిహెచ్సి భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో ఆయన మాట్లాడుతూ మౌలిక వసతుల కల్పనతో పల్లెల రూపురేఖలు మార్చడమే తమ ప్రధాన ధ్యేయమన్నారు. ఈ బ్రిడ్జిల నిర్మాణంతో స్థానిక ప్రజల దశాబ్దాల రవాణా కష్టాలు తీరనున్నాయని, అత్యవసర సమయాల్లో వైద్యం కోసం ఇబ్బందులు పడకుండా పెనుబల్లిలో అధునాతన ప్రాథమిక వైద్యశాల అందుబాటులోకి తెచ్చామని ఆయన వివరించారు. రానున్న రోజుల్లో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, గ్రంధాలయ చైర్మన్ వీరబాబు, అధికారులు ఎంపిడివో శుభాషిణి, తహసీల్దార్ నాగరాజు, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు మధుకర్, శ్రీకాంత్, నాగేంద్ర, స్థానిక నాయకులు వాసిరెడ్డి మురళి, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, భవాని, గోవిందు, సర్పంచి శాంతి శ్రీ, రెడ్డి అరుణ తదితరులు పాల్గొన్నారు.

## జన ప్రాంతాల అభివృద్ధి, రవాణా సౌకర్యానికి పెద్దపీఠ

- రవాణా కష్టాల శాశ్వత పరిష్కారానికే సరికొత్త హై లెవల్ బ్రిడ్జిల నిర్మాణాలు
- మౌలిక వసతుల కల్పనతో పల్లెల రూపురేఖలు మార్చడమే ప్రధాన ధ్యేయం
- గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికే పిహెచ్సి
- నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా నిరంతర శ్రమ, మరిన్ని నిధుల సాధన

చుంచుపల్లి, కొత్తగూడెం, నేటి శుభోదయ ::: గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఐటిడిఏ నిధుల ద్వారా పెద్దపీట వేస్తున్నామని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం నియోజకవర్గ పరిధిలోని పలు అభివృద్ధి పనులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఇందులో భాగంగా చిట్టిరామవరం నుంచి చుంచుపల్లి రహదారిపై హై లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి, అలాగే కొత్తగూడెం బైపాస్ రోడ్డు నుంచి పెనుబల్లి (గరిమెళ్ళపాడు) ప్రధాన రోడ్డుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అదేవిధంగా పెనుబల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన పిహెచ్సి భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో ఆయన మాట్లాడుతూ మౌలిక వసతుల కల్పనతో పల్లెల రూపురేఖలు మార్చడమే తమ ప్రధాన ధ్యేయమన్నారు. ఈ బ్రిడ్జిల నిర్మాణంతో స్థానిక ప్రజల దశాబ్దాల రవాణా కష్టాలు తీరనున్నాయని, అత్యవసర సమయాల్లో వైద్యం కోసం ఇబ్బందులు పడకుండా పెనుబల్లిలో అధునాతన ప్రాథమిక వైద్యశాల అందుబాటులోకి తెచ్చామని ఆయన వివరించారు. రానున్న రోజుల్లో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, గ్రంధాలయ చైర్మన్ వీరబాబు, అధికారులు ఎంపిడివో శుభాషిణి, తహసీల్దార్ నాగరాజు, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు మధుకర్, శ్రీకాంత్, నాగేంద్ర, స్థానిక నాయకులు వాసిరెడ్డి మురళి, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, భవాని, గోవిందు, సర్పంచి శాంతి శ్రీ, రెడ్డి అరుణ తదితరులు పాల్గొన్నారు.

# బ్రిడ్జి నిర్మాణం సీతంపేట-రాఘవాపురం గ్రామీణుల చిరకాల వాంఛ

**- రూ.4.75కోట్లతో హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నాం- నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తెస్తాం- రూ.34లక్షలతో రెడ్డిపాలెం సిసి రోడ్డు నిర్మాణం పూర్తి చేశాం- రూ.45లక్షలతో నిర్మించిన ఎంఆర్సి భవనం అందుబాటులోకి వచ్చింది - ప్రజా సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం ప్రజల చెంతనే ఉంటాం- రాబోయే రోజుల్లో మరిన్ని నిధులతో పల్లెల రూపురేఖలు మారుస్తాం- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావుు- సుజాతనగర్ మండలంలో శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు**



సుజాతనగర్, కొత్తగూడెం, నేటి శుభోదయ ::: సీతంపేట-రాఘవాపురం గ్రామీణుల చిరకాల వాంఛ అయిన బ్రిడ్జి నిర్మాణాన్ని నెరవేరుస్తున్నామని, బ్రిడ్జి నిర్మాణం ప్రాధాన్యతను గుర్తించి ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు చేయించడం జరిగిందని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. సుజాతనగర్ మండల పరిధిలో రూ.5.54 కోట్ల నిధులకు సంబంధించి శనివారం అయన శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభల్లో కూనంనేని మాట్లాడుతూ రూ.4.75 కోట్ల భారీ అంచనా వ్యయంతో హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నామని వెల్లడించారు. ఈ బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. అలాగే రూ.34 లక్షలతో రెడ్డిపాలెం సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి చేసి విజయవంతంగా అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. రూ.45 లక్షలతో అత్యాధునిక వసతులతో నిర్మించిన ఎంఆర్సి భవనాన్ని కూడా ఈ రోజు ప్రారంభించడం సంతోషంగా ఉందని, మండలంలో విద్యాసంబంధిత సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్నాయన్నారు. వేపలగడ్డ స్మశానవాటికలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి రెండు బోర్లు మంజూరు చేయడం జరిగిందని, వాటి శంకుస్థాపన పూర్తేచేశామన్నారు. నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తాము నిరంతరం శ్రమిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. పల్లెల్లో మౌలిక వసతుల కల్పనకు తమ ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే వివరించారు. రాబోయే రోజుల్లో మరిన్ని నిధులను మంజూరు చేయించి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి పనుల నాణ్యతలో రాజీ పడకుండా సకాలంలో పూర్తి చేయాలని ఈ సందర్భంగా ఆయన ఆదేశించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కొత్తగూడం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, తహసీల్దార్ వి వరప్రసాద్, ఎంపిడివో భారతి, ఆరడబ్ల్యూఎస్ ఏఈ గుప్తా, విద్యుత్ ఏఈ జి కిషన్, ఏడిఈ రవికుమార్, సిఐ వెంకటేశ్వర్, పిఆర్ ఏఈ రాజు, డిఈ నాగేందర్, ఎంఈ ఓ లీలా, ఎస్ఐ రమాదేవి, హన్మంతరావు, వ్యవసాయశాఖ అధికారి నర్మద, స్థానిక నాయకులు భూక్యా దస్రు, కొమారి హన్మంతరావు, జక్కుల రాములు, ఉపేందర్, భూక్యా శ్రీనివాస్, గుమ్మడిల్లి దర్గయ్య, బొడ్డు కేశవరావు, గారికే ఉపేందర్, నరేష్, ముక్కెర మురళి, దండు సురేష్, లావుడియా గోపి తదితరులు పాల్గొన్నారు.



# ఆరోగ్యకరమైన జీవితానికి క్రీడలు ఎంతో అవసరం

**: ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

**- యువత ప్రతిభకు అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం- జాబ్ మేళాలో ఎంపికైన 618 మంది అభ్యర్థులకు ప్రొవిజనల్ ఆఫర్ లెటర్లు అందజేత- కంఫర్ట్ జోన్ నుంచి బయటకు వస్తేనే విజయాలు సాధిస్తాం- 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన యువజన, క్రీడల అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్**




ఖమ్మం, నేటి శుభోదయ ::: ఆరోగ్యకరమైన జీవితానికి క్రీడలు ఎంతో అవసరమని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో యువజన, క్రీడల అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా "ఉద్యోగ సాధన -- కనెక్టింగ్ టాలెంట్ విత్ ఆపర్చునిటీస్" కార్యక్రమం జాబ్ మేళా క్రింద ఎంపికైన 618 మంది అభ్యర్థులకు జాబ్‌మేళా ప్రొవిజనల్ ఆఫర్ లెటర్లు అందజేశారు. అలాగే సీఎం కప్- 2026 రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన 72 మంది యువ క్రీడాకారులను సన్మానించారు. మొత్తం 433 మంది క్రీడాకారులు వివిధ విభాగాల్లో పతకాలు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ గతంలో సాధారణంగా కుటుంబాల్లో క్రీడలకు అంతగా ప్రోత్సాహం ఉండేది కాదని, ప్రస్తుతం సానియా మీర్జా, తిలక్ వర్మ వంటి యువత క్రీడల్లో రాణిస్తూ ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారని అన్నారు. ప్రస్తుతం క్రికెట్ మాత్రమే కాకుండా అనేక క్రీడల్లో యువత ప్రతిభ కనబరుస్తోందని, ఇటీవల ఒలింపిక్స్‌లో భారత క్రీడాకారులు అథ్లెటిక్స్ విభాగంలో కూడా పతకాలు సాధించడం గర్వకారణమని తెలిపారు. ప్రస్తుతం ప్రపంచం వేగంగా మారుతోందని, ప్రముఖ ఇన్వెస్టర్ రాకేష్ ఝున్‌ఝున్‌వాలా సుమారు 50 వేల కోట్ల సంపద సంపాదించి నప్పటికీ ఆరోగ్య సమస్యలతో చిన్న వయసులోనే మరణించారని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. తాను అన్ని చోట్ల పెట్టుబడులు పెట్టానని, కానీ ఆరోగ్యంపై పెట్టుబడి పెట్టలేదని ఆయన చెప్పిన మాటలను గుర్తు చేశారు. సంపద కంటే ఆరోగ్యం ముఖ్యమని, ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి క్రీడలు ఎంతో అవసరమని కలెక్టర్ తెలిపారు. శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కూడా క్రీడలు అందిస్తాయని అన్నారు. ఖమ్మం జిల్లా క్రీడల్లో ఎప్పుడూ ముందంజ లో ఉంటుందని, ఇక్కడ మంచి మౌలిక వసతులు ఉన్నాయని, కోచ్‌లు అందుబాటులో ఉన్నారని తెలిపారు. క్రీడల్లో విజయాలు సాధించాలంటే శరీరాన్ని దేవాలయంలా భావించి సరైన పోషకాహారం తీసుకోవాలని గాయాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టితే దీర్ఘకాలం క్రీడల్లో కొనసాగవచ్చని సూచించారు. ప్రతి ఒక్కరిలోనూ ప్రత్యేక ప్రతిభ ఉంటుందని, కొందరికి మేధస్సు, కొందరికి సంగీతం, నృత్యం, మరికొందరికి క్రీడల్లో ప్రతిభ ఉంటుందని, వాటిని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని యువతకు సూచించారు. ఉద్యోగాలు సాధించిన యువతకు ఇది మొదటి అడుగు మాత్రమేనని, కంఫర్ట్ జోన్ నుంచి బయటకు వచ్చి కష్టపడి పనిచేస్తే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని అన్నారు. చిన్న స్థాయి ఉద్యోగంతో ప్రారంభించి ప్రస్తుతం మంచి స్థాయికి ఎదిగిన యువత ఉదాహరణలు తమకు తెలిసి ఉన్నాయని, కృషి, పట్టుదలతో మంచి భవిష్యత్తు సాధించవచ్చని యువతకు ప్రోత్సాహం ఇచ్చారు. అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ జాబ్‌మేళాలో ఎంపికైన యువతకు అభినందనలు తెలిపారు. జాబ్‌మేళాలో 618 మంది ఎంపిక కావడం అభినందనీయమని అన్నారు. సీఎం కప్ రాష్ట్ర స్థాయి పతక విజేతలకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ప్రతి విజయం జీవితంలో ఒక మైలురాయిగా నిలవాలని, అది భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు స్ఫూర్తినివ్వాలని ఆకాంక్షించారు. యువత అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివైఎస్ఓ సునీల్ రెడ్డి, జిల్లా ఉపాధి అధికారి ఎన్.మాధవి, కోచ్ లు, క్రీడాకారులు, విద్యార్థినీ, విద్యార్థులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసేవే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

**: మోర శ్రీకాంత్ ముదిరాజ్. బలరాంనగర్‌లో మజ్జిగ పంపిణీ కార్యక్రమం**




నేరెడ్ మెట్ , మే 23:వేసవి ఎండల తీవ్రతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఉపశమనం కల్పించేందుకు మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బలరాంనగర్ డివిజన్‌లో మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించినట్లు డివిజన్ అధ్యక్షుడు మోర శ్రీకాంత్ ముదిరాజ్ తెలిపారు. శనివారం ఓల్డ్ పీస్ చౌరస్తాలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మల్కాజ్‌గిరి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ లక్ష్మీకాంత్ రెడ్డి, బి బ్లాక్ అధ్యక్షుడు టీ. వెంకటేష్ యాదవ్, బి బ్లాక్ కార్యనిర్వాహక అధ్యక్షుడు బి.కే. శ్రీనివాస్ హాజరై ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మోర శ్రీకాంత్ ముదిరాజ్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను గుర్తించి వారికి అండగా నిలవడం కాంగ్రెస్ పార్టీ విధానమని పేర్కొన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలకు చల్లదనం కలిగించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. భవిష్యత్తులోనూ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డివిజన్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పంట అవశేషాలను కాల్చవద్దు

**: జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ - పర్యావరణ పరిరక్షణతో పాటు భూసారం కాపాడాలి- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**



ఖమ్మం, నేటి శుభోదయ ::: పంట అవశేషాలను కాల్చడం వల్ల మంటలు అదుపు తప్పి పక్కనున్న పంటలు,ఆస్తులు, విద్యుత్ లైన్లు దెబ్బతినే ప్రమాదం ఉందని, పశువులకు కూడా ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల పర్యావరణానికి, భూసారానికి, రైతుల ఆర్థిక పరిస్థితికి తీవ్ర నష్టం కలుగుతుందని, పంట అవశేషాలను కాల్చవద్దని ఖమ్మం జిల్లాలో పంట కోత అనంతరం పంట అవశేషాలను విస్తృతంగా కాల్చుతున్న ఘటనలు గమనించబడుతున్నాయని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. పంట అవశేషాలను కాల్చినపుడు హానికర వాయువులు విడుదలై గాలి కాలుష్యం పెరుగుతుందని, దీని వల్ల ప్రజల్లో శ్వాసకోశ సమస్యలు పెరిగే ప్రమాదం ఉందన్నారు.పంట అవశేషాల దహనం వల్ల నేలలోని సేంద్రియ కర్బనం, నత్రజని, ఫాస్ఫరస్, పొటాష్ వంటి కీలక పోషకాలు నశించి భూసారం తగ్గిపోతుందని, దీని ఫలితంగా రైతులు అధికంగా రసాయన ఎరువులపై ఆధారపడాల్సి రావడంతో ఖర్చులు పెరిగి, దిగుబడి తగ్గుతుందని చెప్పారు.రైతులు పర్యావరణాన్ని కాపాడే విధంగా వ్యవహరించి, పంట అవశేషాలను కాల్చకుండా రోటవేటర్ ద్వారా నేలలో కలియదున్నడం, కంపోస్ట్ లేదా వర్మీ కంపోస్ట్ తయారు చేయడం, పశుగ్రాసంగా వినియోగించడం, మల్చింగ్ పద్ధతులు అనుసరించడం వంటి ప్రత్యామ్నాయాలను అవలంబించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆ ప్రకటనలో తెలిపారు.

# చంద్రధన లో స్టేజి నాటకానికి విశేష స్పందన

**-నేటి తరంలో నాటి కళ ల కు పునర్జీవం -చంద్రధన లో విశేషంగా ఆకట్టుకున్న శ్రీ వెంకటేశ్వర స్వామి మహత్యం, వీధి నాటకం**



నేటిశుభోదయ: తలకొండపల్లి: తలకొండపల్లి మండలం చంద్రధన గ్రామంలో భక్తి శ్రద్ధలతో కలియుగ దైవం, కోటానికోట్ల భక్తుల హృదయాల్లో నిండిన శ్రీ మహా విష్ణు అవతారం, శ్రీ వెంకటేశ్వర మహత్య స్టేజీ నాటక చంద్రధన గ్రామంలో విశేషంగా ఆకట్టుకోవడం జరిగింది. ఈ నాటక ప్రదర్శనకు గ్రామ సర్పంచ్ సోల్లు రంగమ్మ కుమారుడు



సొల్లు సుధాకర్ వంతుగా 5,000/- ఆర్థిక సహాయం అందించడం జరిగింది. మరియు ఉప సర్పంచ్ రవీందర్ రెడ్డి 5,000/-అలాగే బి ఆర్ ఎస్ నాయకులు మైసగాళ్ల శేఖర్ 10116/- కటి కెల శేఖర్ యాదవ్ 3000/-వార్డు సభ్యులు ఇట మోని అజయ్ 1000/- ఓర్సు రాజు (అంకుశం)1000/-మాజీ సర్పంచ్ బేగరి రాములు 1000/-మాజీ యాదవ సంఘం అధ్యక్షులు నిదురం యాదయ్య 1016/-మోక్తల జంగయ్య గౌడ్ 550/- రూపాయలు తమ వంతుగా అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా కమిటీ సభ్యులందరినీ అభినందిస్తూ శాలువాలతో సత్కరించారు సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంపొందిస్తూ,సనాతన సంస్కృతి మరియు సంప్రదాయాలను ప్రజలకు చేరవేసే ఇటువంటి కార్యక్రమాలు ఎంతో గొప్పవని తెలిపారు. గ్రామ ప్రజల ఐక్యత, భక్తి భావం మరింత బలపడాలని ఆకాంక్షిస్తూ,భవిష్యత్తులో కూడా ప్రజా సేవలో ముందుండి సహకరిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు సర్పంచ్, ఉప సర్పంచ్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ,ఉప సర్పంచ్,వార్డు సభ్యులు ఓర్సు రాజు(అంకుశం),అజయ్ ,ముసిలి పార్వతమ్మ వెంకటయ్య,గ్రామ బి ఆర్ ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు మోక్తల జంగయ్య గౌడ్,కటికేల శేఖర్ ,మైసగాళ్ల శేఖర్,వనం నర్సింహ,పురుషోత్తం,సొల్లు మల్లయ్య,నాటకం సభ్యులు,కమిటి సభ్యులు,ఇతరులు పాల్గొన్నారు

Printed Published and owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao RNI Title Code :- RNI TELTEL/2024/89620

## ఎస్సీ, ఎస్టీ బాధితులకు సకాలంలో న్యాయం అందించాలి

అట్రాసిటీ కేసుల పరిహారం నిర్దేశిత గడువులోగా అందించాలి

సివిల్ రైట్స్ డేకు తహసీల్దార్, ఎస్సైలు తప్పనిసరిగా హాజరు కావాలి

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



పెద్దపల్లి స్టాఫ్ రిపోర్టర్ , మే-23, నేటిశుభోదయ :ఎస్సీ, ఎస్టీ బాధితులకు చట్టప్రకారం సకాలంలో న్యాయం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు.శనివారం నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొని పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను సమగ్రంగా సమీక్షించారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అత్యాచార కేసుల్లో బాధితులకు ప్రభుత్వం మంజూరు చేసే పరిహారాన్ని మార్గదర్శకాల ప్రకారం నిర్దేశిత గడువులోగా విడుదల చేసి అందజేయాలని అధికారులను ఆదేశించారు. పరిహారానికి సంబంధించిన ఫైళ్లను ఆలస్యం చేయకుండా వెంటనే క్లియర్ చేయాలని సూచించారు. కమిటీ సభ్యుల విజ్ఞప్తి మేరకు ప్రతి సివిల్ రైట్స్ డే కార్యక్రమానికి తహసీల్దార్, ఎస్సైలు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు.ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, కార్పొరేట్ కళాశాలల వంటి ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత విద్యావకాశాలను పొందాలని కలెక్టర్ తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసుల్లో నిబంధనల ప్రకారం అవసరమైన సాక్ష్యాధారాలను కోర్టులకు సమర్పించి బాధితులకు చట్టబద్ధమైన న్యాయం జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు కొంకటి లక్ష్మీనారాయణ, పెద్దపల్లి మరియు రామగుండం డీసీపీ, ఏసీపీలు, పెద్దపల్లి మరియు మంథని ఆర్డీవోలు, డీఎస్సీడీవో రవీందర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, ఆర్ అండ్ బీ ఈఈ, ఏడి మైన్స్, జిల్లా ఉపాధి అధికారి, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధి రాజగోపాల్, డీవీఎంసీ సభ్యులు కవ్వంపల్లి సతీష్, దావు రమేష్, జాది ప్రభాకర్, పార్సా విజయ్ కుమార్, ఎరుగురాల భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.




## రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలి

: ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

అధికారిక డీలర్ల వద్ద నుంచే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలి

- బిల్లు తప్పనిసరిగా తీసుకొని భద్రపరచుకోవాలి

- ఎరువులు, విత్తనాల కొనుగోలుపై పత్రిక ప్రకటన విడుదల చేసిన జిల్లా కలెక్టర్



ఖమ్మం, నేటి శుభోదయ ::: రాబోయే సాగు సీజన్‌లను దృష్టిలో ఉంచుకుని రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.తక్కువ ధరలకు విత్తనాలు అందిస్తామని, అధిక దిగుబడి వస్తుందని ప్రచారం చేస్తూ రైతులను మోసం చేసే ప్రయత్నాలు చేసే అవకాశం ఉందని, రైతులు అలాంటి మోసపూరిత ప్రచారాలను నమ్మకుండా అధికారిక లైసెన్స్ కలిగిన డీలర్ల వద్ద నుంచే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలని సూచించారు. అనధికారిక వ్యక్తులు లేదా గుర్తింపు లేని వ్యాపారుల వద్ద నుండి ఎట్టి పరిస్థితుల్లోనూ విత్తనాలు కొనుగోలు చేయవద్దని కలెక్టర్ సూచించారు.ప్రతి కొనుగోలుకు తప్పనిసరిగా బిల్లు తీసుకొని భద్రపరచుకోవాలని, వ్యవసాయ శాఖ సూచించిన ధృవీకరించిన రకాల విత్తనాలనే వినియోగించాలని, తెలియని కొత్త రకాల విత్తనాలు కొనుగోలు చేస్తే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. విత్తనాలను కొనుగోలు చేసే ముందు సంబంధిత వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకోవాలని సూచించారు.నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువులపై సమాచారం తెలిసినా లేదా ఎవరైనా అనుమానాస్పదంగా విక్రయించే ప్రయత్నం చేసినా వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1077 కు సమాచారం అందించాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం జిల్లా కంట్రోల్ రూమ్ తక్షణమే స్పందించి అవసరమైన చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.జిల్లాలో నకిలీ విత్తనాల, ఎరువుల విక్రయాలను అరికట్టేందుకు ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నామని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. రైతులు అప్రమత్తంగా వ్యవహరించి నాణ్యమైన విత్తనాలను మాత్రమే వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## వడదెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలి

: ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



ఖమ్మం, నేటి శుభోదయ ::: ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు అవుతున్నందున, ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని వడదెబ్బ తగలకుండా ప్రజలు అవసరమైన జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎండదెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, ఎండలో బయట తిరగవద్దని, అత్యవసర పరిస్థితి అయితే తప్ప ప్రజలు బయటికి రాకూడదని, చిన్నారులు, వయోవృద్దులు ఇంటికే పరిమితం కావాలని, ప్రతిరోజు సరిపడ త్రాగునీరు తీసుకోవాలని, వదులుగా ఉన్న దుస్తువులను ధరించాలని, బయటికి వెళ్ళేటప్పుడు గొడుగు, టోపిని, సన్నని లేత రంగు కాటన్ వస్త్రాలను దరించాలని, ద్విచక్ర వాహనాలపై సుదూర ప్రయాణాలు చేయకూడదని, సూర్యుని కిరణాలు శరీరంపై నేరుగా పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అలాగే ఎండలో పనిచేసే కార్మికులు తరచుగా నీటితో పాటు ఓ.ఆర్.ఎస్. ద్రావణాన్ని తీసుకోవాలని తద్వారా వడదెబ్బ నుండి శరీరాన్ని కాపాడుకోవచ్చున్నారు.అధిక మాంసకృత్తులు కలిగిన ఆహారాన్ని , నిల్వ ఆహారాన్ని తినవద్దని, నిలిపి ఉంచిన వాహనంలో పిల్లలను లేదా పెంపుడు జంతువులను వదిలివేయవద్దని, వాహనం లోపల ఉష్ణోగ్రత పెరిగి ప్రమాదకరంగా మారవచ్చని అన్నారు.అధిక చమట, దాహం, బలహీనత, తల తిప్పడం, కండరాలు పట్టేయడం వంటి లక్షణాలు వున్నచో వడదెబ్బగా భావించి సమీప ఆరోగ్య కేంద్రం తీసుకెళ్లాలని, అవసరమైన జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## మాదక ద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి

డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలపై విస్తృత అవగాహన కల్పించాలి

మాదక ద్రవ్యాల రవాణా, వినియోగం నివారణకు సమన్వయంతో పనిచేయాలి

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



పెద్దపల్లి స్టాఫ్ రిపోర్టర్ , మే-23, నేటిశుభోదయ :జిల్లాలో మాదక ద్రవ్యాలు, డ్రగ్స్ నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.శనివారం ఐడిఓసీ కార్యాలయంలో మాదక ద్రవ్యాల నియంత్రణ కోసం చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల యువత భవిష్యత్తు దెబ్బతింటుందని, ఆరోగ్యంతో పాటు ఆలోచనా శక్తి కూడా దెబ్బతింటుందని అన్నారు. భావితరాలు డ్రగ్స్, మత్తు పదార్థాల పట్ల ఆకర్షితులు కాకుండా వారికి మంచి, చెడు పై సరైన అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలోని రెసిడెన్షియల్ విద్యాసంస్థలు, ప్రభుత్వ ప్రైవేట్ హాస్టళ్లలో విద్యార్థుల అలవాట్లను పర్యవేక్షించాలని, విద్యాసంస్థల పరిసర ప్రాంతాల్లో డ్రగ్స్, మాదకద్రవ్యాల సరఫరా జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.డ్రగ్స్ వల్ల కలిగే విపరీత పరిణామాలపై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు, వాటి నియంత్రణకు పోలీస్, ఎక్సైజ్, విద్య, వైద్య, రెవెన్యూ, అటవీ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ తెలిపారు. మాదక ద్రవ్యాల రవాణా, సాగు, విక్రయాలు, వినియోగం నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.మాదక ద్రవ్యాలకు బానిసైన వారిని గుర్తించి అవసరమైన చికిత్స, కౌన్సిలింగ్ అందించేలా చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్య శాఖ అధికారులకు సూచించారు. అటవీ ప్రాంతాల్లో గంజాయి సాగు కనిపిస్తే వెంటనే పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిసిపి రామ్ రెడ్డి,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. ప్రమోద్ కుమార్,ఏసీపీ లు కృష్ణ,రమేష్, కలెక్టరేట్ పర్యవేక్షకులు కుమారస్వామి,సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆడెపు ప్రశాంత్ కు సీఎం సహాయనిధి 1లక్ష 75 వేల రూ ఎల్ ఓసి పత్రం అందజేసిన

ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో

-సీఎం సహాయనిధి పేద ప్రజల వైద్యానికి వరంలాంటిది కాంగ్రెస్ పార్టీ ఆరుట్ల గ్రామశాఖ అధ్యక్షుడు నూకం బాలరాజ్ ముదిరాజ్




ఇబ్రహీంపట్నం (నేటి శుభోదయ) ప్రతినిధి మే 23:మంచాల మండలం ఆరుట్ల గ్రామానికి చెందిన ఆడెపు ప్రశాంత్ తండ్రి బాలకృష్ణ అనారోగ్యంతో నగరంలో నిమ్స్ హాస్పిటల్లో వైద్యం చేయించుకుంటున్నాడు వైద్యానికి సరిపడా డబ్బులు లేక ఇ బ్బందులు పడుతూ ఆడెపు బాలకృష్ణ కాంగ్రెస్ పార్టీ నాయకుడు మానిపాటి వెంకటేష్ దృష్టికి తీ సుకురావడంతో వెంటనే గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇబ్రహీంపట్నంఎమ్మెల్యే మల్ రెడ్డి రంగా రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సీఎం సహాయనిధి కింద 1లక్ష 75 వేల రూపాయలు ఎల్ ఓ సి ఇవ్వడంతో ఆరుట్ల కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు నూకం బాలరాజ్ ముదిరా జ్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు మానిపాటి వెంకటేష్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే సహకారంతో మంజూరైన డబ్బుల ఎల్ ఓసి పత్రాన్ని ఆడెపుప్రశాంత్ తండ్రి బాలకృష్ణ కు అందజే శారు సందర్భంగా గ్రామశాఖ అధ్యక్షుడు నూకంబాలరాజ్ ముదిరాజ్ మాట్లాడుతూ సీఎం సహా యనిది డబ్బులు వైద్యం చేయించుకోలేని పేద ప్రజలకువరం లాంటిది అనిఅన్నారు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు పేద ప్రజలకు అండగా ఉంటుంది గ్రామంలో ప్రజలకు ఎలాంటి అనారోగ్యానికి గురైన సీఎం సహాయనిధి ఆరోగ్యశ్రీ పథకాలు అండగా ఉంటాయి వైద్యం చేయించుకోలేని స్థితిలో ఉన్న పేద ప్రజలు ఈపథకాలను సద్వినియోగం చేసుకోవాలి అనిఅన్నారు అని అన్నారు ఈకార్య క్ర మంలో కాంగ్రెస్ పార్టీ మంచాల మండలం నాయకుడు రావులభాష నాయకులు వైయస్సార్ మాధగోని జంగయ్యగౌడ్ మార సురేష్ దాసరమోని అశోక్ ముదిరాజ్ ఆరుట్ల గ్రామయూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఆడెపు మధు కా సుల యాదయ్య జక్కుల యాదగిరి ముదిరాజ్ మాడపాకుల క్రిష్ణ,మణిపాటి బుగ్గరాములు శివ శంకర్ పూజారి ప్రభాకర్ ముదిరాజ్ ఆడెపు బాలకృష్ణ కాసుల బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## పర్యాటక రంగ అభివృద్ధికి యువత భాగస్వామ్యం కీలకం

: జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

- పర్యాటక ప్రాంతాలపై ప్రజల్లో అవగాహన పెంపు లక్ష్యం

- పర్యాటక వారోత్సవాల్లో భాగంగా టూరిజం కిట్ ప్రారంభం

- పర్యాటక రంగంపై ఆసక్తి పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు




ఖమ్మం, నేటి శుభోదయ ::: పర్యాటక రంగ అభివృద్ధికి యువత భాగస్వామ్యం ఎంతో కీలకమని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు.ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న పర్యాటక వారోత్సవాల సందర్భంగా శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో టూరిజం కిట్ ప్రారంభ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ తో కలిసి పాల్గొన్ని టూరిజం కిట్‌ను విడుదల చేసి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో సహజసిద్ధమైన పర్యాటక ప్రాంతాలను ప్రజలకు మరింత చేరువ చేయడానికి పర్యాటక వారోత్సవాలు దోహద పడతాయని అన్నారు. యువతలో పర్యాటక రంగంపై ఆసక్తి పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని, పర్యాటక రంగం ద్వారా ఉపాధి అవకాశాలు కూడా విస్తరిస్తాయని పేర్కొన్నారు.జిల్లాలోని పర్యాటక ప్రాంతాలపై ప్రజల్లో అవగాహన పెంపుతో పాటు పర్యాటక రంగ అభివృద్ధే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. జిల్లాలోని పర్యాటక ప్రదేశాలను ప్రోత్సహించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డీవైఎస్‌ఓ టి. సునీల్ రెడ్డి, తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏఈ నరేష్ నాయక్, ఖమ్మం టూరిజం సిబ్బంది జె. చంద్రశేఖర్ ఆజాద్, యువత, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు

ప్రత్యేక చిత్రపటాన్ని అందజేసిన పీసరి మహిపాల్ రెడ్డి




శామీర్ పేట , మే 23:ప్రజల అభివృద్ధినే లక్ష్యంగా తీసుకుని ముందుకు సాగే దూరదృష్టి గల నాయకుడిగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రజల గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు.శనివారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రత్యేక చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.ఈ సందర్భంగా పీసరి మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాసేవ, అభివృద్ధి, నిబద్ధతతో ముందుకు సాగే నాయకత్వం కోమటిరెడ్డి వెంకటరెడ్డిదని కొనియాడారు. రాష్ట్ర అభివృద్ధిలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండే నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు.మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కూడా శుభాకాంక్షలు తెలిపిన పీసరి మహిపాల్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## నాంపల్లి భార్గహ ఇ యూసుఫ్ ఫైన్ దర్గాను దర్శించుకున్న హాజీ బాబా

మహేశ్వరం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ మండల అధ్యక్షులు

కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి షేక్ హాజీ బాబా





( నేటి శుభోదయ మహేశ్వరం మే 23:)రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం గ్రామానికి చెందిన మహేశ్వరం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ మండల అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి షేక్ హాజీ బాబా హైదరాబాద్ నగరంలో ప్రసిద్ధిగాంచిన అతి పవిత్రమైన దర్గా హజరత్ సయ్యదిన యూసఫ్ బాబా రహమతుల్లా అలై మరియు షరీఫ్ బాబా రహమతుల్లా అలై దర్గా 326 వ ఉరిష షరీఫ్ గ్రంధోత్సవం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి తెలంగాణ రాష్ట్ర ప్రజలు అందరూ సంతోషంగా ఉండాలని ప్రజలు రైతులు ప్రతి ఒక్కరు ఆయురారోగ్యాలతో పిల్లాపాపలతో సిరిసంపదలతో సుఖంగా ఉండాలని సకాలంలో వర్షాలు కురిసే పంటలు బాగా పండాలని తెలంగాణ రాష్ట్ర మరింత అభివృద్ధి చెందాలని దర్గాలో కోరుకున్నామన్నారు

## బిఆర్ఎస్ పార్టీ నుండి 20 మంది టిఆర్ఎస్ పార్టీలో చేరిక

తెలంగాణ జాగృతి

బి సి విభాగం జిల్లా అధ్యక్షులు కుమ్మరి శివ శంకర్.



( నేటి శుభోదయ మహేశ్వరం మే 23:) తెలంగాణ రక్షణ సేన బేగరి రాజు ఎండి అన్వర్ ఖాన్,షేక్ మహమ్మద్ నూర్ భాయ్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు....సామాజిక తెలంగాణ మా లక్ష్యం తెలంగాణ రక్షణ సేన పార్టీ రాష్ట్రంలో ప్రత్యేక రాజకీయ శక్తిగా పెరిగిపోతుందని తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితమ్మ నాయకత్వంలో రాష్ట్రంలో విద్యార్థులు ఆర్థిక పరిస్థితులు బాగోలేక చదువులను మధ్యలో ఆపివేస్తున్నారని టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పూర్తి విద్య ప్రభుత్వమే భరిస్తుందని అన్నారు, బడుగు బలహీనవర్గాల పేద ప్రజల ఆరోగ్యం క్షీణిస్తే ప్రైవేటు ఆసుపత్రిలో డబ్బులు కట్టలేక విలువైన ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయని అలాంటి పరిస్థితి ఈ రాష్ట్రంలో రాకూడదని ప్రతి పేదవాడికి వైద్యం ఉచితంగా ఇవ్వాలని సంకల్పంతో ఏర్పడ్డ తెలంగాణ సామాజిక తెలంగాణ రక్షణ సేన పార్టీ ఎజెండాను చూసి ఆకర్షితులై టిఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని వారు అన్నారు ఈ సందర్భంగా శనివారం నాడు మండల పరిధిలో ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు అనంతరం వివిధ గ్రామాల నుండి నజీబ్ నగర్ గ్రామం బిఆర్ఎస్ నాగారం కృష్ణ యాదవ్, కాశీంభౌలి గ్రామం,బిజెపి సామ సాయి వర్ధన్ రెడ్డి, సజ్జన్ పల్లి గ్రామం బిఆర్ఎస్ కత్తుల నరేందర్, సరుపు కృష్ణ, ఎనికె పల్లి బిఆర్ఎస్.ఎస్ అమర్ యాదవ్, పెండ్యాల గోపాల్, మొయినాబాద్ మున్సిపాలిటీ ఎండి పాషా, శ్రీరాశీ నగర్ గ్రామం కాంగ్రెస్ పార్టీ దొడ్డి సాయి కుమార్ యాదవ్, ఎండి ఖాన్ సాబ్, ఎండి గౌస్, ఎండి అలీమ్, ఎండి జోహార్, షేక్ లతీఫ్, షేక్ అలీ, షేక్ అమిత్, షేక్ షరీఫ్, ఎండి ఐబ్ ఖాన్, ఎండి షఫీ ఎండి రఫీక్ ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల నాయకులు చాకలి విక్రమ్, బొక్క సురేందర్ రెడ్డి, మలని రాజు ఏనుగుల సంజీవరెడ్డి, గాండ్ల సంతోష్, ఎండి ఇనాయత్,యండి ఏయా, శ్రీకాంత్,తదితరులు పాల్గొన్నారు

## ఏళ్లుగా ఒకేచోటే.. బదిలీల్లో పారదర్శకత ఎక్కడ

కలెక్టరేట్ మారినా.. ఆడిట్ కార్యాలయం మాత్రం ఆబిడ్స్‌లోనే



( నేటి శుభోదయ మహేశ్వరం మే 23:)ప్రభుత్వం నాలుగేళ్లు పూర్తి చేసిన ఉద్యోగులను తప్పనిసరిగా బదిలీ చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో ఆడిట్ విభాగంలో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పారదర్శకత కోసం ఆన్లైన్ కౌన్సెలింగ్, ఆప్షన్లు ఇచ్చినప్పటికీ, అమలులో అనేక లోపాలు బయటపడుతున్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాలను చార్మినార్ జోన్‌లో కలిపి చూపించడం వివాదాస్పదంగా మారింది.ముఖ్యంగా రంగారెడ్డి జిల్లాను ప్రత్యేక యూనిట్‌గా చూపకపోవడంపై ఉద్యోగుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.67 పోస్టులకు గాను 61 మంది పనిచేస్తుండగా,కొంతమంది ఉద్యోగులు ఏడు నుంచి తొమ్మిదేళ్లుగా ఒకేచోటే కొనసాగుతున్నారు.బదిలీలు తప్పనిసరి అయినప్పటికీ, రాజకీయ మరియు ఆర్థిక ప్రభావంతో కొందరు ఉద్యోగులు తమ స్థానాలను వదలకుండా కొనసాగుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఇతర జిల్లాల నుంచి బదిలీపై వచ్చిన ఉద్యోగులకు సరైన ఆప్షన్లు లేకపోవడం వల్ల,వారికి ముఖ్యమైన పోస్టులు కాకుండా లూప్‌లైన్ పోస్టులు కేటాయిస్తున్నట్లు సమాచారం.దీంతో న్యాయం జరగడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఇక కలెక్టరేట్ ఖైరతాబాద్ నుంచి కొంగరకు మారినప్పటికీ,జిల్లా ఆడిట్ కార్యాలయం మాత్రం ఆబిడ్స్‌లోనే కొనసాగుతోంది.ఇది పరిపాలనా పారదర్శకతపై సందేహాలు రేకెత్తిస్తోంది.కార్యాలయంలో పని చేస్తున్న తొమ్మిది మందిలో ముగ్గురు ఆడిటర్లు తొమ్మిదేళ్లుగా ఒకేచోటే కొనసాగుతుండటం గమనార్హం.గ్రామపంచాయతీలు,మున్సిపాలిటీలు, ప్రభుత్వ శాఖల్లో ఆడిట్ తనిఖీలు సరిగా జరగడం లేదని, కేవలం నామమాత్రపు పరిశీలనలతో నివేదికలు పంపుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. అంతేకాదు, కొంతమంది ఆడిటర్లు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. మొత్తంగా, బదిలీ విధానం పారదర్శకంగా అమలు కాకపోవడం, ప్రభావశక్తుల జోక్యం పెరగడం వల్ల నిజాయితీగా పనిచేసే ఉద్యోగులు నష్టపోతుండగా, వ్యవస్థపై విశ్వాసం దెబ్బతింటోంది.

### రాజకీయ అండతో ఏళ్లుగా ఒకేచోటే ఉద్యోగులు

రాజకీయ నాయకుల సహకారంతో కొంతమంది జిల్లా ఉద్యోగులు ఏళ్లుగా ఒకేచోటే కొనసాగుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం బదిలీలపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసినప్పటికీ, అమలులో పారదర్శకత లోపిస్తున్నట్లు తెలుస్తోంది.ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఉద్యోగులకు సరైన అవకాశాలు లేకపోవడంతో అసంతృప్తి పెరుగుతోంది. ఈ పరిస్థితులపై అధికారులు దృష్టి సారించి, బదిలీలను నిష్పక్షపాతంగా అమలు చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

## అట్టేపల్లి రామప్రభు ఆధ్వర్యంలో నాలుగో శనివారం అన్నదాన కార్యక్రమం..



శేరిలింగంపల్లి నేటి శుభోదయ .. :అట్టేపల్లి లక్ష్మీనారాయణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అట్టేపల్లి రామప్రభు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వారాంత అన్నదాన కార్యక్రమంలో భాగంగా 4వ శనివారం అన్నదాన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది.ఈ సందర్భంగా అవసరమైన వారికి ప్రేమతో, సేవాభావంతో అన్నదానం అందజేయడం జరిగింది. కార్యక్రమంలో ఏ ఆర్ పి టీమ్ సభ్యులు, ట్రస్ట్ ప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అట్టేపల్లి రామప్రభు మాట్లాడుతూ, సమాజ సేవలో భాగంగా భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ట్రస్ట్ తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.


## 2026 పాలిసెట్ ఫలితాలలో త్రివేణి విద్యార్థులకు స్టేట్ ర్యాంకులు



ఖమ్మం, నేటి శుభోదయ ::: ఇటీవల విడుదలైన తెలంగాణ పాలీసెట్ ఫలితాల్లో ఖమ్మం నగరానికి చెందిన త్రివేణి పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ విజయకేతనం ఎగుర వేశారని పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి తెలియజేస్తూ విజేతలకు అభినందనలు తెలియజేశారు.వీరిలో సాయి దీక్షిత్ 120మార్కులకు గాను 118మార్కులతో రాష్ట్రస్థాయి 35వ ర్యాంక్,114 మార్కులతో గోపాలకృష్ణ 116 వ ర్యాంక్ ,హేమంత్ పవన్ కుమార్ 111 మార్కులతో 282వ ర్యాంక్, హరిచందన 110 మార్కులతో334 ర్యాంక్, రోహిత్ కృష్ణ 113మార్కులతో 441 ర్యాంక్ , హర్షవర్ధన్ 105 మార్కులతో 779 వ ర్యాంక్, ధీరజ్ 110 మార్కులతో 843వ ర్యాంక్ ,సాధించారు. ఈ ఫలితాలలో 100 పైన మార్కులు సాధించిన విద్యార్థుల 8 మంది, 90 పైన మార్కులు సాధించిన విద్యార్థులు 16 మంది 5000 లోపు ర్యాంకులు సాధించిన విద్యార్థులు 20 మంది ఉన్నారని తెలియజేశారు. పాఠశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ త్రివేణి విద్యార్థులు అన్ని పోటీ పరీక్షల్లో అత్యున్నత ఫలితాలను సాధించగలిగెలా తీర్చిదిద్దుతామని తెలిపారు. అదేవిధంగా పాలిసెట్ లో ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులకు స్వీట్స్ తినిపించి పుష్ప గుచ్చం ఇచ్చి సత్కరించి అభినందించారు.ఈ కార్యక్రమంలో కృష్ణవేణి త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, పాఠశాల సి ఆర్ ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, పాఠశాల వైస్ ప్రిన్సిపల్ స్వప్న, ముస్తఫా, క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్, ట్రాన్స్పోర్ట్ ఇంచార్జ్ సందీప్, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొని విజేతలను అభినందించారు.

## ప్రజా సేవే లక్ష్యం -- పార్టీ బలోపేతమే ధ్యేయం

### బిమండల అధ్యక్షుడిగా అనుమగల్ల రమేష్ నియామకం



కేశంపేట, నేటి శుభోదయ:కేశంపేట మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా అనుమగల్ల రమేష్ ఎంఎ, ఎల్ఎల్.బి నూతనంగా ఎంపిక కావడం పార్టీ శ్రేణుల్లో ఆనందాన్ని నింపింది. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిసిసి) అధ్యక్షులు చల్లా నరసింహ రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నూతన అధ్యక్షుడికి నియామక పత్రాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.“ప్రజా సేవే లక్ష్యం -- పార్టీ బలోపేతమే ధ్యేయం” అనే నినాదంతో ముందుకు సాగుతున్న అనుమగల్ల రమేష్ నాయకత్వంలో కేశంపేట మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యకర్తలకు అండగా నిలుస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాజు నాయక్, వివిధ మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు, ఎఎంసి వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, ఎఎంసి డైరెక్టర్ కరుణాకర్, శ్రీధర్ రెడ్డి, సురేష్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి వేముల నర్వ మల్లేష్, వట్టెల లింగం, చింతకుంటపల్లి మల్లేష్, మాజీ సర్పంచ్ కృష్ణయ్య యాదవ్, కోడూరు రాములు,తైద పర్వతాలు,ప్రకాష్, సచిన్, కిసాన్, అకిల్, బాలోజి తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని నూతన అధ్యక్షుడిని ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.

## చెక్ పోస్టుల వద్ద నిఘా కట్టుదిట్టం

### - అక్రమ రవాణా జరగకుండా పూర్తిస్థాయిలో కట్టడి - పోలీస్ కమిషనర్ సునీల్ దత్

ఖమ్మం, నేటి శుభోదయ ::: అక్రమ రవాణా జరగకుండా పూర్తిస్థాయిలో కట్టడి చేయడానికి చెక్ పోస్టుల వద్ద నిఘా కట్టుదిట్టం చేయాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. శనివారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో కల్లూరు డివిజన్ పోలీస్ అధికారులతో



పోలీస్ కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. సరిహద్దు నుండి ఇసుక అక్రమంగా రవాణా చేసే వాహనాలపై (ట్రాక్టర్లు, టిప్పర్లు) చట్టపరమైన కేసులు నమోదు చేసి సీజ్ చేయాలన్నారు. గంజాయి రవాణాను అడ్డుకోవడానికి స్థానిక పోలీసులతో పాటు టాస్క్‌ఫోర్స్ బృందాలు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. అదేవిదంగా రేషన్ బియ్యం అక్రమంగా ఇతర రాష్ట్రాలకు లేదా మిల్లులకు తరలకుండా గోదాములు, వాహనాలపై నిఘా పెంచి, కఠినమైన కేసులు నమోదు చేయాలన్నారు. అక్రమ రవాణాకు పాల్పడే వారిపై నాన్-బైలబుల్ కేసులు పీడీ యాక్ట్ అమలు చేయాలన్నారు.పండుగల సమయంలో చట్టవిరుద్ధంగా పశువుల రవాణా, వధింపులు జరగకుండా జిల్లా సరిహద్దుల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల వద్ద వాహనాల విస్తృత తనిఖీలు చేయన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించడం, సమాచారం ఇచ్చే వారి వివరాలను గోప్యంగా ఉంచడం చాల కీలకమన్నారు.సమావేశంలో ఏసీపీ వసుంధర యాదవ్, ఏసీపీ సాంబరాజు, ఇన్స్పెక్టర్ శ్రీహరి, ముత్తులింగం, సర్వయ్య, ఎస్సై లు పాల్గొన్నారు.

# యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఫ్రీ మెగా మెడికల్ క్యాంపు..

### మమతా అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ హాస్పిటల్, బిగ్ టీవీ సహకారంతో నిర్వహణ..



శేరిలింగంపల్లి నేటి శుభోదయ .. :మియాపూర్ డివిజన్ పరిధిలోని బీకేఎంక్లేవ్ కమ్యూనిటీ హాల్ ,బీకే ఎంక్లేవ్ కాలనీ నందు మమతా అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత మెగా మెడికల్ క్యాంపును నిర్వహించారు.ఈ మెడికల్ క్యాంపుకు ముఖ్య అతిథులుగా వి.జగదీశ్వర్ గౌడ్ శేరిలింగంపల్లి అసెంబ్లీ కాంగ్రెస్ ఇంచార్జ్, టిపి సి సి జనరల్ సెక్రటరీ,మారబోయిన రఘునాథ్ యాదవ్ తెలంగాణ రాష్ట్ర యాదవ సంఘం కార్పొరేషన్ చైర్మన్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..యలమంచి ఉదయ్ కిరణ్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు గా మియాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ గా సేవలందిస్తూ సామాజిక సేవ పట్ల నిబద్ధతతో, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాలనే సంకల్పంతో పనిచేస్తు ప్రజల మన్ననలు అందుకుంటున్న మియాపూర్ కి చెందిన యువ నాయకుడు యలమంచి ఉదయ్ కిరణ్ ,అనేక ప్రతిష్టాత్మక జాతీయ గౌరవాలను అందుకుని తెలంగాణకు, మియాపూర్ ప్రాంతంకు గర్వకారణంగా నిలిచారు.సేవా ప్రస్థానంలో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజల మన్ననలు పొందారు అని తెలిపారు. సమ్మర్ కూలింగ్ స్టేషన్లు ప్రతీ వేసవిలో విశ్రాంతి కేంద్రాలు, అనుబంధ గ్రామాలలో ఉచిత వైద్య శిబిరాలు -- వెనుకబడిన ప్రాంతాలకు వైద్య సేవలుయలమంచి ఉదయ్ కిరణ్ ఛారిటబుల్ ట్రస్ట్ సేవా కార్యక్రమాలు ప్రజల హృదయాలను తాకుతూ, మియాపూర్ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రజల మద్దతును పొందుతున్నాయి. అటు రాజకీయ రంగంలో కూడా అందరూ మన్ననలు పొందుతూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. గొప్ప పరిణామం అని,ఇంతటి గొప్ప కార్యక్రమం చేపట్టడం చాలా ఆనందంగా ఉందని నిర్వాహకులను అభినందించారు. యలమంచి ఉదయ్ కిరణ్ తన టీం సభ్యులు వారి సేవలను ఇంకా విస్తృత పరిచి మంచి పేరు తెచ్చుకోవాలి అని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. ఎంతో మంది వ్యాధిని గుర్తించలేక వైద్యానికి దూరమవుతూ అనేక రోగాల బారిన పడుతున్నారని,రోగికి వచ్చిన వ్యాధిని గుర్తించలేక హాస్పిటల్‌కి వెళ్లే స్థోమత లేక దుర్భరమైన జీవితం గడుపుతూ ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని అలాంటి వారి కోసం యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ ముందుకు వచ్చి ఇంతటి గొప్ప కార్యక్రమాన్ని నిర్వహించడం చాలా గొప్ప విషయం అని,నిర్వాహకులను,వైద్యులను అభినందించారు..అనంతరం యలమంచి ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ మియాపూర్ డివిజన్ లో వివిధ రకములైన సేవా కార్యక్రమాలకి నాకు సహకరించి ప్రోత్సహిస్తున్న ముఖ్య అతిథులుగా విచ్చేసిన వారికి మా టీం తరుపున వారికి హృదయ పూర్వక కృతజ్ఞతలు అని ఈ సందర్భంగా తెలిపారు. అలాగే “ఈ మెగా మెడికల్ క్యాంప్ ద్వారా అనేక మంది కి అవసరమైన వైద్య సహాయం అందించడంలో మా ప్రయత్నం విజయం సాధించింది. మియాపూర్ డివిజన్‌లోని ప్రజల సంక్షేమం కోసం సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తాము” అని తెలిపారు.అలాగే, మమతా అకాడమీ ఆఫ్ మెడికల్ హాస్పిటల్, యాజమాన్యానికి ఉచిత రవాణా మరియు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, ప్రజల ఆరోగ్యమేలుకు, మెరుగైన ఆరోగ్య పరిష్కారాలను అందించేందుకు చేసిన గొప్ప ప్రోత్సాహక చర్యలకు సహకారం అందిస్తున్న బిగ్ టీవీ మేనేజ్మెంట్ కూడా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా బీకే ఎంక్లేవ్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేసారు. సుమారుగా 300 లమంది పైగ వివిధ ఆరోగ్య పరీక్షలు ఈ క్యాంపులో చేయించుకున్నారు.ఈ కార్యక్రమంలో వైభవ్,రావిపాటి వెంకటేశ్వర్లు (అధ్యక్షులు), ధనుంజయ (జనరల్ సెక్రటరీ), విజయ భాస్కర్,నరేందర్ రెడ్డి,ప్రతాప్ రెడ్డి,పద్మ ,సాయి కృష్ణ,మోహన్ రెడ్డి,ఎంసీ రెడ్డి,కృష్ణ,షా , కేవీరావు,మన్నేపల్లి సాంబశివరావు, అట్టేపల్లి రాంప్రభు,రవీందర్ రెడ్డి,మిర్యాల ప్రీతం,కుమార్, రాంచందర్, రవి,శ్రీనివాస్ ముదిరాజ్, సత్య రెడ్డి,కృష్ణ గౌడ్, శేఖర్ ముదిరాజ్, సింధూర, నవ్యశ్రీ, భాగ్య లక్ష్మి,శ్రీదేవి, జయ, నాజియా, విజయ, వెంకటేశ్వర్లు, బాబ్జీ, గోపాలకృష్ణ, ఎస్సీఆర్సీమూర్తి, శ్రీనివాసులు, సత్యనారాయణ, రాజేష్ ,మనీ, కార్తీక్, దినేష్ గౌడ్, గిరి, మహేందర్, లక్ష్మణ్ రావు, ,నరేందర్, శ్రీనివాస్, చక్రపాణి, రాజేశ్వరి, సిహెచ్ సాంబయ్య , బాల మురళి, నవీన్,సాయి కృష్ణ, సాధన, సత్య రెడ్డి, తాండ్ర రామచంద్ర గౌడ్, వెంకటేష్, శివ ముదిరాజ్ ప్రవీణ్, నాగ సాయి, నరేష్, వినోద్, వంశీ చౌదరి, వాసు కామినేని, సాయి నిఖిల్, రత్న చారి, నాగ సాయి బొబ్బ, మధు, శరత్, రాధా కృష్ణ, శివ ప్రసాద్, సర్దార్, నరేష్, కర్రి నాని,అశోక్ , నరేష్, దినేష్ గౌడ్, కార్తీక్,శ్రీను , రవి, వెంకటేష్, నరేష్, ఇరాన్ జగన్ రామస్వామి, కిరణ్, బండి రామకృష్ణ, సురేష్, నరేష్, సంజయ్, ధన్రాజ్, ప్రశాంత్, సల్మాన్, ఆసిఫ్, కరీం, మణిక్, శేఖర్, ప్రసాద్, రఘు, సత్యనారాయణ, వలభనేని నరసింహరావు, ప్రకాష్, సత్య, శేషగిరిరావు, అనేకమంది ప్రముఖులు పాల్గొన్నారు.



## మద్యం సేవించి వాహనం నడపుతూ పట్టుబడిన వాహనదారులకు శిక్ష, జరిమానా విధించిన న్యాయస్థానం




ఖమ్మం, నేటి శుభోదయ ::: మద్యం మత్తులో వాహనం నడుపుతున్న వారిలో ఒకరికి ఏడు రోజుల శిక్ష, 11 మందికి 10,100/- మరొకరికి 20,100/- రూపాయలు జరిమానా విధిస్తూ నాలుగవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి బి.నాగలక్ష్మి తీర్పు చెప్పారు. జైలు శిక్ష పడిన వ్యక్తిని ఖమ్మం జైలు కి తరలించడం జరిగిందని ట్రాఫిక్ సీఐ బెల్లం సత్యనారాయణ తెలిపారు. ట్రాఫిక్ కోర్ట్ కానిస్టేబుల్ సతీష్ ను ఇన్స్పెక్టర్ అభినందించారు.మద్యం మత్తులో వాహనాలు నడిపితే తమతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు ఏర్పడుతుందన్నారు. భవిష్యత్తులో కూడా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఖమ్మం ట్రాఫిక్ పోలీసులు స్పష్టం చేశారు. ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించి రహదారి భద్రతకు సహకరించాలని పోలీసులు కోరారు.

## బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం క్రింద ప్రతిపాదనలు ఆహ్వానం

### : గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయలక్ష్మి

- గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య, సమాన సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం
- మే 30 సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తులు సమర్పించాలి- బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం క్రింద ప్రైవేట్ పాఠశాలల నుండి దరఖాస్తులు ఆహ్వానం

ఖమ్మం, నేటి శుభోదయ ::: 3వ తరగతి నుండి 8వ తరగతిలో గిరిజన బాలురు, బాలికలను చేర్చుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వ బెస్ట్ అవైలబుల్ స్కూల్ (బిఏఎస్) పథకం క్రింద 2026-27 విద్యా సంవత్సరానికి ఖమ్మం జిల్లాలోని ప్రసిద్ధ ఇంగ్లీష్ మీడియం ప్రైవేట్ హై స్కూళ్ల నుండి ప్రతిపాదనలు ఆహ్వానిస్తున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎన్. విజయలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం క్రింద ఎంపికకు దరఖాస్తు చేసుకునే పాఠశాలలు మంచి ప్రతిష్ట కలిగి ఉండటంతో పాటు సహపాఠ్య, పాఠ్యేతర కార్యక్రమాలలో జిల్లా/రాష్ట్ర స్థాయి విజయాలు సాధించి, నాణ్యమైన విద్య అందిస్తున్న గుర్తింపు కలిగి ఉండాలని తెలిపారు. గత ఐదేళ్లుగా నిరంతరంగా 7వ, 10వ తరగతి పరీక్షల్లో 90 శాతం కంటే ఎక్కువ ఉత్తీర్ణతతో పాటు కనీసం 50 శాతం ఫస్ట్ క్లాస్ ఫలితాలు నమోదు చేసి ఉండాలని పేర్కొన్నారు. పాఠశాలలో తరగతి గదులు, డార్మిటరీలు, హాస్టళ్లు, ఇండోర్, అవుట్‌డోర్ క్రీడా సదుపాయాలు, ప్రయోగశాలలు, లైబ్రరీ, ఫర్నిచర్, ఆటస్థలాలు తదితర తగిన మౌలిక సదుపాయాలు ఉండాలని తెలిపారు. పాఠశాల, హాస్టల్ భవనాలకు ధృవీకరించిన భవన ప్రణాళిక (సర్టిఫైడ్ ప్లాన్) తప్పని సరిగా ఉండాలని పేర్కొన్నారు.విద్యార్థులకు సరైన వైద్య సేవలు అందించేందుకు తగిన వైద్య సదుపాయాలు కలిగి ఉండాలని తెలిపారు. తరగతి గదులు, హాస్టల్ భవనాలు అనుబంధ సదుపాయాలన్నీ ఆర్‌సీసీ పైకప్పుతో, మంచి ఫ్లోరింగ్, తగిన గాలి వెలుతురు కలిగి ఉండాలని,విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తగిన స్థలం ఉండాలని చెప్పారు. విద్యాశాఖ/సీబీఎస్ఈ నిర్దేశించిన నమూనా ప్రకారం తగిన సంఖ్యలో అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఉండాలని తెలిపారు. కనీసం 50 శాతం బోధనా సిబ్బంది మూడు సంవత్సరాలకు పైగా అదే విద్యాసంస్థలో పనిచేస్తున్న శాశ్వత ఉద్యోగులుగా ఉండాలని పేర్కొన్నారు. పాఠశాలకు సంబంధిత అధికారుల నుండి తాజా గుర్తింపు అనుబంధం తప్పనిసరిగా ఉండాలని, బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకానికి ఎంపిక పరిగణనలోకి రావడానికి కనీసం ఐదేళ్లుగా గుర్తింపు పొందిన పాఠశాలగా కొనసాగి ఉండాలని తెలిపారు. గిరిజన విద్యార్థులకు వసతి, భోజనం ఇతర సదుపాయాలు పాఠశాలలోని ఇతర విద్యార్థులకు కల్పించే విధంగానే సమానంగా అందించాలని, ఎటువంటి వివక్ష చూపరాదని స్పష్టం చేశారు. ప్రతి గిరిజన విద్యార్థికి సంవత్సరానికి 42 వేలు చొప్పున ప్రభుత్వ ఆమోదిత బడ్జెట్ మేరకు ఆన్‌లైన్ ద్వారా పాఠశాలకు చెల్లించబడుతుందని తెలిపారు. ఈ మొత్తంలో బోర్డింగ్, లాడ్జింగ్, ట్యూషన్ ఫీజులు, సహపాఠ్య కార్యక్రమాలు, యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, ఇతర రెసిడెన్షియల్ విద్యార్థులకు సాధారణంగా అందించే అన్ని సదుపాయాల వ్యయాలు ఉంటాయని పేర్కొన్నారు. ఎంపికైన పాఠశాలలకు గిరిజన విద్యార్థులను జిల్లా స్థాయి కమిటీ ద్వారా కేటాయించడం జరుగుతుందని తెలిపారు. పై అర్హతలు కలిగిన పాఠశాల యాజమాన్యాలు ఖమ్మం కలెక్టరేట్ లోని ఉప సంచాలకులు, గిరిజన సంక్షేమం శాఖ కార్యాలయంలో సంప్రదించి దరఖాస్తు ఫారాలను పొంది తిరిగి మే 30వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా సమర్పించాలని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎన్. విజయలక్ష్మి ఆ ప్రకటనలో తెలిపారు.

## మై భారత్ ఖమ్మం ఆధ్వర్యంలో వాణి ఐటిఐ కళాశాల నందు నేషనల్ టెక్నాలజీ డే




ఖమ్మం, నేటి శుభోదయ ::: మై భారత్ ఖమ్మం ఆధ్వర్యంలో జిల్లా యువ అధికారి మద్దుల వెంకట రాంబాబు మేరకు అకౌంట్స్ అండ్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కమర్తపు భానుచందర్ సహకారంతో శ్రీ సాయి గణేష యూత్ క్లబ్ ప్రెసిడెంట్ కడారి ఉష నేషనల్ టెక్నాలజీ డే ని ఖమ్మం నందు గల వాణి ఐటిఐ కళాశాల నందు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దరిపల్లి విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ డి కిరణ్ కుమార్, వాణి ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ డీ స్వాతి విచ్చేసి నేషనల్ టెక్నాలజీ డే గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యాసరచన పోటీ, క్విజ్ పోటీ నిర్వహించి అందులో పాల్గొన్న ప్రతి ఒక్కరికి మొదటి, ద్వితీయ బహుమతులను సర్టిఫికెట్ అందజేసి ర్యాలీని నిర్వహించారు. ఈ యొక్క కార్యక్రమమును చేయుటకు సహకరించినందుకుగాను కళాశాల వారికి మై భారత్ తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

## రాబందులను మింగేసిన “మానవ రాబందులు”

### - గోమాత భావోద్వేగాల వెనుక గోమాంస ఎగుమతి రాజకీయాలు : సయ్యద్ సాదిక్ అలీ



ఖమ్మం, నేటి శుభోదయ ::: గోరక్షణ రాజకీయాలు, గోమాంస ఎగుమతులపై రాజ్యాంగ పరిరక్షణ వేదిక జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాదిక్ అలీ తీవ్ర విమర్శలు చేశారు. గోవును పవిత్రంగా చూపిస్తూ మరోవైపు గోమాంసాన్ని విదేశాలకు ఎగుమతి చేస్తూ కోట్ల రూపాయల వ్యాపారం చేస్తున్నారు. ప్రకృతి కోసం ఉండాల్సిన కళేబరాలను మానవ రాబందులే మింగేస్తున్నాయి, అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.భారతీయ సనాతన సంప్రదాయాల్లో రాబందులకు, కాకులకు ప్రత్యేక స్థానం ఉందని ఆయన పేర్కొన్నారు. పిండప్రదాన సమయంలో కాకి పిండాన్ని ముట్టడం ఆత్మకు శాంతి లభించిందనే విశ్వాసానికి సంకేతమన్నారు. ఒకప్పుడు గ్రామాల్లో చనిపోయిన పశువులను రాబందులు తిని ప్రకృతి సమతుల్యతను కాపాడేవని తెలిపారు. జొరాస్ట్రియన్ (పార్సీ) సమాజం పాటించే “టవర్ ఆఫ్ సైలెన్స్” సంప్రదాయాన్ని ప్రస్తావిస్తూ, మృతదేహాలను కూడా ప్రకృతికి అర్పించే గొప్ప భావన భారతీయ నాగరికతలో ఉందన్నారు.రాబందుల అంతర్ధానం కేవలం మానవుల స్వార్థం వల్లనే జరిగిందని, ప్రకృతి సహజ ఆహార వ్యవస్థను వ్యాపార దాహం నాశనం చేసిందని సాదిక్ అలీ ఆరోపించారు. ఒకప్పుడు సహజంగా చనిపోయిన పశువుల కళేబరాలు రాబందులకు ఆహారమైతే, ఇప్పుడు భారీ పశువధశాలలు, గోమాంస ఎగుమతి మార్కెట్లు వాటిని డాలర్ల వ్యాపారంగా మార్చేశాయని విమర్శించారు. “రాబందులు తినాల్సింది ఇప్పుడు మనుషులే మింగేస్తున్నారు” అని ఘాటుగా వ్యాఖ్యానించారు.గోరక్షణ అంటే వీధుల్లో హింస కాదని, రైతును కాపాడటం, పశుసంపదను సంరక్షించడం, జీవ వైవిధ్యాన్ని నిలబెట్టడమే నిజమైన గోరక్షణ అని సాదిక్ అలీ స్పష్టం చేశారు. “పక్షి ముట్టితే పిండానికి శాంతి, రాబందు ముట్టితే పశువుకు గౌరవం, కానీ మానవ రాబందులు ప్రకృతి చక్రాన్నే మింగేస్తే సంస్కృతి ఎలా బతుకుతుంది?” అని ప్రశ్నించారు. రాబందులు




కనుమరుగు అవడంతో పార్సీలు తమ ఆచారాన్ని ఎలక్ట్రిక్ స్మశాన వాటికల వైపు తప్పక మార్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని సాదిక్ అలీ పేర్కొన్నారు. భారతదేశంలో గోవు కేవలం ఓటు రాజకీయాలకే బలైపోతుందని, భారతీయులు ఇప్పటికైనా మేల్కొని ఆవును జాతీయ జంతువుగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని ప్రతి ఒక్కరు ముక్తకంఠంతో డిమాండ్ చేయాలని, అప్పుడే నిజమైన గో ప్రేమికులవుతారని సాదిక్ అలీ పునరుద్ఘాటించారు.

## సి సి రోడ్డు, అండర్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్



షాద్నగర్ నియోజకవర్గం నేటి శుభోదయ ప్రతినిధి మే 23:రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపాలిటీ కోర్టు ఆవరణలో మున్సిపల్ సాధారణ నిధుల 15 లక్షల రూపాయలతో సి సి రోడ్డు, అండర్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గారు, ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి , మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబార్ అలీ ఖాన్, మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి,న్యాయవాదులు సబియా సుల్తానా, నర్వ వేణుగోపాలరావు పబ్బే శ్రీశైలం, గ్రంథాలయ కమిటీ చైర్మన్ మదన్ మోహన్ రెడ్డి, శ్రీనివాసమూర్తి, కౌన్సిలర్లు శ్రావణి ,మురళీమోహన్(అప్పి), పెంటయ్య, దిలీప్, బచ్చలి నరేష్, కొప్పునూరి ప్రవీణ్, పట్టణ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్, మహమ్మద్ ఇబ్రహీం, శ్రీనివాస్ యాదవ్,,సాదిక్, చందు లాల్,ముబారక్ అలీ ఖాన్ సయ్యద్ ఖదీర్, జయప్రకాష్, మంగ అశోక్, మంగ మధు, రవితేజ, మహబూబ్,తదితరులు పాల్గొన్నారు

# శంకరన్న అండతో శక్తివంతంగా పనిచేయండి

**ఆయన భారాన్ని మోస్తున్నారు.. ఆ భారాన్ని మీరు తగ్గించండి.. బిజెపి ఓట్ చోరీ కుట్రలను సమర్థవంతంగా అడ్డుకోండి.. గత అధ్యక్షుల పనితీరు వల్లనే కాంగ్రెస్ పార్టీ ఘన విజయం.. రంగారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షుడు నరసింహారెడ్డి.. నూతన అధ్యక్షులకు నియామక పత్రాలు అందజేత.. పాత అధ్యక్షులు ఆదర్శంగా పనిచేయండి.. షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపు**



షాద్నగర్ నియోజకవర్గం నేటి శుభోదయ ప్రతినిధి మే 23:శంకరన్న లాంటి అంకితభావం కలిగిన వ్యక్తి మీకు అండగా ఉన్నాడు.. ఆయన అండతో శక్తివంతంగా పని చేయండి.. కాంగ్రెస్ పార్టీ మరింత విస్తరించండి.. తెలంగాణలో ఓటు చోరీ ద్వారా కుట్రలకు కోరుకుంటున్నా బిజెపి ఆటలు సాగనివ్వకండి.. గత అధ్యక్షుల పనితీరుతో కాంగ్రెస్ గెలిచింది.. మీ పనితీరుతో కాంగ్రెస్ ను మరోసారి నిలబెట్టండి.. అని రంగారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షులు నరసింహారెడ్డి కోరారు. షాద్ నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన నియోజకవర్గ అధ్యక్షులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తో కలిసి ఆయన నియామక పత్రాలను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక విధి విధానం ప్రకారం ముందుకు వెళ్లే కాంగ్రెస్ పార్టీలో నాలుగేళ్లకు ఓసారి అధ్యక్షులను మార్చాలని నిర్ణయం జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ గారికి, రాహుల్ గాంధీని తీసుకున్నారని, ఆ ప్రకారమే రాష్ట్రంలో పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, వైసీసీ ఇన్చార్జ్ మీనాక్షి నటరాజ్ ఆధ్వర్యంలో నూతన అధ్యక్షుల ఎంపిక మున్సిపాలిటీలు, మండలాల వారీగా జరిగిందని వెల్లడించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ జిల్లా వ్యాప్తంగా ఎన్నో కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని పార్టీ ప్రతిష్టను పెంచేందుకు కృషి చేశారని ప్రశంసించారు. పార్టీ భారాన్ని మొత్తం మోసే శక్తి ఆయనకు ఉన్నప్పటికీ కొంత అధ్యక్షులు కూడా ఆయనకు అండగా ఉండి పార్టీని ముందుకు నడపాల్సిన అవసరం ఉందని, ఎందుకంటే నాటికన్నా నేడు తీవ్ర ఒత్తిడి పార్టీ మీద ఉందని గుర్తు చేశారు. గత అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ విజయంలో కీలకపాత్ర పోషించాలని ప్రశంసించారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు బిజెపి సర్ కార్యక్రమం ద్వారా తమ వ్యతిరేక ఓట్లను తొలగించేందుకు చేస్తున్న కుట్రలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం పార్టీ ద్వారా బిఎల్ఓ లను తయారు చేయడం జరిగిందని, ప్రతి అంశాన్ని పరిశీలించి ఓటు చోరీ అడ్డుకోగలిగితేనే రేపటి ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో ఎప్పుడు ఎక్కడ పెద్ద కార్యక్రమం జరిగిన ముందుండి స్పందించే నాయకుడు వీర్లపల్లి శంకర్ అని ప్రశంసించారు. ఆయన పూర్తిస్థాయిలో నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టారని, మండల అధ్యక్షులు మెరుగ్గా పనిచేసే వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని అన్నారు . సమర్థవంతంగా పనిచేసే పార్టీకి మంచి పేరు తీసుకురావాలని కోరారు.

### అధ్యక్షులు పార్టీ ప్రతిష్టను నిలబెట్టాలి.. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..

మండల పార్టీ అధ్యక్షులు, మున్సిపాలిటీ అధ్యక్షులు గ్రామాల నుంచి మొదలుకొని పట్టణాల వరకు పార్టీ ప్రతిష్టను నిలబెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేని సమయంలో అధ్యక్షులుగా ఎన్నికైన నాయకులు గత ప్రభుత్వంతో సమర్థవంతంగా పోరాడి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో కీలక పాత్ర పోషించాలని ప్రశంసించారు. వారి అడుగుజాడల్లో నేను నడుస్తూ కొత్త అధ్యక్షులు కూడా అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షులు నరసింహారెడ్డి షాద్ నగర్ నియోజకవర్గానికి అధికారంలో లేని రోజుల్లో నుంచి ఎంతో అండగా ఉన్నారని ప్రశంసించారు. కాంగ్రెస్ పార్టీకి ఆయన అందిస్తున్న సేవలు పార్టీ ప్రతిష్టను ఇనుమడింపజేస్తున్నాయని అన్నారు. నూతన అధ్యక్షులను ప్రకటించేందుకు ఇక్కడికి వచ్చిన ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

### అధ్యక్షుల నియామకం సంపూర్ణం..

షాద్ నగర్ నియోజకవర్గంలోని రెండు మున్సిపాలిటీలు, ఆరు మండలాలకు సంబంధించిన అధ్యక్షుల ఎంపిక నియామకం విజయవంతంగా పూర్తయింది.షాద్ నగర్ మున్సిపాలిటీ అధ్యక్షుడు నలమోని శ్రీధర్, కొత్తూరు మున్సిపాలిటీ అధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి, ఫరూక్ నగర్ మండల అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్, మిగతా మండలాల అధ్యక్షులకు నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆశయాలకు, ఆలోచనలకు అనుగుణంగా పనిచేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ విజయానికి అంకితభావంతో కృషి చేస్తామని పేర్కొన్నారు. నేతలు మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటా.. కొందుర్గు మండల అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి..

కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేస్తానని, కార్యకర్తల సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని కొందుర్గుకు మండల పార్టీ అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి అన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో నియామక పత్రం అందుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని వాటిని జనాల్లోకి తీసుకువెళ్లి ప్రజల్లో పార్టీ ప్రచారాన్ని విస్తృతం చేస్తానని హామీ ఇచ్చారు. మండల పార్టీ అధ్యక్షుడిగా తనకు అవకాశం కల్పించినందుకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, సిడబ్ల్యుసి ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచందర్ రెడ్డి, డిసిసి అధ్యక్షుడు నరసింహారెడ్డి, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే ప్రతాపరెడ్డి, మాజీ జెడ్పిటిసి శ్యాంసుందర్ రెడ్డి, కృష్ణారెడ్డి లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు..

## న్యాయం జరిగే వరకూ సమ్మె ఆగదు

**: అధ్యక్షురాలు ధనలక్ష్మి --- రెండో రోజుకు చేరిన వి వో ఏ ల నిరవధిక సమ్మె**



దమ్మపేట, నేటి శుభోదయ ::: తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించే వరకు సమ్మె ఆగదని మహిళా ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షురాలు ధనలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చాలీచాలని వేతనాలతో వేతనాలతో వెట్టి చాకిరి చేస్తూ కుటుంబ పోషణ భారంగా ఉన్న దిశలో తమకు న్యాయం చేయాలంటూ వీ ఓ ఏ లు నిర్వహిస్తున్న సమ్మె శనివారానికి రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అధ్యక్షురాలు ధనలక్ష్మి మాట్లాడుతూ కనీస వేతనాన్ని 26 వేల రూపాయలు కల్పించి సెర్ఫ్ ఉద్యోగులుగా ప్రభుత్వం గుర్తించి పని భారం తగ్గించే వరకు సమ్మె సాగుతూనే ఉంటుందని ఆమె అన్నారు. సమస్యలు పరిష్కరించని క్రమంలో ఎట్టి పరిస్థితులలో సమ్మెను ఆపేది లేదని తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు ధనలక్ష్మి తో పాటు టి భద్రమ్మ, ఎం వెంకటమ్మ, శ్రీదేవి, శ్రీలత, బి భవాని, కే కమల, మంగ,సీతమ్మ, చెన్నమ్మ తదితరులు ఉన్నారు.

## జూన్ 2 తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం వరకు 6 గ్యారెంటీలు అమలు చేయాలి

**: సిపిఎం జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు**

**- ప్రజా పాలన పేరుతో కాలయాపన చేయటం కాదు, ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలు నెరవేర్చాలి : సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు బుగ్గవిడి సరళ**




ఖమ్మం, నేటి శుభోదయ ::: జూన్ 2 తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాల వరకు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవనంలో సిపిఎం పార్టీ సీనియర్ నాయకురాలు బెల్లం లక్ష్మి అధ్యక్షుడు జరిగిన సిపిఎం పార్టీ ఫాదర్ డివిజన్ కమిటీ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ముఖ్యంగా అరు గ్యారెంటీలు అమలు చేయాలని ఆయన ఈ సందర్భంగా అన్నారు. యువ వికాసం పేరుతో నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఈ సందర్భంగా ఆయిన ఇవ్వాలని, ప్రతి గృహిణికి 2000 రూపాయలు ఇస్తానన్న హామీ నిలబెట్టుకోవాలని ఆయన సందర్భంగా అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో అర్హులైన అందరికీ ఇండ్లు ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేసే దాంట్లో చాలా లోపల ఉన్నాయి అని ఆయన అన్నారు. రైతు భరోసా పేరుతో రైతులకు సంవత్సరానికి 15000 ఇస్తామని మాట ఇచ్చి మాట తప్పారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే కాంగ్రెస్ గవర్నమెంట్ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తిగా వస్తుందని అయినా ఇచ్చిన హామీలు ఎక్కడెక్కడ ఉన్నాయి అని కనీసం జూన్ రెండు నాటికన్నా ఆరు గంటలు అమలు పూర్తి చేయాలని ఆయన సందర్భంగా అన్నారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు బుగ్గ వీటి సరళ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలు చేయకుండా కాంగ్రెస్ గవర్నమెంట్ చేస్తుందని ఆమె అన్నారు. ప్రజా పాలన చెప్పుకుంటూ ప్రజలకు చేసింది ఏమీ లేదని ఆమె అన్నారు. ఈ సమావేశంలో పార్టీ డివిజన్ కార్యదర్శి బండి రమేష్, జిల్లా కమిటీ సభ్యులు షేక్ బషీరుద్దీన్,నంద్ర ప్రసాద్, ఊరడి సుదర్శన్ రెడ్డి, కొమ్ము శ్రీను, మల్లెల సన్మంతరావు, డివిజన్ కమిటీ సభ్యులు తోటకూర రాజు, బిక్కసాని గంగాధర్, శీలం గురుమూర్తి దాసరి,మహేందర్, వడ్లమూడి నాగేశ్వరరావు, పెరుమలపల్లి మోహన్ రావు, నందిగామ కృష్ణ, ప్రతాపనేని వెంకటేశ్వర్లు, ఏటుకూరి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 26న పసుపు,వరి రైతులు ఎగుమతిదారుల అవగాహన సదస్సు



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి చిలుక విజయకుమార్ మే 23 నేటి శుభోదయ :వాణిజ్య,పరిశ్రమల మంత్రిత్వ శాఖ,విదేశీ వాణిజ్య డైరెక్టర్ జనరల్ "జిల్లాను ఎగుమతి కేంద్రంగా"ప్రకటించిన కార్యక్రమానికి అవసరమైన చర్యలను అమలు చేయడానికి ఒక కాలపరిమితితో కూడిన ప్రచారాన్ని చేపడుతున్నారు.ఈ ప్రచారం 120 ప్రాధాన్య జిల్లాలను కవర్ చేస్తుంది.వాటిలో నిజామాబాద్ ఒకటి.కొత్త ఎగుమతిదారులను సృష్టించడం,ఎంఎస్ఎంఈ ల భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం,జిల్లా స్థాయి ఎగుమతులను పెంచడం ద్వారా,డిఈహెచ్ కార్యక్రమం కింద వేసిన సంస్థాగత పునాది పనులను కొలవగల ఎగుమతి ఫలితాలుగా మార్చడమే ఈ ప్రస్తుత ప్రచారం యొక్క లక్ష్యం.ఈ విషయమై జిల్లా కలెక్టర్ అధ్యక్షతన 26.05.2026న ఉదయం 09.30 గంటల నుండి నిజామాబాద్ కలెక్టరేట్లో మెగా ఎగుమతి ప్రోత్సాహక కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించడం జరిగింది.ఈ కార్యక్రమం ప్రధానంగా నిజామాబాద్ జిల్లాలో పసుపు ఉత్పత్తిని ఎలా పెంచాలనే అంశంపై దృష్టి సారిస్తుంది.ఈ-కామర్స్ ఎగుమతుల ప్రదర్శన,ట్రేడ్ కనెక్ట్ పోర్టల్,వరి,సోయాబీన్,మొక్కజొన్న,పత్తి పంటల మార్కెట్ వైవిధ్యీకరణపై ప్రదర్శనలు ఉంటాయి.ఈ విషయమై డీజీఎఫ్టీ అధికారులు,వ్యవసాయ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు ఈ సమావేశానికి హాజరై వారి అభిప్రాయాలు ఉత్పత్తి పెంచే సూచనలు చెప్పడం జరుగుతుంది.జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ నిజామాబాద్ జిల్లాలోని రైతులు,ఎగుమతిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మేనేజర్ సురేష్ కుమార్ కోరారు.

## పదవులకు వన్నె తీసుకురండి షాద్ నగర్ ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్"

**శ్రీ అంబా భవాని మాత దేవాలయ నూతన అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా చంద్రయ్య. ఎమ్మెల్యే సమక్షంలో ఘనంగా ప్రమాణ స్వీకారోత్సవం. ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితర ప్రముఖులు. భవాని మాతకు ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్. అయ్యవార్లపై అజమాయిషీ వద్దు.. గత పాలకులు చేసిన.తప్పిదాలకే అమ్మ ఆగ్రహించింది ఎవరేం చేశారో అమ్మ అన్ని గ్రహిస్తుంది**



షాద్నగర్ నియోజకవర్గం నేటి శుభోదయ ప్రతినిధి మే 23 :పదవులు తీసుకోవడమే కాదు వాటికి వన్నెతెచ్చే విధంగా మనం చేసే పనులు గొప్పగా ఉండాలని షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరూఖ్ నగర్ మండలం ఎలికట్ల శ్రీ అంబా భవాని మాత దేవాలయం, ఆంజనేయ స్వామి దేవాలయం నూతన అభివృద్ధి కమిటీల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరయ్యారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సమక్షంలో దేవాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా చాకలి చంద్రయ్య, కమిటీ సభ్యులు నాగారం రాంరెడ్డి, బాలరత్నం గౌడ్, ముత్యాల రాములు, జంగం లింగం, మహేష్, రేణుకలతో ఎండోమెంట్ అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ .. నూతన అభివృద్ధి కమిటి సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోనే ఈ దేవాలయానికి అత్యంత ప్రాముఖ్యత ఉందని అన్నారు. కొలిచిన భక్తుల పాలిట కొంగుబంగారమై భక్తుల కోరికలు తీర్చే తల్లి శ్రీ అంబా భవాని మాత అని ఆయన పేర్కొన్నారు. భక్తులు అనేక ప్రాంతాల నుండి ఇక్కడికి వస్తుంటారని వారి కోసం అన్ని సౌకర్యాలు తీర్చిదిద్దాలని ఎండోమెంట్ శాఖ సహకారంతో ఇక్కడ పాలకవర్గం నూతనంగా ఎన్నికైన వారు ఎంతో బాధ్యతగా తమ పనులు చేపట్టాలని సూచించారు.పదవులు తీసుకోవడం కాదు, పదవులకు వన్నె తెచ్చే విదంగా ఉండాలన్నారు. గత కమిటీ ఉన్నప్పుడు నిధులు తెచ్చాం కానీ పనులు జరగలేదన్నారు.

### అమ్మకు అన్నీ తెలుసు..

శ్రీ అంబ భవాని మాతకు అన్ని తెలుసు ఎవరెన్ని చేసినా అమ్మ చూస్తూ ఊరుకోదు అని గత పాలకవర్గం డబ్బులు ఉన్నప్పటికీ కూడా అభివృద్ధి పనులు చేపట్టలేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అమ్మవారి దగ్గర ఎవరేం చేశారు అంబ భవాని అన్ని గ్రహిస్తుందని ఇక్కడ రాజకీయాలు చేస్తే అంత మంచిది కాదని అమ్మవారు తిరిగి చూపిస్తారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్యాత్మిక ధోరణితో హెచ్చరించారు. 50 లక్షలు మంజూరు చేసినా ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. భవాని మాత సేవ, ఆలయ అభివృద్ధి చేయాలని సూచించారు. బాధ్యతలు తీసుకున్నప్పుడు దానికి కట్టుబడి ఉండాలని కోరారు. ఎవరు ఎవరి హయాంలో మంచి అభివృద్ధి పనులు చేసిన ఎల్లకాలం గుర్తుండి పోతుందని అన్నారు.

### అయ్యవార్లపై అజమాయిషీ వద్దు..

అంబ భవాని ఆలయంలో అయ్యవార్లపై ఆజమయిషి చెలాయించే ప్రయత్నం చేయొద్దని ఎమ్మెల్యే అన్నారు.పట్టణంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు బాధ్యత తీసుకుని ఎంతో అభివృద్ధి చేసారని గుర్తు చేశారు. బాధ్యత ఉంటే మరింత అభివృద్ధి సాధ్యమని అన్నారు. ఎవరు ఎవరికి శత్రువులుగా ఉండకుండా అందరూ కలిసి దేవాలయం, గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేసుకోవాలన్నారు. సంకల్పంతో పని చేయండని సూచించారు. దాతలు, భక్తుల సహాయ సహకారాలతో అభివృద్ధి చేసుకుందామని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాక సందర్భంగా అంతకుముందు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు..

## కోర్టు కాంప్లెక్స్ లో 15 లక్షల రూపాయల అభివృద్ధి పనులకు పూజా కార్యక్రమం

**పూజా కార్యక్రమాలు నిర్వహించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ .నాణ్యతతో కూడిన పనులు చేయాలని ఇంజనీర్లకు సూచన పార్టీలకతీతంగా అభివృద్ధి జరగాలి... అభివృద్ధికి నేనెప్పుడూ సహాయంగా ఉంటా న్యాయవాదుల రక్షణకై న్యాయవాద రక్షణ చట్టం కచ్చితంగా అవసరం.ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టీకరణ**



షాద్నగర్ నియోజకవర్గం నేటి శుభోదయ ప్రతినిధి మే 23:కోర్టు కాంప్లెక్స్ లో జరిగే పలు అభివృద్ధి పనులు భావితరాల ప్రజలకు కూడా ఎంతో ఉపయోగపడతాయని, పార్టీలకతీతంగా అభివృద్ధి జరిగినప్పుడే వాటి ఫలాలు ప్రజలకు అందుతాయని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కోర్టు కాంప్లెక్స్ లో మున్సిపల్ సాధారణ నిధుల కింద 15 లక్షల రూపాయల సిసి రోడ్డు మరియు డ్రైనేజీ అభివృద్ధి కార్యక్రమాలకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బీరంగూడ జగన్మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమాలకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరయ్యి పూజా కార్యక్రమాలు నిర్వహించి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. అదేవిధంగా నాణ్యతతో కూడిన పనులు చేయాలని, ఈ అభివృద్ధి పనులు భావితరాలకు కూడా ఫలాలు అందించే విధంగా ఉండాలని ఇంజనీర్లకు సూచించారు.

### ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు ఘన సన్మానం

కోర్టు కాంప్లెక్స్ లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు విచ్చేసి పూజా కార్యక్రమాలు నిర్వహించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను బార్ అసోసియేషన్ కమిటీ ఆధ్వర్యంలో శాలువాలతో సన్మానించి ఘనంగా సత్కరించారు.

### న్యాయవాదుల రక్షణకై న్యాయవాద రక్షణ చట్టం... ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఒక వైపు ప్రజా ప్రతినిధులు కానీ మరొకవైపు న్యాయవాదులు కానీ ప్రజల సంక్షేమం కోసమే పాటుపడతారని న్యాయవాదుల పై కక్షలు పెంచుకొని భౌతిక దాడులకు పాల్పడడం సరైన చర్య కాదని, న్యాయవాదులకు రక్షణగా న్యాయవాద రక్షణ చట్టం కచ్చితంగా ఉండి తీరాల్సిందేనని, ఈ విషయంపై అసెంబ్లీలో కూడా చర్చించి బిల్లు పెట్టడం జరిగిందని, దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి తో పాటు ఉమ్మడి పాలమూరు జిల్లా ఎమ్మెల్యేలందరూ న్యాయవాద రక్షణ చట్టం విషయంపై ముఖ్యమంత్రితో కూడా చర్చించి బిల్లును అసెంబ్లీలో పెట్టి బిల్లు పాస్ చేయించామని అన్నారు. కోర్టు కాంప్లెక్స్ లో ఇంకా జరగబోయే అభివృద్ధి పనులకు తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని అందరం కలిసి మెలిసి అభివృద్ధి పనులు జరుపుకోవాలని, అభివృద్ధి అంటే మన ఒక్కడిదే కాదు అందరు ప్రజలకు సంబంధించిందని, అభివృద్ధి కార్యక్రమాలకు తమ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తో పాటు మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందేమోహన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, గ్రంథాలయ చైర్మన్ కొప్పుల మదన్మోహన్ రెడ్డి, కౌన్సిలర్లు అప్పి, పెంటయ్య, శ్రావణి, నరేష్, కొప్పునూరు ప్రవీణ్, పట్టణ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దంగు శ్రీనివాస్ యాదవ్, ఇబ్రహీం, ముబారక్ అలీఖాన్, సాదిక్ లతో పాటు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు నర్వ వేణుగోపాలరావు, న్యాయవాద బార్ అసోసియేషన్ కమిటీ సభ్యులు, పట్టణ మహిళా న్యాయవాదులు, సీనియర్ జూనియర్ న్యాయవాదులు, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మైనర్ సర్జరీకి వెళ్లి ప్రాణాలు కోల్పోయిన యువతి

**-- వైద్యుల నిర్లక్ష్యమా? గాంధీ ఆసుపత్రిలో ఉద్రిక్తత ముగ్గురు వైద్యులతో కమిటీ రెండు రోజుల్లో నివేదిక గాంధీ సూపరింటెండెంట్ డా. వాణి ఆదేశాలు**




సికింద్రాబాద్ నేటి శుభోదయ మే 23 : మైనర్ శస్త్ర చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చిన యువతి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో కలకలం రేపింది. మృతురాలు పల్లవి గౌడ్ మరణంపై కుటుంబ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పల్లవి తండ్రి మాట్లాడుతూ, చిన్న సర్జరీ కోసం వచ్చిన తన కూతురు వైద్యుల నిర్లక్ష్యం వల్లనే ప్రాణాలు కోల్పోయిందని ఆరోపించారు. సీనియర్ డాక్టర్ పర్యవేక్షణ లేకుండా ట్రైనీ డాక్టర్లతో శస్త్ర చికిత్స చేయించడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని వాపోయారు. తన కూతురికి శస్త్ర చికిత్స చేసిన డాక్టర్ పేరు ఎందుకు వెల్లడించడం లేదని ప్రశ్నిస్తూ, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తన కూతురి మరణానికి కారణమైన వారిని వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

### విమలక్క:-

సామాజిక కార్యకర్త విమలక్క మాట్లాడుతూ, ప్రజలు నమ్మకంతో వచ్చే ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు మరింత జాగ్రత్తగా అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఇదే కాలేజీలో చదువుతున్న పల్లవి, మంచి వైద్యం లభిస్తుందనే నమ్మకంతో గాంధీ ఆసుపత్రిలో చేరిందని పేర్కొన్నారు. చిన్న సర్జరీ కోసం వెళ్లి ప్రాణాలు కోల్పోవడం చాలా బాధాకరమన్నారు. అయితే ఆసుపత్రి నూపరింటెండెంట్ సీనియర్ వైద్యుల పర్యవేక్షణలోనే చికిత్స అందించామని చెప్పినట్లు తెలిపారు. ఘటనపై పూర్తి స్థాయి విచారణ కోసం కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించాన్నారు.

### ఆసుపత్రి వర్గాల వివరణ :

గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. వాణి మాట్లాడుతూ, ఘటనపై నిజ నిర్ధారణ కోసం ముగ్గురు వైద్యులతో విచారణ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రెండు రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్లు చెప్పారు.ఇంచార్జ్ డాక్టర్ లేకుండా శస్త్ర చికిత్స జరిగిందన్న ఆరోపణలు అసత్యమని ఖండించారు. ఆసుపత్రిలో ఎటువంటి శస్త్ర చికిత్సలు కూడా సీనియర్ వైద్యుల పర్యవేక్షణ లేకుండా జరగవని స్పష్టం చేశారు.పల్లవికి రెండు సార్లు శస్త్ర



చికిత్సలు చేసిన విషయం నిజమేనని, మొదటి సర్జరీ అనంతరం రక్తస్రావం ఆగకపోవడంతో మరుసటి రోజు రీ-ఎక్స్‌ప్లోరేషన్ సర్జరీ నిర్వహించినట్లు వివరించారు. రక్త గడ్డలను తొలగించి అవసరమైన రక్తం అందించినట్లు తెలిపారు."పోయిన ప్రాణాన్ని తిరిగి తీసుకురాలేము. అయితే కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటాం," అని డా. వాణి హామీ ఇచ్చారు.ఈ ఘటనపై విచారణ నివేదిక కోసం అందరూ ఎదురుచూస్తున్నారు.

# ఎస్ ఐ కి అభినందనలు



దమ్మపేట, నేటి శుభోదయ ::: ఎస్ఐ రాజేష్ కుమార్ ను కలిసిన గ్రామపంచాయితీ పాలకవర్గం. నూతనంగా దమ్మపేట ఎస్ఐ గా బాధ్యతలను స్వీకరించిన బి రాజేష్ కుమార్ ను స్థానిక సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు, వార్డు సభ్యులు శనివారం స్థానిక పోలీస్ స్టేషన్లో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, తదితర సభ్యులు పాల్గొన్నారు.

# అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా భుజంగరావు

బాధ్యతల స్వీకరణ



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి చిలుక విజయకుమార్ మే 23 నేటి శుభోదయ :నిజామాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా వి.భుజంగరావు నియమితులు అయ్యారు.ఈ మేరకు ప్రభుత్వం నియామక ఉత్తర్వులు వెలువరించగా,శనివారం ఆయన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని తన ఛాంబర్ కు చేరుకుని బాధ్యతలు స్వీకరించారు.కలెక్టర్ ఇలా త్రిపాఠిని మర్యాదపూర్వకంగా కలిశారు.నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్ భుజంగరావును వివిధ శాఖల జిల్లా అధికారులు కలిసి పూల బొకేలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

# వ్యవసాయ కార్మిక సంఘం యాచారం మండల కమిటి సమావేశం

-కామ్రేడ్ జగన్ అధ్యక్షతన.

-వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పి అంజయ్య.



ఇబ్రహీంపట్నం (నేటి శుభోదయ) ప్రతినిధి మే 23:రంగారెడ్డి జిల్లా మహా సభలు జూన్ 13 14 తేదీల్లో షాద్ నగర్ లో జరుగు తున్నందున ఆలోపల మండల మహా సభలు జరుపుకోవాలి కాబట్టి సంఘం మండల 12 వ మహా సభ జూన్ 07-06-2026 ఆదివారం రోజున కొత్తపల్లిలో జరపాలని నిర్ణయం చేయడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు పి అంజయ్య మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘం నిరంతరం భూమి ఉపాధి పేద ప్రజల సమస్యల పరిస్కారం కోసం పనిచేస్తుంది.ఎర్రజండా పోరాటం ఫలితంగ వచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కరువులో కూలీలను ఆదుకుంటుంది బిజెపి ప్రభుత్వం కుట్ర బుద్ధితో చట్టాన్ని పూర్తిగా రద్దు చేయాలనే కుట్రతో అనేక మార్పులు చేసి నిర్వీర్యం చేస్తూ కూలీల పొట్టకోట్టే పని చేస్తూంది.2సార్లు ఫోటో దింపే విధానం పెట్టడంతో ఫోటోలు రాక పోవడంతో కూలీలు ఎర్రటి ఎండలో గంటల తరబడి నీలబడవలసి వస్తుంది గాంధీ పేరుతో వున్నా చట్టాన్ని మర్చి జి రామ్ జి చట్టాన్ని కేంద్ర బిజెపి ప్రభుత్వం తెచ్చింది.



నిత్యవసరాల ధరలతో సతమాత మౌతున్న పేద మధ్య తరగతి ప్రజలు. మరొమారు బిజెపి కేంద్ర ప్రభుత్వం పెట్రల్ డీజిల్ రేట్లు పెంచడం తో పేద మధ్యతరగతి ప్రజలమీద మరింత భారం పడింది దీని వలన ప్రజలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు కావున పెంచిన పెట్రోల్ డీజిల్ రేట్లు వెంటనే తగ్గించాలి.రాష్ట్ర ప్రభుత్వం ఎన్నిలల్లో ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలి అన్ని రకాల పింఛండ్లు పెంచాలి ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన వారందరికీ ఇవ్వాలి కూలీలకు ఇస్తామన్నా 12000 రూపాయలు ఇవ్వాలి పరిశ్రమల పేరుతో సేకరిస్తున్న బలవంతపు భూసేకరణ ఆపాలి ఫార్మసిటీలో భూములు కోల్పోయిన వారందరికీ పూర్తిగా పరిహారం ప్లాట్లు ఇవ్వకుండా ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం మానుకోవాలని ఈ సందర్భంగా ఏచ్చారిస్తున్నాము ఈ కార్యక్రమం లో రాష్ట్ర కమిటీ సభ్యులు పుష్ప మండల నాయకులు ఎం జంగయ్య ఎం రాములు ఇందిరమ్మ పి జంగయ్య పి రమేష్ ఎస్ రాములు సురేష్ రమేష్ మహేష్


# మార్కెట్ వాల్యూ అప్డేషన్ వేగవంతం చేయాలి

:ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ లోకేష్ కుమార్

ఫామ్ 1,2,3,4 అప్డేషన్ త్వరితగతిన చేపట్టాలి



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి చిలుక విజయకుమార్ మే 23 నేటి శుభోదయ :హైదరాబాద్ నుండి చీఫ్ కమిషనర్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ లోకేష్ కుమార్,రెవెన్యూ శాఖ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మార్కెట్ వాల్యూ అప్డేషన్ పై శనివారం సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ......రాష్ట్ర వ్యాప్తంగా మార్కెట్ వాల్యూ అప్డేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు.భూభారతి ఐజీఆర్ఎస్ పోర్టల్లో ఫామ్ 1, 2, 3, 4లకు సంబంధించిన అప్డేషన్ ప్రక్రియను వేగవంతంగా చేపట్టాలని సూచించారు.జీవో నెంబర్ 44 ప్రకారం జిల్లా స్థాయి నుండి మండల స్థాయి వరకు కమిటీలను ఏర్పాటు చేసి మార్కెట్ వాల్యూ సవరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు.భూ లావాదేవీలు,రిజిస్ట్రేషన్ వ్యవస్థలో పారదర్శకత పెంపుతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఈ ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.వీడియో కాన్ఫరెన్స్లో కలెక్టర్ ఇలా త్రిపాఠి,అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.



# పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలి

-- సిద్ధార్థ జూనియర్ కళాశాల రోడ్డును వెంటనే మరమ్మతు చేయాలి

బి ఆర్ ఎస్ నాయకుడు నాగారం వినోద్ కుమార్



వికారాబాద్ మే 23 నేటి శుభోదయ :వికారాబాద్ పట్టణంలోని 29వ వార్డు బీఆర్ఎస్ నాయకుడు నాగారం వినోద్ కుమార్ పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో ఇంధన ధరల భారం సాధారణ ప్రజలపై మరింత ప్రభావం చూపుతోందన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం వల్ల రవాణా ఖర్చులు అధికమై ప్రతి కుటుంబ ఆర్థిక పరిస్థితిపై ప్రతికూల ప్రభావం పడుతోందని తెలిపారు.అదేవిధంగా వికారాబాద్ పట్టణంలోని సిద్ధార్థ జూనియర్ కళాశాల రోడ్ పూర్తిగా అధ్వానంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డంతా గుంతలమయంగా ఉండటంతో విద్యార్థులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వర్షాలు పడుతున్న సమయంలో పరిస్థితి మరింత దారుణంగా మారి ప్రమాదాలకు కారణమవుతోందన్నారు.సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని నాగారం వినోద్ కుమార్ డిమాండ్ చేశారు.

# కొత్తూరు మండలంలో హిందూ సమ్మేళనం మహాసభ

గ్రామాల్లో కొనసాగుతున్న హిందూ సమ్మేళనం సన్నాహక సమావేశాలు

స్టేషన్ తిమ్మాపూర్, కొత్తూరు తండాలో గోడ పత్రిక విడుదల చేసిన కమిటీ సభ్యులు



షాద్నగర్ నియోజకవర్గం నేటి శుభోదయ ప్రతినిధి మే 23: షాద్నగర్ నియోజకవర్గం కొత్తూరు మండలంలోని హిందూ సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణ కోసం వాడవాడల ఏర్పాటు చేస్తున్న హిందూ సమ్మేళనాలు జయప్రదంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగానే ఈ నెల 25న సోమవారం సాయంత్రం కొత్తూరు పురపాలక కేంద్రంలోని పెంజర్ల రహదారిలో గల బండారి గ్రౌండ్లో నిర్వహించనున్న



భారీ బహిరంగ హిందూ సమ్మేళనం సభ కోసం కొత్తూరు ఉప మండలం పరిధిలోని ఇన్ముల్ నర్వ, రంగాపూర్, కొత్తూరు, స్టేషన్ తిమ్మాపూర్, తిమ్మాపూర్, కుమ్మరిగూడ, అక్కివేనిగూడ, తాళ్లగూడ, మల్లాపూర్, మల్లాపూర్ తాండ, కొత్తూరు తండాల పరిధిలో సన్నాక సమావేశాలు ముగింపు దశకు చేరుకున్నాయి. శనివారం కొత్తూరు తాండ, స్టేషన్ తిమ్మాపూర్ లో సమ్మేళనం కమిటీ పర్యటించింది. సమ్మేళనం విజయవంతానికి హిందూ బంధువులు గడప దాటి బయటి ప్రపంచానికి తామంతా ఒక్కటేనన్న సంకేతాన్ని తెలియజేస్తూ గళం విప్పాలని కోరారు. అనంతరం గోడ పత్రికలు, కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు విష్ణు చారి, సభ్యులు సుదర్శన్ గౌడ్, నాగరాజు చారి పాల్గొనగా.. కొత్తూరు తండాలో రవి నాయక్, సోమ్లా నాయక్, గోవింద్ నాయక్, అంజి నాయక్, స్టేషన్ తిమ్మాపూర్ లో డోలి రవీందర్, పాశం కృష్ణ, శివకుమార్ గౌడ్, తదితర గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# వికారాబాద్ నుంచి మరో ఉద్యమానికి సిద్ధం

: మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్



వికారాబాద్ మే 23 నేటి శుభోదయ:వికారాబాద్ జిల్లా సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ప్రజల హక్కుల కోసం వికారాబాద్ నుంచే మరో ఉద్యమాన్ని ప్రారంభిస్తామని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ హెచ్చరించారు. హైదరాబాద్లోని తెలంగాణ భవన్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డి వైఖరిపై తీవ్ర విమర్శలు చేశారు.వికారాబాద్ జిల్లాకు సీఎం, అసెంబ్లీ స్పీకర్ ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ జిల్లాకు తగిన న్యాయం జరగలేదని అన్నారు. రెండున్నరేళ్లు గడిచినా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు మిగిలిన పనులు పూర్తి చేయకపోవడం వల్ల జిల్లాలో సాగునీటి సమస్య అలాగే కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఒక్కో నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు.సీఎం రేవంత్ రెడ్డి కొడంగల్ నియోజకవర్గానికే ప్రాధాన్యత ఇస్తున్నారని, నారాయణపేట్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా అక్కడికి నీళ్లు తీసుకురావాలని ప్రయత్నిస్తుండగా మిగతా మూడు నియోజకవర్గాల పరిస్థితిని పూర్తిగా విస్మరిస్తున్నారని విమర్శించారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు ద్వారా వికారాబాద్కు నీళ్లు వస్తాయని చెప్పడం ప్రజలను మోసం చేయడమేనని అన్నారు.రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్ల పరిస్థితి దారుణంగా ఉందని, ముఖ్యంగా వికారాబాద్ జిల్లాలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ అంశంపై అసెంబ్లీ స్పీకర్ వెంటనే స్పందించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై బీఆర్ఎస్ పాదయాత్ర చేపట్టనున్నట్లు ప్రకటించగానే ప్రభుత్వం ఎమ్మెల్యేలతో సమీక్షలు నిర్వహించిందని, ఇది ప్రజా ఒత్తిడికి భయపడిన సంకేతమని వ్యాఖ్యానించారు. అలాగే బీఆర్ఎస్ హయాంలోనే వికారాబాద్ రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జ్కు ఆమోదం లభించిందని, ఆ పనులను వెంటనే పూర్తి చేయాలని కోరారు.వికారాబాద్ పట్టణంలో త్రాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా మారిందని ఆరోపించారు. జిల్లాలో ఇప్పటివరకు ఎన్ని రోడ్లు నిర్మించారో అసెంబ్లీ స్పీకర్ శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ నాయకులు భూముల ఆక్రమణలకు పాల్పడుతున్నారని ఆరోపించిన మెతుకు ఆనంద్, ప్రభుత్వం ప్రజా సమస్యలను పక్కనపెట్టి భూముల రాజకీయాల్లో నిమగ్నమైందని విమర్శించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి కూడా క్షీణించిందని అన్నారు.చివరగా మాజీ సీఎం కేసీఆర్ను ప్రజలు ఉత్తమ ముఖ్యమంత్రిగా గుర్తుంచుకుంటారని, రేవంత్ రెడ్డి మాత్రం అత్యంత విఫలమైన ముఖ్యమంత్రిగా నిలిచిపోతారని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ప్రజల్లో తీవ్ర అసంతృప్తి పెరుగుతోందని, ఇదే పరిస్థితి కొనసాగితే ప్రజల తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు.

# జన గణన ప్రక్రియను పక్కాగా నిర్వహించాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి చిలుక విజయకుమార్ మే 23 నేటి శుభోదయ :ప్రాధాన్యతతో కూడిన జన గణన ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు.జన గణనలో భాగంగా కొనసాగుతున్న హౌస్ లిస్టింగ్ ప్రక్రియను కలెక్టర్ శనివారం సాయంత్రం నిజామాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.గౌతంనగర్,ఆర్య నగర్ టెలికాం కాలనీలలో హౌస్ లిస్టింగ్ నిర్వహిస్తున్న తీరును కలెక్టర్ పరిశీలన జరిపారు.ఎన్యూమరేటర్లు,సూపర్వైజర్లు గుర్తింపు కార్డులు ధరించారా లేదా అన్నది గమనించారు.వారు జన గణన విధులు నిర్వర్తిస్తున్న తీరును పరిశీలించి,ఇప్పటివరకు హౌజ్ లిస్టింగ్ ఎంత శాతం పూర్తయ్యింది తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు.స్వీయ గణన చేసుకున్న వారికి సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి,పక్కాగా నిర్ధారణ చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.జన గణన కోసం వెళ్లే సమయంలో క్యూ.ఆర్ కోడ్ తో జారీ చేయబడిన ఐ.డీ కార్డును తప్పనిసరిగా ధరించాలని సూచించారు.తప్పిదాలకు అవకాశం లేకుండా జాగ్రత్తగా జన గణన జరపాలని అన్నారు.జన గణనకు సంబంధించి ప్రగతిని తెలియజేస్తూ రోజువారీ నివేదికలు పంపాలని ఆదేశించారు.కలెక్టర్ వెంట నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్,కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజ్,సూపర్వైజర్లు హన్మాండ్లు, సాయిరాం, ఎన్యూమరేటర్లు భాగ్యలక్ష్మి, రాము తదితరులు ఉన్నారు



# సెంట్రింగ్ కార్మికుల డిమాండ్ల సాధన కై సమ్మె ఉధృతి ..

మరో వారం కొనసాగింపు నిర్ణయం..



శేరిలింగంపల్లి నేటి శుభోదయ : శేరిలింగంపల్లి నియోజక వర్గం కొండాపూర్ సెంట్రింగ్ యూనియన్ ఆధ్వర్యంలో చైర్మన్ విశ్వనాథ్ యాదవ్, ప్రెసిడెంట్ రాము యాదవ్, జనరల్ సెక్రటరీ సామ ఎల్లారెడ్డి, వైస్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి నాయకత్వంలో సెంట్రింగ్ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన సమ్మె ఉధృతంగా కొనసాగుతోంది. సెంట్రింగ్ రేటును రూ.51 పెంచాలని, కార్మికులకు ఈఎస్ఐ కార్డుల సౌకర్యం కల్పించాలని , ప్రతి నిర్మాణ స్థలంలో సెంట్రింగ్ మెటీరియల్ దొంగతనాలను అరికట్టాలని వారు డిమాండ్ చేశారు. మే 16 నుంచి ప్రారంభమైన ఈ సమ్మె 8వ రోజుకు చేరుకోగా, శనివారం (23-05-2026) కొండాపూర్ యూనియన్ తరఫున సుమారు 200 మంది కాంట్రాక్టర్లు టూ-వీలర్ ర్యాలీ నిర్వహించారు. కొండాపూర్ నుంచి ధర్నా చౌక్ వరకు భారీ ర్యాలీ చేపట్టి, అనంతరం ఇందిరా పార్క్ వద్ద కి చేరి దర్నాలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా యూనియన్ జనరల్ సెక్రటరీ సామ ఎల్లారెడ్డి మాట్లాడుతూ, "మా న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు సమ్మెను విరమించే ప్రసక్తే లేదు" అని స్పష్టం చేశారు.అలాగే, సమ్మెను మరో వారం రోజుల పాటు కొనసాగించాలని ఈ రోజు సమావేశంలో తీర్మానించినట్లు నాయకులు తెలిపారు.

# బీసీ నేత మహేష్ కుమార్ గౌడ్ మీద పెద్ద కుట్ర జరుగుతుంది

నిజామాబాద్ కార్పొరేషన్ డిసిసి అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి చిలుక విజయకుమార్ మే 23 నేటి శుభోదయ :తెలంగాణ కాంగ్రెస్ లో ఎదిగి వచ్చిన బీసీ నేత మహేష్ కుమార్ గౌడ్ మీద 'బిగ్' కుట్ర జరుగుతోంది..ఒక టీవీ చానల్ లో శుక్రవారం అన్ని బులెటిన్లలో మహేష్ గౌడ్ ను విఫల పీసీసీ చీఫ్ గా నమ్మించడానికి విష ప్రచారం జరుగుతుంది.20 ఏళ్లుగా ఇలాంటి వ్యక్తిగత దాడి ఏ పీసీసీ అధ్యక్షుడి మీద జరగలే.. ఎప్పుడూ చూడలే.. మహేష్ గౌడ్ టార్గెట్ ఎందుకు..?తెలంగాణ రాజకీయాల్లో బీసీ రాజ్యాధికారం కాంక్ష ఇటీవలి కాలంలో తారా స్థాయికి చేరుకుంది.సమీప భవిష్యత్తులో వచ్చే ఏ ఎన్నికల్లో అయినా బీసీ లకు రాజకీయ ప్రాధాన్యం పెంచక తప్పని సరి పరిస్థితిని అన్ని పార్టీలు ఎదుర్కోబోతున్నాయి.ఈ నేపథ్యంలో మహేష్ గౌడ్ ను రేవంత్ కొలువులో చేర్చి..అవసరమైతే బీసీ కోటలో డిప్యూటీ సీఎం పదవిని అప్పచెబుతారని ఇటీవలి కాలంలో బలమైన ప్రచారం జరుగుతోంది.ఈ నేపథ్యంలో అనూహ్యంగా మహేష్ గౌడ్ పీసీసీ చీఫ్ గా పెయిల్ అయ్యారని బద్నాం చేసే పంచ రంగుల 'బిగ్' కుట్ర స్క్రీన్ మీదకొచ్చి పైశాచిక ఆనందం పొందుతోంది.విషపు ప్రచార బులెటిన్స్ మీద మహేష్ గౌడ్ కు అనుకూలంగా ఒక్క గొంతు కూడా లేవలేదు.ఈ వ్యక్తిగత దాడి ..ఈ పరిణామాలన్నీ చూస్తూ కాంగ్రెస్ పార్టీ పెద్దలు 'బిగ్' కుట్ర మీద స్పందించకుండా మౌనం వహిస్తే మాత్రం చారిత్రక తప్పిదమే అవుతుంది.ఒక బలమైన బీసీ నేత మీద జరుగుతున్న ఈ విషపు దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాను.మహేష్ గౌడ్ ని చాలా సంవత్సరాలుగా చూసిన వ్యక్తులకు ఆయన స్వభావం తెలుసు.పార్టీలు ఏదైనా,అధికారం ఉన్న,లేకపోయినా సరే అందరితో ఆయన సన్నిహితంగానే ఉంటాడు..సమస్యతో ఎవరైనా వస్తే పరిష్కరించే దిశగా అడుగులు వేస్తాడే తప్ప..ఎవరిని కూడా నొప్పించని మృదుస్వభావి అని నిజామాబాద్ నగర కార్పొరేషన్ డిసిసి అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ అన్నారు.

# చింతూరులో ఘనంగా చలివేంద్రం ప్రారంభం

: సేవా రంగంలో టీడీపీ ముందంజ



చింతూరు, నేటి శుభోదయ ::: పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, తీవ్రమైన ఎండల కారణంగా ప్రజలు, ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను గమనించిన యం ఎల్ ఏ మిర్యాల శిరీష దేవి ఆదేశాలతో చింతూరు మండల తెలుగుదేశం పార్టీ (టీడీపీ) ఆధ్వర్యంలో చింతూరు మండల టీడీపీ అధ్యక్షులు మహ్మద్ జమాల్ ఖాన్ సమక్షంలో, మండల పార్టీ కార్యకర్తలు స్థానికంగా శనివారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రం ద్వారా బాటసారులకు, ప్రయాణికులకు, స్థానిక ప్రజలకు చల్లని త్రాగునీరు అందిస్తూ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా చలివేంద్రాన్ని ప్రారంభించిన మహ్మద్ జమాల్ ఖాన్ మాట్లాడుతూ, తీవ్రమైన ఎండల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇలాంటి క్లిష్ట సమయంలో ప్రజలకు అవసరమైన సాయం అందిస్తూ అండగా నిలబడటం ప్రతి నాయకుడి, కార్యకర్త బాధ్యతఅని,ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలంతా తమ ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు . ఎండల్లో తిరిగేటప్పుడు తగినంత నీరు త్రాగుతూ బాడీని హైడ్రేట్గా ఉంచుకోవాలని కోరారు .అనంతరం పార్టీ కార్యకర్తలు మాట్లాడుతూ, "తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ ప్రజల పక్షాన నిలిచే పార్టీ. కేవలం రాజకీయం కోసమే కాకుండా, ప్రజలకు ఏ కష్టం వచ్చినా స్పందించడంలో మా పార్టీ ఎప్పుడూ ముందుంటుందని . ఇలాంటి సేవా కార్యక్రమాలను రాబోయే రోజుల్లో కూడా నిరంతరం కొనసాగిస్తామ ని స్పష్టం చేశారు.ఈ తీవ్రమైన ఎండల తరుణంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం పట్ల స్థానిక ప్రజలు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తూ, వారిని అభినందించారు.ఈ కార్యక్రమంలో చింతూరు మండల టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.